# శారదలేఖలు

(రెండవ సంపుటము)

కనుపర్తి వరలక్ష్మమ్మ.

## శ్రీమతి తెలికిచర్ల వసుంధరాదేవి, యం.ఎ.బి.యస్‌సి (లండన్)

## గారి యభిప్రాయము.

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారి శారదలేఖల సంపుటమును జూచితిని. సంతోషముతో జదివితిని. స్త్రీల కందఱకును బోధపడునట్లు సరళశైలిని, మన ఆచారవ్యవహారములగురించియు, తీర్థయాత్రలగురించియు, నవీనస్త్రీయుద్యమములగురించియు వ్రాసి స్త్రీలోకమున కీమె యొనర్చిన యుపకార మెంతయు కొనియాడదగినది. భర్తృసేవానిరతలై, సంసారబంధముల ద్రెంపుకొన నశక్తలై, తమ పతిసుతుల శ్రేయోభివృద్ధికై యెల్లప్పుడు నింటనేయుండి, దేశపరిస్థితుల తెలియగోరెడి స్త్రీల కీ శారదలేఖలు చాల యుపయోగపడుననుటకు సందియములేదు.

వరలక్ష్మమ్మగారు ఒక లేఖలో "నా జీవము ధర్మము, నా మతము నీతి, నా లక్ష్యము సతీశ్రేయము" అని వ్రాసియుండిరి. ఈ మూడింటిని తమలేఖలయందు సమర్థించినందుల కామెను నే నభినందించుచున్నాను. ఇదేరీతిని చాలకాల మామెకలము ప్రవహించుచుండవలెనని నాకోరిక.

స్త్రీలపాలిటి కామధేనువో యను గృహలక్ష్మిపత్రికను ప్రకటించుచు డా॥ కేసరిగారిదివరకే స్త్రీలకృతజ్ఞతకు పాత్రులైరి. ఇప్పుడు స్త్రీల కెంతయో యుపయోగకరమగు శారదాలేఖల ప్రత్యేకసంపుటముగా ముద్రింపించుటయేకాక, దానిని వరలక్ష్మమ్మగారికి బహుమతిచేసి ఆమెను గౌరవించుట శ్రీ కేసరిగారు స్త్రీలోకమునంతను గౌరవించినట్లు భావించవలసియున్నది. సతీమణుల శ్రేయోభివృద్ధికై పాటుపడుచున్న శ్రీ కేసరిగారును, ఆయనకోరికల సంతృప్తిగ నెరవేర్చుచున్న గృహలక్ష్మిపత్రికయు, శుక్లపక్ష చంద్రునిబోలె దినదినాభివృద్ధి గాంచవలెనని నా ప్రార్థన.

క్వీన్ మేరీకళాశాల, తెలికిచర్లవసుంధర.

8-3-34

# విషయసూచిక

1-వ లేఖ 1—7.

నాల్గవ "గృహలక్ష్మి పుట్టినదినము;" ఆశీర్వాదప్రదానము.

2-వ లేఖ 8—13.

రాజకీయములలో పూర్వయుగములయందును ప్రస్తుత యుగమునందును స్త్రీలే చెఱలబడి దేశమాతను కష్టవిముక్తనుగా జేసిరి.

3-వ లేఖ 14—27.

పూర్ణమ్మ యను శుష్కవేదాంతిని కథ—'గురుపీఠముల నుండదగినవారు' మొదలగు పరమార్థ విషయములు.

4-వ లేఖ 28—40.

విధివశమున విధవయగు యువతికి శుష్కవేదాంతపాఠముఅనర్థకరము; దేశసేవ ముఖ్యము; దానికిగల యనేకవిధమార్గములు.

5-వ లేఖ 14—56.

ఐదవ ఆంధ్రరాష్ట్రీయ మహిళాసభాప్రస్తావన; అమరావతీయాత్ర; ఏతద్వివరణము.

6-వ లేఖ 57—62.

గోదావరీ పుష్కర ప్రశంస. శాస్త్రజ్ఞుల విధి; ప్రజలకర్తవ్యములు.

7-వ లేఖ 63—74.

అస్పృశ్యతను గూర్చి.

8-వ లేఖ 75—80.

తే 1-4-33 దీ గృహలక్ష్మియందు పుష్పచయమున బ్రకటింపబడిన 'స్త్రీలప్రజ్ఞా విశేషము'లను లేఖకు విమర్శనము.

9-వ లేఖ 81—88.

స్త్రీలు, ప్రస్తుతపు ధరలనుజూచి లాభాపేక్షతో దమనగల నమ్ముట, దేశమున కమంగళకరమును, దరిద్రహేతువును.

10-వ లేఖ 89—96.

పూర్వలేఖమీది విమర్శనలకు ప్రతివిమర్శనము.

11-వ లేఖ 97—103.

మహాత్ముని హరిజనయాత్రలో గుంటూరునందుజరిగిన సభావివరములు.

# శారదలేఖలు

రెండవసంపుటము.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

నేడు నీకొకశుభవర్తమానము తెలియజేయభాగ్యమొదవినందులకు నాకు మిగుల సంతసమగుచున్నది. ఏమన ఏపత్రికాకుమారి మూడువత్సరములనుండి మనలేఖాప్రచురణభారమువహించి మన యుత్తరప్రత్యుత్తరములను నిర్నిరోధముగా జరుగునట్లు తోడ్పడుచున్నదో, ఏపత్రికాకుమారి మన యాంధ్రమహిళామణుల ఆరోగ్యసౌభాగ్యములను పెంపొందించుటకై కంకణము ధరించి పాటుబడుచున్నదో, ఏపత్రికాకుమారిపై మన యాంధ్రులెల్లర కెనలేనిమక్కువయో అట్టిపత్రికాకుమారియగు మన గృహలక్ష్మికి నేడు పుట్టినదినము పండుగ. కావున మనకీదినము సుదినము. ఆపత్రికాపుత్రికి ఆశీర్వచనములంపవలసినదినము. ఆమెశైశవ విహారములను దలంచి యానందింపవలసినదినము. ఆమె సర్వాంగ సౌందర్యమునుగని ముద్దులాడవలసిన దినము.

కల్పలతా! 1928-వ సంవత్సరము మార్చి ఒకటవ తేదీని గృహలక్ష్మి కేసరికుటీరమున జన్మించినది. పురిటిబిడ్డయగు

గృహలక్ష్మియపుడు అఱమూతకన్నులతో, పిడికిలిపట్టినచేతులు, ఒడలునిండిన ముడుతలతో, మొగమును గప్పిన ముంగురులతో శరీరమంతయు కుంచించుకొని యొత్తిగిలి పడుకొనియున్నది. ఆంధ్రమహిళాప్రయోజనంబులకై యుదయించిన పత్రికాపుత్రికలెల్ల పురిటిలోనే సందుకొట్టిపోవుటయు, లేదా పాలసవత బిడ్డవలె నాదారుగా ద్రవ్యముయొక్క లేబరమున పెంపుసొంపులు లేక కొన్నాళ్లుండి కడముట్టుటయు సర్వసాధారణమగుటచే ఈగృహలక్ష్మి భవితవ్యమునుగూర్చి గూడ అత్యధికమగు నిరాశ నామనంబున నావరించియుండెను. కాని పత్రికాపుత్రికలపై నాకుగల సహజమైన ప్రేమచే ఆమె జననమునకు మిగుల సంతసించినదాననై 'కుమారీ! నీవైన చిరంజీవవై వర్ధిల్లి మాయలమటదీర్తువుగాక!' యని మనఃపూర్వకముగా నాశీర్వదించి ముద్దాడి ఆమెశైశవక్రీడాకలాపంబుల నరయ మహోత్కంఠతో నెదురుచూచుచుంటిని. అయితే నిత్యము జూచువారికి బిడ్డలనెలలబలుపును గుర్తించుట కష్టముగదా! ఆకన్గవ యెప్పుడు విప్పారి విశ్వవిలోకనంబునకు దొరకొనెనో, ఆపిడికి ళ్లెప్పుడు విడివడి సర్వవస్తువితతిఁబిడికిటఁబట్టనేర్చెనో, ఆశరీర మెప్పుడు ముడుతలుదీఱి స్నిగ్ధసుందరమై తనరారెనో, ఆ తొగరుపెదవులపై మొలకనవ్వు లెప్పుడు తొలకాడెనో, ఆజిహ్వాగ్రంబు మనోజ్ఞమధురభాషణంబుల కెపుడుద్యోగించెనో, తెలియదు. క్రమవికాసముయొక్క సుముహూర్తమును నిర్ణయింప సాధ్యముకాదుగదా! ఒక్కసంవత్సరములో గృహలక్ష్మి ఆంధ్రుల కల్లారుముద్దయినది.

నేడాంధ్రమహిళలు తమ బిడ్డలను ఆటలకు బోవిడిచి గృహలక్ష్మిని ముద్దులాడుచున్నారనినచో అతిశయోక్తి కాదు.

కల్పలతా! నీవు చూడలేదు గాని మొన్న మచిలీపట్టణమున గూడిన రాష్ట్రీయ మహిళాసభలో మన ఆంధ్ర సోదరీమణులు గృహలక్ష్మిపై జూపిన అభిమానము, ప్రేమ యేమని చెప్పుదును? గృహలక్ష్మి నెలకొకమారు గన్పడుటచే మాకు తృప్తి గలుగుటలేదు. కాన వారవారమామె దర్శనము గలుగు నవకాశమొసంగుడని యామె జనకునకు కబురంపుదమని కొందఱు, అబ్బా! వారమున కొకమారా!! చాలదు చాలదు. దైనందిన మామె దర్శన, స్పర్శన, సల్లాపసౌభాగ్యంబబ్బ వేడికొందమని కొందఱు ఈ విధముగా వాదులాడుకొనిరి. ఆసమయంబున ఆనారీమణులు చూపిన యుల్లాసోత్సాహములుగని 'అహో! మన గృహలక్ష్మి మూడేండ్లలో నెంత జనాదరణ బడసినది?' అని నాలో నేనాశ్చర్యపడితిని. కల్పలతా! మన గృహలక్ష్మి యింత జనానురాగమును బడయుటకు కారణము లేకపోలేదు. గృహలక్ష్మి పూర్వజన్మమున సిరిగలయింట బుట్టవలెనని చిట్టిబొట్టునోముపట్టి శ్రీగౌరును ప్రార్థించినదో ఏమో! ఆమెకోరిక దీఱునట్లు శ్రీమంతులయింటబుట్టినది. ఇంక నామెకేమి కొదువ? తియ్యనితిండ్లు! మెత్తనిశయ్యలు! మేలైనదుస్తులు! ప్రశస్తములైన అలంకారములు! ఇట్టిపోషణసౌకర్యముగల బిడ్డలు మేల్మిబంగరువలె మెఱుగులీనుచుండరా? తెలివితేటలుగల చక్కనిబిడ్డలనుచూచిన నెట్టివారికైన ముద్దేగదా! కావుననే అల్పకాలములో గృహలక్ష్మి ఆంధ్రుల

మనంబును జూఱగొన్నది. ఆమె ముఖావలోకన మాంధ్రమహిళల కకాలసుధాకరదర్శనమైనది! ఆమె దరహాసజ్యోత్స్నలాంధ్రగృహదీపికలైనవి. ఆమెపలుకుచిలుక లాంధ్రహృత్పంజర నివాసములైనవి. ఆమె గమనవేగము యావదాంధ్ర దేశమును జుట్టి వచ్చుటయేగాక దేశాంతరఖండాంతరాంధ్రజనసందర్శనా సమర్థంబయి తనరారినది. ప్రాచీనులను నవీనులనుగూడ నామె సమాధాన పెట్టుచున్నది. బాలలను వృద్ధులనుగూడ నామె రంజింపజేయుచున్నది. స్త్రీలకు పురుషులకుగూడ నామె ప్రేమ భాజనమగుచున్నది. వేయేల? "పలుకుల, నగవుల, నడవుల, నలుకల, నవలోకనముల" నఖిలాంధ్రలోకమును స్వాయత్తము గావించుకొని స్త్రీల ఆరోగ్యసౌభాగ్యముల పెంపొందించుటకై యుదయించితినను స్వవచనమును స్వాభివృద్ధిచేతనే గృహలక్ష్మి లోకమునకు విశదీకరించుచున్నది. నెలనెలకు క్రొత్తయుడుపులు, క్రొత్తసొమ్ములు, క్రొత్తఆటలు, క్రొత్తపాటలు, క్రొత్త మాటలు, క్రొత్తఊహలు, క్రొత్తకోరికలు. దేనికదియే నవ్యము - దేనికదియే సుందరము - దేనికదియే అసదృశ్యము. ఒక్కదేశపు నాగరికతయేనా? ఒక్కజాతి సౌందర్యమేనా? తెల్లవారి అందచందములు, నల్లవారి నయవినయములు, ప్రాచీనుల విధినిషేధములు, నవీనుల సంస్కరణభావములు వికృతము గొల్పక వెగటుబుట్టింపక సరసవచోరచనల చవిజూపుచున్నది గృహలక్ష్మి.

కల్పలతా! త్రివర్షప్రాయయగు గృహలక్ష్మి యిన్నివిధముల వికాసమునొంది యలరించుచున్నను ఇంకను ఈమె

యెడ నసంతృప్తులైన వారుగూడ కొందఱు లేకపోలేదు. గృహ లక్ష్మి కేవలము నవయువతులచేతి క్రీడాకందుకముగానున్న దేగాని ఆత్మోన్నతికనువైన యాధ్యాత్మికవిషయము లామె కడ బొత్తిగాలేకున్నవనియు, భగవచ్చింత కొంచెమైన లేకుండుట ఆమెయందలి లోపములలోకెల్ల గొప్పలోపమనియు, గృహ లక్ష్ముల కత్యంతావశ్యక మగు పాకకళవిషయమై గృహలక్ష్మి ప్రస్తావింపకుండుట సమంజసముగాలేదనియు, భౌతికశాస్త్రాదు లనుగూర్చి గూడ గృహలక్ష్మి స్త్రీల కెఱుకపఱచుట ఆవశ్యక మనియు, అర్థాగ్జనా సాధనలుగూడ గృహలక్ష్మి యప్పుడప్పు డెఱిగించుచుండినచో పేదస్త్రీలకు చాలయుపకారము చేసిన దగుననియు ప్రస్తావవశమున కొందఱు సోదరీమణులు తమ అభి ప్రాయములను వెల్లడింపగా వింటిని. నన్నేముఖాముఖినడిగిన మిత్రురాండ్రతో 'మాగృహలక్ష్మికిప్పుడే యీడుకుమించిన తల పులు, శక్తికిమించినచేతలుగదా! ఇంకను మీఅభిమతములు దీర్చుట కామెకు వయస్సుండవలదా? వడసారము మూడేండ్లు నిండని మాగృహలక్ష్మి యింతకంటె నేమిచేయగలదు? ఇంక నాలుగేండ్లు గడవనిండు. మీకెన్ని విద్దెలుచూపునో! అప్పు డామెపలుకు మీరందుకోగలరా?' అని నవ్వితిని. మిత్రమా! భక్ష్యభోజ్యములచే బాపని, విషయనివేదనముచే పఠితను రంజింపజేయుట మానవునకు సాధ్యమైనకార్యముగాదు. ఎన్ని రుచిరపదార్థములతో విందుచేసినను బ్రాహ్మణుడు ఇంకను రెండుపిండివంట లుండిన లెస్సగానుండెడిదనును. ఎన్నివిషయ ములు క్రోడీకరించి సమర్పించినను పఠిత, యింకను కొన్ని విష

యములుండిన బాగుగా నుండుననును. ఎంత తినబెట్టినను ఇంకా, ఎంతకట్టిబెట్టినను ఇంకా, ఎంతచుట్టియిచ్చినను యింకా, అనుటమానవులకు పుట్టుతోబుట్టినబుద్ధి. మానవుల జీవితమునకు పరిమాణమున్నది కాని యిచ్ఛలకు పరిమాణము లేదు. కావుననే మనుష్యులు నశించినను యిచ్ఛలు నశింపక పీడించుట గాంచుచుందుము. అయితే మన గృహలక్ష్మి విషయమున ఇంకా అనెడి వారియెడ మనము కోపపూరితులము కాగూడదు. బాగుగానున్న దానిని ఇంకను బాగుగా నుండవలయుననుట దానియందలి ప్రేమాతిశయముచేతనేగాని వేఱు గాదు గదా. కావున గృహలక్ష్మిని విమర్శించెడువారుగూడ ఆమె క్షేమాభిలాషులలో నగ్రగణ్యులే యగుచున్నారు. కల్పలతా! ఈసందర్భమున గృహలక్ష్మి మనకుచేసిన యుపకృతి గూడ స్మరించుట కర్తవ్యము. నెలనెలతుదినివచ్చి "అమ్మా ఏదండీమీలేఖ?"యని నయవినయములతో గృహలక్ష్మి తొందరింపకున్నచో నిన్నిలేఖలు యింతక్రమముదప్పక నీకు వ్రాయుటకు నాకు సాధ్యమయ్యెడిదికాదు. గృహలక్ష్మి నెన్నియో నవనవరీతుల గై సేయగల చతురమతులగు విదుషీమణులు పెక్కుండ్రేర్పడినను, వారు, తమ యలంకరణసామర్థ్యముచే నానాటికి తన చెలువ మినుమడింపజేయుచున్నను మనప్రాత కమ్మల యెడగూడ గృహలక్ష్మి గౌరవాదరములుగలిగి శ్రవణాలంకృతులుగా ధరించుట ప్రశంసనీయమగు విషయమే గదా!

నెచ్చెలీ! మన గృహ-లక్ష్మిని ఆమె జన్మదినోత్సవసందర్భమున నెట్లు బహూకరింపవలయునో తోపకున్నది. ఆంధ్ర

మహిళాజనముల నోములపంటయైన గృహలక్ష్మిని చిరంజీవివై వర్థిల్లుమని నారీజనమెల్ల మనఃపూర్వకముగా నాశీర్వదించుటయే ఆమెకుదగిన బహూకరణమని నాఅభిప్రాయము. కావున ఈదినమే ఆమెకట్టి శుభాశీర్వాదము నంపుచున్నాను.

భావపురి,
1-3-31.

ఇట్లు
శా ర ద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

మహాత్మునకును ప్రభుత్వమునకును సంధికుదిరినది. తనయుల చెఱసాల క్లేశంబులు తలచితలచి తల్లడిల్లిపోవుచున్న అరువదివేల మాతృహృదయములు ఆనందముతో నుప్పొంగుచు మహాత్ముని సత్యసమరమునకు జయగీతములు పాడుచున్నవి. కల్పలతా! పదివత్సరములనుండియు ఈయుద్యమము మనదేశమున సాగుచున్నను ఈవత్సరము మహాత్ముని చిత్తమును స్త్రీలును, స్త్రీలచిత్తమును మహాత్ముడును నాకర్షించినట్లు మఱెప్పుడును జరిగియుండలేదు.

ఇది అద్భుతమైన పరివర్తనము. అసదృశమైన కార్యము. కావుననే మహాత్ముడిది మహిళాశకమని వ్రాక్రుచ్చుటయేగాక ఈ పదిరెండునెలలనుండియు అపారమగు సేవ చేయుచున్న సోదరీమణుల సహాయమును నేను ముఖ్యముగా అపేక్షించెదననియు, పదిరెండేండ్లలో జరుగుపనిని వారు పదిరెండుమాసములలో నెరవేర్పగలిగిరనియు శ్లాఘించియున్నాడు. నిజముగా మనసోదరీమణులు గావించినసేవయు నిరుపమానమే. మనదేశమున స్త్రీలకు స్వేచ్ఛలేదు. మనము శ్వేతస్త్రీలవలె ఆరితేరినచదువును, అనిర్బంధకమైన మతమును, ఆక్షేపింపని సంఘమును కలవారముకాము. శరణాలయములలో బిడ్డలనిడి హోటళ్లలో తిండితిని కాలక్షేపముచేయుటకు మన గృహిణీత్వ

ధర్మము లంగీకరింపవు. ఇట్టి ప్రతికూలములు పెక్కులున్నను ఈ పదిరెండుమాసములనుండియు మనభారతమహిళలు దేశమునకు చేసినసేవ, చూపినత్యాగము, అనుభవించిన కష్టములు, అసాధారణములు. కాని యుగయుగముల భారతేతిహాసము బఠించితినేని మనభారతమహిళల కీనిర్బంధాదికములు క్రొంగ్రొత్తగాదని తోచెడిని.

నిరంకుశపరిపాలనాక్లేశములకు బాల్పడిన తమదేశజననిని మనభారతమహిళలు, యుగయుగములందును ఇటులనే రక్షించియున్నారు. ఏయుగమునందును స్త్రీలు చెఱసాలలందు ప్రవేశింపక భారతవర్షము సుఖస్థితిని బడసియుండలేదు. "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపిగరీయసి" యను సూక్తి నేటిమాట గాదు. చూడుము: త్రేతాయుగమున సింహళప్రభువైన రావణుని నిరంకుశపరిపాలనము భారతీయులను కడగండ్లపాలు చేసెను. ఎట్టి వీరాధివీరులును నాతనిని జెనకజాలకుండిరి. దేవతలమహిమగాని, బాపలతపముగాని, రాజులమగటిమిగాని వానిని నిర్జింపజాలకపోయెను. వానివలని బాధయా సకల ప్రాణిచయము నల్లాడబెట్టుచున్నది. వానిని నిర్జించు నుపాయమా యెవరికిని దోచకున్నది. ఇకచేయవలసినదేమి? కడుసుకుమారియు, మహాసాధ్వియు, రాముని దేవేరియునగు సీతా మహాదేవి భారతీయులబాములు గనలేక రావణునివశమై దశమాసంబులు చెఱసాలక్లేశంబు లనుభవించినది. అహా! ఒక్కస్త్రీయొక్క నిర్బంధ మెట్టిమహచ్ఛక్తి నుద్భవింపజేసెనో కంటివా? నరవానరు లేకమైనారు. ఖగమృగాదులు తోడైనవి.

సురలు, తాపసులు ఆశీస్సులొసగినారు. రావణుని నిరంకుశ పరిపాలనమున గాసిల్లుజనులకు క్షణములో విభీషణుని చల్లని పరిపాలన మబ్బినది. ఈపరిణామమునకు హేతుభూతురాలెవరు? చెఱబడిన సీత!!!

ద్వాపరయుగమున కారాగారములందు నిర్బంధింపబడిన స్త్రీలకు లెక్క లేదు. ఒక్కనరకునికారాగారముననున్న యువతులే పదునారువేలు. ఇక కంసుడు, జరాసంధుడు, శిశుపాలుడు, పౌండ్రకవాసుదేవుడు మున్నగు రాజుల చెఱసాలల యందెందఱు నారీమణులు చెఱబెట్టబడియుండిరో వివరింప నశక్యము. ఇంతమంది నారీమణులు చెఱసాలలబడి మొఱ్ఱోయని మొఱబెట్టుచుండ ఆ రత్నచింతామణియగు భగవంతుడు వారి గోడుదీర్పకుండ నెట్లుండును? కాన ఆస్త్రీలచెఱను బాపుటకు చెఱయందేయుదయించినా డొకశూరుడు. అతడే శ్రీకృష్ణుడు. దేవకీగర్భశుక్తిముక్తాఫలము. తపస్వినియగు దేవకి, శ్రీకృష్ణుని ప్రసవింపగనే కారాగారపుగడియలు తమంతవిడివడెనట! అవును. ఎప్పుడు దానికి ప్రతిక్రియసేయగలనాయకుడుదయించెనో అప్పుడు వానిగడియలు సడలినట్టులేగదా. కాని యిది యొక్కశ్రీకృష్ణునితోడనే కాలేదు. సమరతంత్రప్రవీణయగు సత్యభామ విల్లునంబులు చేబూని మగనికి బాసటయై నిల్చి నరకునితో బోరాడినతరువాతనే పదునాఱువేల రాచకన్నెలు చెఱనుండి విముక్తలైరి. స్త్రీలసహాయము పురుషులానాడును బడసిరనుటకు సాత్రాజితిసమరమే తార్కాణము.

యుగయుగములందును పరిపాటియైన చెఱసాలవాసము కలియుగమునమాత్రము స్త్రీల కెట్లుదప్పును? స్త్రీలు చెఱబడినగాని లోకమునకు వెట్టగలుగదు. రూపెత్తిన సహనమును, పుంజీభవించిన సాహసమును, పవిత్రతేజోరాశియునగు భారత మహిళాసంఘముయొక్క పరిపూర్ణసహాయము పరాధీనభారతమునకు మరల కావలసివచ్చినది. మహాత్ము డర్థించినాడు. స్త్రీలు, సరే అనినారు. చదువురాదు. రాజకీయము లెఱుగరు. మతనిర్బంధ మెక్కువ. సంఘముయొక్క ఆక్షేపణ లత్యధికము. ఇంటిలోనికాలు బయటపెట్టుటకు వీలుకాని సాంసారికమైన చిక్కులు. పిల్లలసంరక్షణబాధ్యత. పరపురుషులయెదుట బడనివారు కొందఱు. పరదాలచాటుననే కాలక్షేపము చేయువారు కొందరు. పేరంటమునకైన పొరుగి ల్లెఱుగనివారు కొందఱు. ఎండకన్నెఱుగని యిట్టి శుద్ధాంతకాంతాజనంబులందు, ఈ సుమకోమలహృదయలందు దేశహితైకకాంక్ష, నివురుగప్పిన నిప్పు చందమున మునుపే గర్భితమైయున్నదో, మహాత్ముని తేజోబలముచే నప్పటికప్పుడే యుద్భూతమైనదో తెలియదు. సుమమువలె కోమలులును, జలమువలె పవిత్రలును, వహ్నివలె నుజ్వలలునగు సోదరీమణులు తండోపతండములుగ సత్యాగ్రహదళమున జేరి మహాత్ముని యాదేశము నిర్వర్తించి చెఱసాలలలో ప్రవేశించినారు. ఆసేతుశీతనగపర్యంతంబైన ఈఆర్యావర్తమున ఈయుద్యమము చొఱనిప్రదేశములేదు. సర్వరాష్ట్రముల స్త్రీ లిందు పాల్గొనుటయే యిందులకు నిదర్శనము. ఈ శాంతిసమరకార్యక్రమము నిర్వహించుపట్ల నొకొ్కకచో ఈస్త్రీల మృదులశరీరములు

దండప్రహారంబులకును, పాణిపల్లవంబులు బలత్కారాకృష్టం బులకును, దీర్ఘశిరోజంబులు పరిభవపీడనంబునకును గుఱియైనవి, కాని వారు వెనుదీయలేదు. ఎక్కడెక్కడ దౌర్జన్యము విస్త రించిన నక్కడక్కడ తాము పొడసూపి లాఠీప్రయోగంబులకు విరామంబు కల్పించి శాంతిస్థాపనము చేయగలిగినారు. కాన నిది మహిళాశకమని వాక్రుచ్చుటలో మహాత్ముడు యదా ర్థమునే ప్రకటించెను. కాని యీశకనామమును నిలువబెట్టు కొనుటకు స్త్రీలపై నింకను విశేషమైన కార్యభారము నిలిచి యున్నది.

మహాత్ముని హెచ్చరిక చక్కగా పరికించితివా? ఆయన ప్రశంసలోనే పిలుపునుడి వినబడుచున్నది. ఇకముందు జరుగ వలసినది యొడంబడికకు బద్ధమైన ప్రచారము. మునుపే అహింసా విషయమున నియమవ్రతులైనవారీయొడంబడిక కారణమున మఱింత సహనమును చూపవలసియున్నది. క్షమా సంపత్తికి పేరుమోసిన నారీమణులకీకార్యము నొప్పగింప మహా త్ముడు కుతూహలము జూపుచున్నాడు. ఆయన అభీష్టమీడే ర్చుటకు అప్పుడే వందలకొలది దేశసేవిక లుత్సాహముతో ముందంజవేసి సిద్ధమగుచున్నారు. కాని చిత్రమా! రథసారథ్య మెట్టిదో ఉద్యమసారథ్యముగూడ అట్టిది. రథమును వడివడిగా నడపుటయేగాని నిలుపుట చేతగానివాడే విధముగా ఉత్తమ సారథియనబడడో తీవ్రప్రబోధముచే ప్రజలను రెచ్చగొట్టుట యేగాని శాంతపఱచుట చేతగానినాయకులును నటులనే నిం దింపబడుదురు. మఱియు విశాలమగు రాచబాటలపై పరువు

లెత్తించినట్లు యిరుకుసందుల రథసారథ్యము సేయుటయు సుకరముఁగాదు. నేడు మహాత్ముని సత్యాగ్రహరథము ఒడంబడిక యను యిరుకుసందుల ప్రవేశించినది. మునుపటివలె పేరెము లెత్తించుటకిందు వైశాల్యములేదు. కాన యిందు రథము తేలికగానుండవలయును. చక్రములు సున్నితముగానుండవలయును. వాహనములు ధూర్తములుగాక యుండవలయును. సారథి చతురుడుగానుండవలయును. ఈశ్వరానుగ్రహమువలన మనసోదరీమణు లీపథమునగూడ నేర్పుగానడచి విజయశ్రీని బడసెదరేని వారును, వారిసహాయమర్థించిన మహాత్ముడును, జగన్నుతకీర్తి గాంతురు. పారతంత్ర్యాంధకార నిమగ్నమైన భారతజాతికి స్వాతంత్ర్యభానుని సందర్శనభాగ్య మబ్బును. కల్పలతా! ఈసందర్భమున మన ఆంధ్రసోదరీమణులు పెక్కండ్రు సత్యాగ్రహసమరమునజేరి చెఱసాలవాసాదిక్లేశంబులు పెక్కులనుభవించియు సుఖముగా వచ్చినందులకు భగవంతున కనేక వందనములు. యశోవిరాజితలైన యానారీరత్నములకు మన సుస్వాగతము!!

భావపురి

1–4–31

ఇట్లు,

శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

మనమిత్రురాలగు రాజ్యలక్ష్మి నాకొకజాబు వ్రాసినది. ఆ జాబువలన కపటవేదాంతులు కొందఱు గ్రామములలోఁజేరి యెంతబీభత్సముచేయుచున్నదియు, అమాయకులగు గ్రామ జనులు వారిమాయావాగురలలో నెట్లుజిక్కువడుచున్నదియు తెలియుచున్నది. దానిని వేఱె నామాటలలో నీకు తెలుపుటేల? రాజ్యలక్ష్మి వ్రాసినజాబునే నీకు ఇందుతో బంపుచున్నాను, చూడుము.

"సౌభాగ్యవతియగు శారదకు:—

సోదరీ! ఎప్పుడు మనము పాఠశాలలో చదువుకొంటిమో, ఎప్పుడు అచ్చెనగాయ లాడుకొంటిమో, ఎప్పుడు దాగిలి మూతలాడుచు పరుగులెత్తితిమో, ఎప్పుడు బొమ్మల పెండిండ్లు చేసి గుజ్జనగూడువిందు లారగించితిమో, ఎప్పుడు వివాహ మాయెనో, ఎప్పుడత్తవారయింటి కేగితినో అంతయు స్వాప్నిక గాథ; మూడు నాళ్ల ముచ్చట. క్షణములో కలగని తెల్లవారి నట్లైనది నా బ్రదుకు. "అది అంతయు సుఖ సమాచారము. సుఖములు అనుభవించినట్లులుండవు. కష్టములు పీటలుపెట్టు కొని కూర్చున్నట్లుండును." అని అందువేమో! ఇరువదేండ్ల ప్రాయములో కన్నెతనము, అయిదవతనము అన్నియు చెల్లి

పోయి దుర్భరమైన వైధవ్యావస్థ తలపైబడినపుడు నా జీవితములో సుఖముకంటె దుఃఖమే యెక్కువపా లనుకొనక మానుటెట్లు? కాని నా యీదుఃఖమంతయు నీవెఱుగనిది కాదుగదా? ఎన్నిమాఱులో జాబులు వ్రాసినావు; ఎన్నిమాఱులో స్వయముగా వచ్చిచూచినావు; నీసౌహార్దము తలంచుకొనినప్పుడు నాకొకింత ఆనందము కలుగుచుండును. మఱియు నేవింతసమాచారము విన్నను నీకు తెలియజేయవలెనని తోచకుండును. కడలేని నాదుఃఖసాగరములో నీతోడి సఖ్యత యొకటే సుఖమరీచి.

ఈమధ్య మాగ్రామమునకొక వేదాంతురాలు వచ్చినది. ఆమె మా గ్రామమునకు క్రొత్తగావచ్చిన మేష్టరుగారి తోబుట్టువు. నావలెనే గంగాభాగీరథీసమానురాలు. భారత భాగవతములు చక్కగా రాగయుక్తముగా చదువగలదు. సీతారామాంజనేయములోని పద్యములు, పంచదశిలోని మహా వాక్యములు, ఆమెకు కొట్టినపిండి. భగవద్గీత ఆమెకు కంఠ పాఠము. ఎక్కడ ఏఅధ్యాయములో ఏశ్లోకమును చెప్పుమన్నను తడుపుకోదు. ఇక అధ్యాత్మరామాయణములోని కీర్తనలు, తరంగములు, తత్వములు ఆమెకు వచ్చునని చెప్పుట అల్పవిషయము. ఇట్టి పండితురాలు ఎందు మొగమెఱుగని మాగ్రామమునకు వచ్చినప్పుడు వారి కేవిధముగా బ్రహ్మరథము పట్టుదురో చూచినవారికే అనుభవము. మాగ్రామమునకువచ్చిన విదుషీమణిపేరు- పూర్ణమ్మ. ఒక్క నెలయైనను పూర్తిగాకమునుపే పూర్ణమ్మగారి పాండిత్యప్రతిభ మాగ్రామ

మంతయు నల్లుకొన్నది. ఊరిలోని సగము ముప్పాతికమంది స్త్రీలామెకు శిష్యురాండ్రైనారు. రాత్రియనక పవలనక ఆమెను సేవించుట మొదలుపెట్టినారు. కొందఱ కామె వేదాంతదేశిక రాలు. మఱికొందఱికి చదువులపంతులమ్మ. ఇంక కొందఱికి పాటలు పదములు నేర్పుగాయకురాలు. ఇంకను మఱికొంద ఱాప్తురాండ్రకు ప్రణవమంత్ర ముపదేశించి ముముక్షుజననిధాన మగుపరతత్త్వమును చూపింపగల గురుదైవము. ఆమె గ్రామ స్త్రీల నాకర్షించిన విధమును, ఆమె ప్రజ్ఞావిశేషములును చూచి పెద్దపెద్దలే సమ్మోహితులైనారు. ఆడుదానికి చదువెందుకని యీసడించే మూడుకాళ్ల ముసలమ్మలు, సనాతనధర్మపరాయ ణులగు పురుషోత్తములుగూడ పూర్ణమ్మగారి దంతయు భగ వచ్చింతయేగాని యీకాలపు మిడిమిడిచదువులు గావు; ఆమె పాదము బట్టినను తప్పులేదు; ఆమె శుశ్రూషచేసినను తప్పు లేదని తీర్మానించి తమ ఆడవారినిగూడ ఆమెవద్దకు పంప ప్రారంభించినారు. తామెందులోను చేరక, చేరినవారిని యుక్తా యుక్తవిచక్షణలేక తీవ్రముగా నాక్షేపించుచుండెడి యీ కన్స ర్వేటివ్ పార్టీవారినిగూడ తనవశము జేసికొనుటచే పూర్ణమ్మ గారి సన్నిధికి పోయేబాట నిష్కంటకమైనది. కాబట్టి శీఘ్ర కాలములో చాలమంది ఆమెకు నిర్భయముగను నిశ్శంకము గను శిష్యులైనారు. మాతలిదండ్రుల బలవంతమువల్లను, ఆమె విద్యావిషయములు నా మనంబునుగూడ నాకర్షించుట చేతను నేనుగూడ ఆమె దర్శనము చేయవలెనని వెళ్లినాను. మీ బావగారు పోయినతరువాత ఎనిమిదేండ్లకు సెలవుగా

పట్టపగలు బయటకువచ్చుట అదియే మొదలు. అప్పుడింకను రెండుగంటలైనను కాలేదు. నల్గురు రాకముందే తీసికొని పొమ్మని నేను మా అమ్మను తొందరపెట్టుటచేత ఆ యెండలోనే తీసికొనివెళ్ళినది. పూర్ణమ్మగారు తత్వజ్ఞురాలు గనుక పరమసాత్వికురాలుగా నుండునని నాయూహ. కాని, ఆమెను చూడగనే నాయూహ హుళ్ఘన ఎగిరిపోయినది. మంచి హోదా గల అధికారిణివలె పూర్ణమ్మగా రున్నది. వ్రేళ్లను రెండు మూడుంగరాలు, రాళ్లువేసినవి వేయనివికూడ, ఉన్నవి. మనిషి కొంచము నలుపు. ఉన్నతము పుష్టియు సమానముగానుండి భారీమనిషి అనిపించును. నల్లనిలలాటమున తెల్లని విభూతి రేఖలు, మైలుదూరమునకైన కన్పడునంతదట్టముగా నున్నవి. అప్పటి కింకను పూర్ణమ్మగారు గ్రంథకాలక్షేపముచేయు సమయముకాకపోవుటచేత ఆమె ముఖ్యశిష్యురాండ్రిద్దరు తప్ప మరెవ్వరును లేరు. మెత్తని చిఱుచాపమీద తెల్లని గలీబు తొడిగిన దిండువేసికొని తానుకట్టుకొనిన చలువధోవతిలోని యొకమడతయైనను నలుగకుండ ఒప్పిదముగా పడుకొని యున్నది. ఒక శిష్యురాలు, తములపాకులకు సున్నము రాయుచున్నది. మఱొకామె, మామిడిపండ్లుకోసి చిన్నపళ్లెరములో పెట్టి పూర్ణమ్మగారి సమీపముగానుంచి విసనకఱ్ఱతో విసరుచు ఆమెకు ప్రక్కగా కూర్చున్నది. అవైఖరిచూచి మేమప్పుడు వచ్చుటకు తరుణముకాదేమో అనిపించినది నాకు. కాని, మాఅమ్మమాత్రము, నిశ్శంకముగా నన్నామెకడకు గొనిపోయినది. మాఅమ్మను ఆమె, బాగుగా ఎఱుగును. కాన ఇరువు

రను మాటలు కలియుటకు ఆలస్యము కాలేదు. ఆమె ఎవరని నన్నుచూపి పూర్ణమ్మగారు, మాఅమ్మను అడిగెను. 'మా అమ్మాయేనండి: ఎనిమిది సంవత్సరాలైంది పెనిమిటిపోయి. నాటినుండి నేటిదాకా ఒక్కటేతీరు! ప్రపంచం చూడదు. దుఃఖం మానదు. ఏమో మీవంటిపెద్దల దర్శనంచేస్తేనైనా యీ వెఱ్ఱిదుఃఖం మానుతుందేమోనని బలవంతాన తమ సన్నిధికి తీసుకువచ్చే'నని ప్రశ్న కవకాశములేకుండ అన్ని సంగతులు మాఅమ్మ ఒక్కమాఱుగా చెప్పినది. పూర్ణమ్మగారు, తలయూపి బెట్టుగా ఊరుకొనినది. మన్మనోవ్యథను దూరీకృతము చేయగల ఆప్యాయకరమైన మాట యేదియైన నామె నోటినుండి వెలువడునేమోనని ఆసక్తితో చూచితిని కాని రాలేదు. ఆమె శిష్యురాలు మాత్రము 'మంచి పనిచేశావు పార్వతమ్మక్కా! రాజమ్మను యిక్కడికి తీసుకొస్తేబాగుండు నని నేనుగూడా ఎన్నిమార్లోఅనుకున్నాను. అమ్మగారిపాదం బట్టితే అన్నిచింతలుపోతాయి. రాజ్యంఅదృష్టం, బాగుండపట్టే నీకు మంచిబుద్ధిపుట్టి అమ్మగారిసన్నిధికి తీసుకొచ్చేవు. రోజూ ఇట్లాగే తీసుకొస్తే అదేఅలవాటవుతుంది. వారి నోటివాక్యాలే అన్నిచింతలూ పోగొట్టుతాయి' అన్నది బుచ్చంపిన్ని. శిష్యురాలైన బుచ్చమ్మగారీవిధముగా స్తుతింపగనే పూర్ణమ్మగారికి స్వాతిశయము హెచ్చినది కాబోలు 'నావద్ద యిటువంటివారెందఱో దుఃఖవిముక్తులై గురుకటాక్షంపొందేరు. ఇంతకూ అదృష్టంబాగుండాలె. మహనీయులకటాక్షం కలగాలె. అనేకజన్మకృతపూర్వపుణ్యవిశేషంచేతగాని

బ్రహ్మవేత్తలైనవారి దర్శనం కలగడం, వారిశుశ్రూషలు చేయడం,వారికటాక్షంపొందడం లభించదు'అన్నారు.'చిత్తము; తమరు సెలవిచ్చినమాట వాస్తవం; పెద్దలదర్శనము సామాన్యంగా కలుగుతుందా? అది సుకృతవిశేషమే'అన్నది మాఅమ్మ. నేనేమియు మాట్లాడలేదు. ఉభయులమాటలువినుచు తలవంచుకొని ఒకప్రక్కకుఒత్తిగిలి కూర్చున్నాను. ఈవిధముగా మాటలుజరుగుచుండగనే పూర్ణమ్మగారు, మామిడిపండుముక్కలు తినుటైనది. శిష్యురాండ్రిచ్చిననీటితో పళ్లెరములోనే చేతులుకడిగికొని తములపాకులందుకొని వక్కపొడి నోటిలో వేసికొనినది. ఫలహారతాంబూలాచులగునప్పటికి మూడుగంటలైనది. పురాణమువినవచ్చు స్త్రీలొక్కరొక్కరే రావడము, పూర్ణమ్మగారి పాదములకుమ్రొక్కి ప్రక్కగాకూర్చుండడము ఆరంభించినారు. ఒక్క అరగంటలో చావడి, నిండిపోయినది. వారిలో కాపులు, రెడ్లు, కమ్మవారు, కోమట్లు, విశ్వబ్రాహ్మణులు, ఒకరేమిటి అన్నికులములకు చెందినవారుఉన్నారు. అందఱు చేరబారినతరువాత ప్రార్థనశ్లోకములు, పద్యములు, పాటలు మున్నగు ఆడంబరములతో పూర్ణమ్మగారు భాగవతపఠన మారంభించినారు. ఆనాటికథాభాగము దశమస్కంధములోని కృష్ణలీలలు. కృష్ణలీలలకు పూర్ణమ్మగారు గొప్ప అంతరార్థముచెప్పిరి. అత్యంతనిగూఢవిషయములను సైతము ఆమె విప్పివిప్పిచెప్పుచుండ దివ్యమైన ఆవాక్యార్థప్రసంగములో నేను నిమగ్ననై నన్ను నేనే మఱచితిని. 'ఎన్నిరాజసలక్షణములున్ననేమి? ఈయొక్కపాండిత్యప్రకర్షకే ఆమెపదసేవ చేయ

వచ్చు'ననుకొంటిని. కాలక్షేపము జరిగినంతసేపు ఆమెశిష్యురాం డ్రామెకు విరామములేకుండ వీవనలు విసరుచునేయుండిరి. ఆమె వాగమృతధారలుగ్రోలి తనిసిన ఆయానందములో ఆవీవన నేను గూడబట్టుకొని ఆమెనించుక పరిచరింతమనియనుకొంటిని. కాని నాకు మాయబిడియముగదా! కాన నాతలంపులు-బుద్బుదములు నీళ్లలోనేబుట్టి నీళ్లలోనే కలిసిపోయినట్లు—నాలోనేపుట్టి నాలోనే కలిసిపోయినవి. ఇంచుమించుగ రెండుగంటలకాలము కాలక్షేపము జరిగెను. తదుపరి ఎవరియిండ్లకు వారువెడలిరి. మేమును అమ్మగారి సెలవుపొంది యింటికివచ్చితిమి. తరువాత రెండుమూడుమాఱు లిటులనే భాగవతకాలక్షేపములకు వెళ్లి వచ్చితిని. అన్నియు వదలుకొనినను యెవరైనచదువుచుండిన వినెడియిచ్ఛమాత్రము, నన్ను వదలిపెట్టలేదు. కాన పూర్ణమ్మగారు యితరగ్రంథార్థము లుపన్యసించుచుండగ కూడ వినవలయునని నాకు కుతూహలముకలిగెను. ముఖ్యముగా భగవద్గీతార్థము లామెవలన వినవలయునని నామానసం బపేక్షించుచుండెను. కాన'అమ్మగారు, భగవద్గీతనుజదివి అర్థముచెప్పునదెప్పు' డని యామె శిష్యురాండ్రనడిగితిని. 'సాయంత్రము యేడుగంటలైనతరువాత భగవద్గీతచదువుదురని' వారుచెప్పిరి. అప్పుడొక. మాఱు వెళ్లవలయునని తలంచి మాఅమ్మను తీసికొనిపొమ్మంటిని. సరేయని మాఅమ్మ, తీసికొనివెళ్లెను. కిటికీప్రక్కగా ఒక నవారుమంచమున్నది. ఆమంచముపై గోడకుచేరవేసిన బాలీసానుకొని కాళ్లుచాచుకొని పూర్ణమ్మగారు కూర్చున్నది. కన్నులకు సులోచనములు, చేతిలో పుస్తకము, ప్రక్కను స్టూలు

మీాద లాంతరు పెట్టుకొని పూర్ణమ్మగారు చదువుటకు ఉద్యుక్తురాలై యుండెను. చుట్టును నల్గురుశిష్యురాండ్రుండిరి. ఒకామె, పాదములుపట్టుచున్నది. మఱొకస్త్రీ, వీవనతో విసరుచున్నది. తక్కినవారిద్దరు, మంచపుపట్టెపట్టుకొని ఆమె పాదములచెంతగా కూర్చున్నారు. ఆ అయిదుగురు, ముఖమున పట్టించుకొన్న విభూతిరేఖలు, దీపపువెలుతురున స్ఫుటముగా కనబడుచున్నవి. ఆదృశ్యంచూచి నేనాశ్చర్యచకితురాలనై పోయినాను. 'శిష్యానుగ్రహముకొఱకుమాత్రము మహావేదాంతినియగు పూర్ణమ్మగారిట్టిమహాభోగ మనుభవించుటయు, ఆమెనింతగా వీరుసేవించుటయు బాగుగాఉన్నదా?' నా అంతరాత్మ తనలోతానే ప్రశ్నలువైచుకొనినది. కాని సరియైన ప్రత్యుత్తరము మాత్రము పడయలేదు. ఇంతలో పూర్ణమ్మగారు, భగవద్గీతాశ్లోకములు చదువుటారంభించినారు. ఒక్కొక్కశ్లోకము చదువుట, దానికి అర్థతాత్పర్యాదులు వివరించుట, ఆపై వానిలోని విషయముపై చక్కనిప్రసంగము. అరటిపండు ఒలిచి చేతబెట్టినట్టున్నది. నా మనస్సు, మరల ఆనందసాగరములో నోలలాడ నారంభించినది. గీతాశ్లోకములనిన నాకు కడుప్రీతి. పూర్ణమ్మగారిఅర్థ, మంతకంటె ప్రీతికరముగానున్నది. ఒకగంటసేపీ కాలక్షేపము జరిగినది. మా అమ్మయు నేనును, యింటికి బయలుదేరివచ్చుచు 'వస్తావా బుచ్చమ్మక్కా!' అని మాఅమ్మ బుచ్చమ్మపిన్నిని పిల్చినది. బుచ్చమ్మగారు జవాబుచెప్పకుండ గుమ్మముదాక మాతోవచ్చి 'అమ్మగారు తలంటిపోసికొందురట; కాగానేవస్తా'నని చెప్పి లోనికి

వెళ్లినది. ఆమాట వినగానే నామనస్సేమో ఆందోళనపాలై నది. 'ఇహభోగవిరాగమును బోధించే తత్వజ్ఞులేమి ఈ అభ్యంగనాది వ్యవహారములేమి? పోనీ, తలవెండ్రుకలు కల దైనకాదే! ఇటువంటి ఆమెకు తలంటిపోయుటకు మెటికలవంటి నల్గురు విధవలు కనిపెట్టుకొని కూర్చుండుటేమి? తలలు బోడు లైనను తలపులు బోడులుకావను సామ్యము సార్థకమగు చున్నదే' అనుకొని త్రోవలో 'అమ్మా! ఇదేమి? ఇప్పుడే ఎనిమిదిగంటలైందిగదా. ఇక ఈమె తలంటిపోసుకొనే దెప్పుడు? వాళ్లు యిండ్లకు వచ్చేదెప్పుడు? - ఈమె మాటలకు చేతలకు పొందికలేనట్టున్నదే' అని మా తల్లితో అంటిని. మా అమ్మకుగూడ ఏమి చెప్పుటకును పాలుపోలేదు కాబోలు 'ఏమిటోనే అమ్మాయీ! అంతా వింతగానుంది!!' అనినది. 'శిష్యులను అనుగ్రహించడానికేమో—పెద్దల ఉద్దేశాలు మనం తెలుసుకోలేముగా!' అన్నాను నేను తిరిగి. 'ఉః!! అనుగ్రహమూ, పాడూ' అని మా అమ్మ విసుగుగా జబాబిచ్చినది. ఆరాత్రి యింటికివచ్చినను నాకు పూర్ణమ్మగారినిగూర్చిన వితర్కము, మనస్సునుండి తొలగిపోలేదు. ఆ రాజసము, ఆ ఠీవి, ఆ భోగాభిలాష నాకు మాటిమాటికి కన్నులగట్టినట్టు లుండి 'శిష్యుల ననుగ్రహించు నెపమునమాత్రము-యిట్టి రాజసము నెవరైన నలవర్చుకొనవచ్చునా? ఇది, తన్నుదాను వంచించుకొనుటగదా! తానుచర్చించెడు పారమార్థికవిషయము లేమి! అనుభవించెడి భోగములేమి! తా నాచరించి యితరుల నాచరించుమని చెప్పువారేగదా ఆచార్యత్వంబునకు తగుదురు.

మనోవాక్కర్మంబు లొక్కటిగా ననుష్ఠింపజాలనివా రితరులకు పరమార్థోపదేశముచేయుట కర్హులగుదురా ?' అని ఇట్టి సందియము లెన్నియో నా మనస్సును కలంచెను. అయినను 'ఏయుద్దేశముతో ఆమె యిట్లు ప్రవర్తించుచున్నదో! సంగతి చక్కగా తెలిసికొనక విమర్శించరా'దని యనుకొని మరల మనస్సమాధానము చేసికొంటిని. మొదట పూర్ణమ్మగారి ప్రసంగోపదేశములు, ప్రతిఫలరహితములుగానుండెను. తదుపరి శిష్యురాండ్రే నేర్పిరో ఆమెయే కోరెనోగాని కూర, కాయ, పెరుగు, నెయి, పాలు, పండ్లు, కొంచెము విడిముడి స్వీకరించుచుండెను. మన స్త్రీలకు ఒకరినిచూచి ఒకరు చేసెడి వెట్టి అధికముగదా. 'వారిచ్చిరి మే మీయకపోవుటేల?'యని క్రమముగా పప్పుబియ్యములేమి ఫలశాకములేమి పాలు నేతులేమి, యామెకు దోచిపెట్టసాగిరి. ప్రతిస్త్రీకిని ప్రతియింటను యీవిధముగా నర్పించు స్వాతంత్ర్యముండదుగదా! కాన చాటుమాటులుగూడ ప్రబలెను. గ్రామస్త్రీలవలన నిట్టి రాబడి చూచుకొనిన తరువాత తన ప్రతిభను ఇంకను చూపనెంచి కాబోలు 'మాయింట శంకరజయంతి జరుపుదు'మనియు, 'దానికి మా గురుస్వామియైన స్వాములుగారుగూడ వచ్చెద' రనియు పూర్ణమ్మగారు, చల్లగా తన శిష్యురాండ్ర కెరిగించెను. ఈ సమాచారము క్షణములో ఊరినిండ ప్రాకిపోయెను. 'ఆహా! ఏమి మన భాగ్యము! అమ్మగారు మన ఊరికి మహోచ్ఛదశ తేనున్నా'రని ఆ సమాచారము వినిన పిన్నపెద్దలు పొంగిపోయిరి. ఉన్నఊరివా రెంతమంచివారైన వారిని తెలిసి

కొనలేరుగా! పొరుగూరివారి ఆడంబరమునకు దాసోహ మ్మనుట, ప్రతియూరియందును సాధారణముగదా. పెరటిచెట్టు మందుకురాదు. క్రొత్త వింత, పాత రోతగదా. మా గ్రామము లోని పెద్దఆసామి, రెడ్డమ్మచౌదరిగారు, జయంతియుత్సవము నకుగాను 'పుట్టెడు ధాన్యము పాతికరూపాయలు నావంతు' అనెను. 'అతడేనా మొనగాడు? ఆతనికి రెట్టింపు మావంతు' అని మఱికొందఱు పెద్దలు పంతాలాడిరి. ఇక నేమికొదువ? క్షణములో ధనధాన్యములు సమకూడినవి. స్త్రీపురుషులు సాయపడిరి. పందిళ్లు పాకలు వేసిరి. మంటపములు నిర్మించిరి. తోరణములు గట్టిరి. సకలసంబారములు సిద్ధమైనవి. ఈ మహోత్సవము తిలకించుటకు చుట్టుపట్ల గ్రామములనుండి వేలకొలదిజనులు వచ్చి మూగిరి. నలుగురుమనుష్యు లొక్క మాఱు వీధికి నడచుట యెఱుగని మా యూరు, గ్రామజను లతో కిటకిటలాడుచు కనులపండువుచేసెను. జయంతి రెండు దినము లున్నదనగా స్వాములవారు విజయము చేసిరి. ఆయనకు ముప్పదేండ్లకన్న నెక్కువలేవు. మంచి సుందరుడు. కన్నులకు బంగారుతో కట్టిన సులోచనములు, కాలికి మేలి తరము పాదుకలు, చేత చక్కనిదండము, వ్రేలికి మంచి అంగుళీయకమునుగలిగి కాషాయాంబరధారియయ్యు స్వాముల వారు సౌందర్యపిపాసులగు నవనాగరికపు యువజనులకు తీసిపో కుండెను. ఆయనను, 'చదువేమిచదువుకున్నాడోగాని.స్వాముల వారు ప్రొఫెసర్ లాగ బాగున్నాడురా' అని పిల్లకాయ లనుకొన జొచ్చిరి. జయంతి ఆరంభమయ్యెను. ఉదయము పూజ, భజన,

శంకరచరిత్రాపారాయణము, మధ్యాహ్నము భోజనములు, సాయంత్రము హరికథలు, మున్నగు ఉత్సవవిశేషములతో మా గ్రామము భోరుకొనెను. ఆ ఉత్సవము జరిగిన అయిదు దినములును ఉన్నవ్రూరివారును పొరుగూరివారును ఆ వేడుక వెల్లువలో నిమగ్నులై యుండిరి. కాని వివాహమహోత్సవమైనవెనుక నాగవల్లినాడు వియ్యాలవారు పెండ్లికూతురువారి లోపము లెన్నినట్టులే జయంతియైన మఱునాడు గ్రామములో గుసగుసలు బయలుదేరినవి. ప్రతి శుభకార్యము వెనుక పెత్తనదారులైనవారియెడ నిట్టి నేరారోపణలు సర్వసాధారణమేయైనను పెద్దఉత్సవముగాన పెద్దపెద్ద లోపములు క్రమముగా బయటపడసాగెను. వెల్లువతీసినతరువాత తడిసి పాడై దిబ్బ, కొట్టుకొనిపోవ వస్తుసముదాయము బైటపడినట్టులే ఉత్సవప్రవాహము తీసినతరువాత భజనలో, కాలక్షేపములో, వంటశాలలో, వడ్డనసమయములో జరిగిన అత్యాచారములు, అల్పుల ప్రవర్తనములు బయటపడెను. గుణదోషములులేని తావులేదు. కాని పై పైన వచ్చిపోవువారియందును, కూలినాలికి చేరినవారియందును ఎన్ని లోపములున్నను లెక్కచేయరు. కాని పూర్ణప్రజ్ఞగల రంధ్రాన్వేషకులు కొందఱు గ్రామజనులహృదయసీమలో పరమపూజ్యస్థానమునున్న పూర్ణమ్మగారియందును, స్వాములవారియందును పాపభూయిష్ఠమగులోపముల నెన్నసాగిరి. ఉత్సవదినములలో నాలోప మెటులనో మఱచిపోయినను ఉత్సవమైన మఱునాటినుండియు యావిషయమై తీవ్రవిమర్శనలు బయలు

దేరెను. పూర్ణమ్మగారియందు పరిపూర్ణ భక్తివిశ్వాసములు కల వారు 'అనరాదు', 'వినరాదు', 'పాపము', 'పాపము', 'నరకమున బడిపోవుదు' రని వాదించినను చిన్నకారువారు వినరైరి. 'ఇంత వేదాంతురాలే !! ఈమెయందే లోపమా? జుట్టుజందెములు తీసివైచి సర్వసంగపరిత్యాగినని కాషాయాంబరములుగట్టి మహాభాష్యప్రసంగములు చేయజాలిన యతీంద్రుడే!! అట్టి వానియందే లోపమా? లోకమున గురుపీఠమున నుండదగిన వారియందే దుర్గుణంబులున్నచో వీరు లోకుల నేమిబాగు చేయుదురు? టట్. ఈ దుర్మార్గులను ఉపేక్షింపరాదు. తగినశాస్తి చేసి బుద్ధిచెప్పవలసినదే' అని ఊరిలోని యువ జనులు కొందఱు నిశ్చయించిరి. 'రాజు తలచిన దెబ్బలకు కొదవా?' యన్నటుల ఆకతాయలు తలపెట్టిన కానికార్యమేది? జయంతి ముగిసిన రెండవనాటి యుదయము లేచి చూచునప్ప టికి పూర్ణమ్మగారి వాకిటిముందర ఎంతఅసహ్యము చేయ వలయునో అంతయుచేసిరి. చక్కగా సున్నముగొట్టిన యింటి గోడలు కొంటెవాండ్ల దుడుకువ్రాతలతో నిండిపోయినవి. బుద్ధిశాలినియగు పూర్ణమ్మగారి బీభత్సమునంతయు నెప్పుడు లేచి చూచుకొనెనో గాని ఆమెయు, ఆమె స్వాములవారును గూడ తెల్లవారునప్పటి కాయింటిలోకాదుగదా ఆయూరిలో గూడ కాన్పించలేదు!! యోగ్యత మనుష్యులకు వజ్రాంగి జోడు. ఎట్టిపాండిత్యమును యెట్టిమనీషయు శీలముతో సరి రాదు. వినీతవర్తనమునకు నేడును నమూల్యగౌరవమున్నది. ఎట్టిపరిస్థితులయందును వక్రతలేని నైతికజీవితమును గడప

నేర్చినవారే ధన్యులు. వారే గురుపీఠమున నుండగలవారు. అట్టివారి విద్యావిశేషములే జగన్మాన్యతబడయును. జగము, వారి వశము. జగమునకు వారు అజేయులు. శారదా! భక్తి జ్ఞాన వైరాగ్యముల విషయమై పరిశ్రమించిన యిట్టి వేదాంతుల సేవయే యింత ప్రమాదభీకరమైయుండ నింక మావంటి పూర్వసువాసినుల గతియేమి? ఏవిధముగా మా జీవితములు గడపుకొనవలయును? ఏమియు తోచకున్నది? నీవు దీనికేమి సమాధానమిచ్చెదవో యని నీకు వ్రాసితిని. త్వరలో ప్రత్యుత్తరము వ్రాయగోరెదను. ఇట్లు

'సోదరి, రాజ్యలక్ష్మి.'

కల్పలతా! రాజ్యలక్ష్మి వ్రాసినఉత్తరమే కడు దీర్ఘముగా నున్నది. దీనికి నేను వ్రాసిన ప్రత్యుత్తరముగూడ పంపినచో రెండునుగలిసి భారమధికమైనచో పోష్టలుడిపార్టుమెంటు వారు, నీకడ అధికరుసుము తీయవచ్చును. ఈమధ్యనే అణాకవరునకు మఱియొకదమ్మిడీ తగిలించిరట. మన మిట్టి భారమైనజాబులు నడుపసాగినచో ఆదమ్మిడీ, కానీగానో అర్ధణాగానో, మారవచ్చును. ఈ డబ్బుకటువుదినములలో ఈ కాగితపుసంచులు నానాటికి ప్రియమగుచున్నచో మన యుత్తర ప్రత్యుత్తరములకు అంతరాయము వాటిల్లునేమోనని నా భయము. కాన నేను రాజ్యలక్ష్మికి వ్రాసిన ప్రత్యుత్తరము ఈమారు జాబుతో పంపుదును.

భావపురి ఇట్లు,

1–7–31 మిత్రురాలు, శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు :—

నెచ్చెలీ !

క్షమింపుము. నీవుత్తరమును బుట్టదాఖలుచేసితి ననుకొనుచుంటివో, నాకిచ్చిన వాగ్దానము మఱచిపోయిన దనుకొనుచుంటివో, ప్రియస్నేహితురాలనగు నన్నుగూడ విస్మరించు నంతటి అయిశ్వర్యము మా శారదకేమియబ్బినదనుకొనుచుంటివో!! ఎటుల భావించినను సరియే, ఏమియనినను సరియే. రాజ్యలక్ష్మికి నేనువ్రాసిన జాబును ఇదిగోపంపెదనని వాగ్దత్తముచేసి మూడుమాసములకు జబాబొసంగుచున్న నేను నీఆగ్రహమున కెంతయైన తగియేయున్నాను. ఏమిచేయుదును! ఏదినముకాదినము నేడుతప్పక కల్పలతకు జాబువ్రాయవలయునను కొనుటయు ఆసమయమునకేదియో యూహింపనిక్రొత్తపని తటస్థపడుటయు నీకుజాబుపంపుపని అడుగునబడుటయు యిట్లు విచిత్రముగాగడచిపోయినవి తొంబదిదినములు. అహా! నా అలసభావముతలంచుకొనిన నాలో నాకే బిడియమగుచున్నది. అయితే, ఇంతకును రాజ్యలక్ష్మికి నేనువ్రాసినజాబునకు నీకు గూడ నొకకాపీవ్రాసిపంపుటయేగాని నేను క్రొత్తగావ్రాయ నెంచినదిగూడలేదు. దానికే యిన్నిఅడ్డంకులు. రాజ్యలక్ష్మి నాకువ్రాసినజాబు చూచితివిగదా. అమెకిట్లు ప్రత్యుత్తరము వ్రాసితిని.

'చి. రాజ్యలక్ష్మికి.

సోదరీ ! నీవువ్రాసినఉత్తరము తిలకించితిని. పూర్ణమ్మ అవమానమునకు చింతింపను. లోకవంచకులగువారి కట్టిపరాభవము లెప్పుడును సహజములే. కాని అది యొకయుదాహరణముగాగాని అత్యంతనైరాశ్యముతో 'అయితే యికమాగతేమిటి?' యని నీవువేసినప్రశ్న నామానసమును కలంచివైచుచున్నది. అడిగినదానవు నీవొక్కతవేఅయినను యావద్భారతవితంతుమండలివాణియు నీలో ఐక్యమైనట్లుగా నాకుదోచుచున్నది. మనదేశమునందు నీవలెనేలక్షలకొలది బాలవితంతువులు నానాకడగండ్లుబడుచు అనవరతము మా గతేమిటని రోదించుచు నిస్సహాయులై దిశలుపరికించుచున్నప్పుడు యిది నీయొక్కరితమాటగా నేనెట్లుభావింతును? అవును సోదరీ! నీవట్లుప్రశ్నించుటలో తప్పులేదు. ఎప్పుడు నీవు విగతభర్తృకవైతివో అప్పుడే హిందూసంఘమంతయు నీపై నిర్దయాత్మకమైనదృష్టులనుబఱపును. ఎటుజూచినను నీమార్గము కంటకయుతమైచూపట్టును. మతము, తననియమములచే నిన్ను నిర్బంధించును. సంఘము నిన్ను తనపాశములచే కట్టివేయును. ఆచారములు నీకు చరణశృంఖలములగును. అత్తవారు నీకొప్పును గొట్టుట కుద్యుక్తులగుదురు. తలిదండ్రులు నీ చాకిరీకి తనియుకుందురు. సోదరులు నిన్నుదాసీనపఱతురు. నానాశాస్త్రంబులు జదివి, నానాసాధనలుచేసి, అడవులలో కాయగసరులుమెసవుచు తపంబుసేసెడి మహర్షులకు సైతము దుర్లభంబైన బ్రహ్మచర్యవ్రతము, ఏసంస్కారమును బొందని నీతలపై బడును. దీని

కించుకదప్పితివా అధఃపాతాళమునకు కూలిపోవుదువు. ఇన్ని అనివార్యక్లేశములు నిన్నుచుట్టిముట్టియుండగా నీవు తల్లడించు చిత్తముతో 'నాగతేమిటి?' అనిప్రశ్నించుటలో దోసమేమి? అయితే ఆమహానసగృహమునువీడి, ఆఆచారశృంఖలల నించుక తొలగించుకొని, ఆసాంఘికపాశముల రవంతత్రెంచుకొని యొక్కమాఱు నీసునిశితదృష్టిని నీజన్మసీమపైబఱపుము. ఆహా! నీజన్మను సార్థకమొనర్చుకొనుటకు ఎన్నిత్రోవలు గాన్పించునో, సోదరీ! నీకు సంభవించిన వైధవ్యమునకు కారకుడు, దైవమని దైవమునుదూరినను, మనుజుడని మానవునిదూరినను ప్రయోజనములేదు. దాన నీకష్టములు తొలగబోవు. ఏమైననేమి? సంసారజంజాటమునుండి నీవు తొలగింపబడితివి. విరాగజీవితము నీతలపైబడినది. ఇంకను నీవు వెఱ్ఱిదానవై ఏ అన్నదమ్ముల ఏఅక్కచెల్లెండ్ర ఏబావలమఱదుల క్షుద్రసంసారములభారమునో నీతలపై వేసికొని యేలఅల్లాడెదవు? ఎప్పుడు నీసంసారముభగ్నమైనదో అప్పుడే నీవు విశ్వకుటుంబమునకు జెందితివి. కావున యీవిశాలవిశ్వమునందలి స్త్రీపురుషులెల్లరు నీకు స్వకుటుంబములోనివారు. వారినెల్లగ నీవు ఉద్ధరించుటకు బూనుకొనవలయును. నీవు బ్రహ్మచారిణివి. అనాఘ్రాత కుసుమమవు. నీతిధర్మముల రెంటిని అంగరక్షకులనుగా బెట్టుకొని సేవావ్రతమునుబూని కార్యక్షేత్రమున బ్రవేశించుము. సోదరీ! దూరముపోనవసరములేదు. నీదేశమునందే నీస్త్రీజాతివంకనే దృష్టినిసారించుము. ఎన్నికార్యరంగములు నిన్నాహ్వానించునో!

సోదరీ! అదిగో చూడుము. ఇతరదేశములలో స్త్రీలు నూటికి నూర్వురుచదువుకొనినవారే. నీదేశమునందో, నూటికి 1.5 అనగా నూటికిద్దరైనను చదివినవారులేరు. నీజాతియిట్లు అవిద్యాంధకారమున గొట్టుకొనుటకంటె మిన్నయగు నధోగతియేమున్నది? వీరిఅవిద్యబాపుటకు నీవు కృషిచేయవచ్చును గదా.

సోదరీ! యిటుచూడుము. ఇంగ్లాండుమున్నగు పశ్చిమదేశములలో వేయికి అరువదిమందియే శిశువులు గతించుచున్నారు. నీదేశమునందో వేయింటికి 250. అకటా! జాతిక్షీణతకింతకంటె అధికమగుదుర్దశ వేరొండుగలదా? శిశుచికిత్సనభ్యసించి నీవు వీరియసువుల నిలుపరాదా?

సోదరీ! మఱొకదెసతిలకింపుము. వారే బాలింతలు. ఒక్క మన చెన్నరాజధానియందే 1929-లో మరణించిన బాలింతలసంఖ్య 3000. అకటా! యీదుస్థితిదలంచిన కడుపుచెఱువగును. వీరిలో ముప్పాతిక మువ్వీసము పల్లెటూరులలో చాకలి, మంగలి, వడ్డె, గమళ్ల, తురక, దూదేకు మున్నగు అజ్ఞానజాతులకుజెందిన మొరటుమంత్రసానుల మోటుచేష్టలకు బలియైనవారే. తాలూకా కొకమంత్రసానియున్న నది, యా తాలూకాపట్టణమునకే చాలదు. ఇక తాలూకాకంతకును నేమి సహాయముచేయును? సోదరీ! నీ వీ మంత్రసానిశిక్షణము బడసినచో నీ సోదరీమణులెందరకో ప్రాణదానము చేయవచ్చునుగదా?

సోదరీ! ఈయొక్క బాలెంతలేనా కష్టపడుచున్నవారు? కాదు కాదు. 'చావనైన చచ్చెదముకాని మారోగమిదియని పరపురుషులకు చెప్పజాల'మని యనేకరహస్యవ్యాధులచే గాసిల్లుచు ఏటేట మృత్యుగహ్వరముజొచ్చుచున్న మానవతులెందరు! సోదరీ! నీవు వైద్యవిద్యనభ్యసించినచో ఈమానవతులకెంత యుపకారకరము?

సోదరీ! ఆచక్కి చూడుము. వారు నీవలెనే వైధవ్యదుఃఖముచే దందహ్యమానలగుచున్న బాలవితంతువులు. పదునైదేండ్లలోపువారే మూడులక్షలు. వారి అవిరళాశ్రుధారలచే సిక్తమగుచుండుటచేగాబోలు యీభారతావని ఒకనాటికిని సుఖస్థితికిరాకున్నది. వారికి పునస్సౌభాగ్యములనుగల్పించుటో, లేక సేవావ్రతలనుగాజేయుటో చేసిన యెంతపుణ్యము!

సోదరీ! ఆవంక చూడుము. వెన్నునంటినపొట్టలు! శతధా చిఱిగిన కట్టువస్త్రములు! వెంట 'ఆకలేఅమ్మా!' అనియేడ్చే బిడ్డలు!! అదియేమందువు? ఆర్థికదారిద్ర్యము. యుగయుగముల నుండి నీస్త్రీసంఘమునకు ఆర్థికాధికారము తొలగింపబడినది. ఒక్కపైసకుసైతము నీవు పరులను చేయిచాపవలసినదే! ధనములేనిస్వాతంత్ర్యము స్వాతంత్ర్యముగాదు. సోదరీ! నీవీవిషయమై కృషిచేయరాదా?

సోదరీ! ఈదెసచూడుము. స్త్రీల బలవన్మరణములు!! ఏమి దీనికికారణము? అత్తలగారడి, మగలనిరంకుశత, బాలికనిస్సహాయత!! వివాహకాలమునాటికట్నము పూర్తిగా చెంద

లేదనియో, భార్యతాలూకుసొమ్ము నప్పుడే తాచప్పరించుటకు వీలుగాలేదనియో ఏదియోకారణము. స్త్రీలబ్రదుకుకే హాని. ఈదేశమునందు అత్తలకోడండ్రసామరస్యము వినము, కనము. అటులని కూడియుండకనుతప్పదు. అత్త యెప్పుడును తనక్షేమము కోరదని కోడలినమ్మకము. 'కోడలెప్పుడును నాడునికి నాశించ'దని అత్తఅభిప్రాయము. ఈపొరపొచ్చెములు మనదేశమునందలి ప్రతిచిన్నసంసారమునందును వేరూనియున్నవి. ఈపరస్పరావిశ్వాసమువలన భూతలస్వర్గముగానుండవలసిన ప్రతిగృహమును నరకసదృశమైపోవుచున్నది. ఉల్లాసకరమైన పడుచుప్రాయమున మనదేశపు యువతులవలె రాయిడిపడుచున్నవారు ప్రపంచమున నెచ్చటనులేరు. సోదరీ! నీవీకార్యక్షేత్రమున ప్రవేశించి వీరిలో సామరస్యము పెంపొందుటకు యత్నింపరాదా?

సోదరీ! ఆదెసల నుపలక్షింపుము. ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డలను క్రూరులగుతలిదండ్రులు ముసలివారికెట్లు విక్రయించుచున్నారో. ఆడుపిల్ల జడవస్తుసముదాయములలో నొకటియని వారిఅభిప్రాయము. సోదరీ! ఇట్టి నిర్దాక్షిణ్యపు తలిదండ్రులమానసములు దయార్ద్రములగునట్లు కృషిచేసిన నీకెంతపుణ్యము!

సోదరీ! అనాదినుండియు గృహపరిశ్రమలు, లలితకళలు స్త్రీలసొత్తు. స్త్రీలకును చతుష్షష్టికళలున్నవి. అలనాడు ధక్కామజిలినులకు నూలునుతయారుచేసినవారును, రాజాధిరాజులు

ధరింపతగిన జరీబుటేదారి పనిచేసినవారును, చిత్రవిచిత్రములగు శిల్పములను చిత్రములనువిరచించినవారును స్త్రీలేగదా. నేడు హిందూస్త్రీ ఒక్కముగ్గుపెట్టలేదు. ఒక్కబొమ్మగీయలేదు. ఒక్కపాటపాడలేదు. ఒక్కమాలకట్టలేదు. ఒక్కకుట్టుకుట్ట లేదు. ఒక్కఅల్లికఅల్లలేదు. ఒక్కవంటకమువండలేదు. ఒక్క పద్యమువ్రాయలేదు. ఒక్కపూలమొక్కకు దోహదముచేయ లేదు. ఇకచాయలు, సుగంధతైలములు, అత్తరువులు, నలుగుబిండ్లు, కాటుకలు, కుంకుమలు మున్నగు గృహపరిశ్రమ లసలే విస్మృతములై పోయినవి. సోదరీ! నీ వీకళలనభ్యసించినచో నీస్త్రీలోకమునం దీకళల బునరుజ్జీవింపజేయవచ్చునుగదా!

సోదరీ! మనస్త్రీలయం దింకను మూఢనమ్మకములు నశింపలేదు. డంబాచారులను విశ్వసించికొల్చుటలు పోలేదు. ఎవడైనను మొగమున పట్టెడు కుంకుమబొట్టుపెట్టుకొని బవిరిగడ్డము రుద్రాక్షలతో ఊళ్లోకివచ్చెనో ఇకవానిచుట్టు మూగుదురు. తాయెత్తులు, రక్షరేకులు, వేరులు, మంత్రతీర్థములు ఇచ్చెడువారు గన్పడిన మనవారికి గంగవెఱ్ఱులెత్తును. వాడు బిచ్చమెత్తుకొను బైరాగేగాని మఱిఅంతకంటె అధముడేకాని యే కులమువాడుగాని, యెట్టివాడుగాని వానికి పాదాక్రాంతలగుదురు. వీరికి వాంఛనీయఫలములు సాధారణముగా రోగనివృత్తి, సంతానప్రాప్తి మున్నగునవి. ఒక రొకరివలన మోసగింపబడినారు అనివినుచున్నను మనస్త్రీల కిట్టివారియందుగల నమ్మకము అత్యధికము. సోదరీ! మనదేశమింకను మూఢ్య దేవత

కాలవాలమైయున్నదనుట కిది ప్రబలమగుతార్కాణ. వీరుగాక మఱొకరున్నారు. వీరు సూటిగా జనులను పునరావృత్తిరహిత మగు మోక్షసామ్రాజ్యమునకు రవాణాచేసే వేదాంతులు. శన గలునములుచు ఉలవలుచేతబెట్టువారు వీరు. స్త్రీలోకములో ఈకపటవేదాంతులకున్న పలుకుబడి అన్యులకులేదు. లోకులను వంచించుటకు ఈవేదాంతోపదేశమువంటి మచ్చుమందు వేఱొకటిలేదు. తమదోషములను కప్పిపెట్టుకొని లోకులకు మంచివారమని భ్రమగొల్పుటకు ఈ వేదాంతవిచారణ మంచి మఱుగు. ఎట్టి కపటులుగాని ఎట్టిదుర్మార్గులుగాని ఈవేదాంతపు ముక్కలు నాల్గునేర్చుకొనిరేని ఇక వారినిబోలిన పెద్దలులేరు. భగవద్గీత, పంచదశి, సీతారామాంజనేయము మున్నగు ప్రసిద్ధ వేదాంతగ్రంథము లిట్టికపటవేదాంతుల చేతులలోబడి మాలిన్యము నందుచున్నవి. నీవు ఒక్కపూర్ణమ్మనుగూర్చి వినియేయింత ఆశ్చర్యము నందుచున్నావుగాని యిట్టిపూర్ణమ్మలు దేశమంతట లెక్కకు మిక్కిలిగానున్నారు. బ్రహ్మవిద్యావిషయములను వాక్కుచే నుచ్చరించుటకైన నర్హులుగాని యిట్టి యవినీతులు గురువులై పరమార్థోపదేశములను జేయుటయు అమాయికలగు మనస్త్రీజన మీవంచకుల మాయావాగురులలో జిక్కుపడుటయు నిజముగా సహింపదగినవిషయముగాదు. కావున వీనివిషయమై నీవు స్త్రీలకు ప్రబోధింపవచ్చునుగదా?

నియోజకనియోజితస్వాతంత్ర్యము మనస్త్రీలకు ఇటీవల ప్రసాదింపబడినది. మునుముం దింతకంటె నధికమగుహక్కులు

గూడ స్త్రీలకురావచ్చును. కాని యీ హక్కులను యీ స్వాతంత్ర్యములను ఉపయోగించుకొను సామర్థ్యము మన స్త్రీలకులేనిమాట వాస్తవమేగదా. సోదరీ! నీ వీవిషయములను పరిశ్రమించి నేర్చుకొనినచో నీ స్త్రీజనులలో వీనినిగూర్చి బోధింపవచ్చునుగదా ?

శారదాశాసనము వచ్చెవచ్చెననినారు. ఉయ్యెలలోని పసిపాపలకు గర్భస్థశిశువులకుగూడ కల్యాణములుచేసినారు. ఈవిషయములో నధికముగాతొందరపడినవారు మనస్త్రీలే. దీనివలని యధికనష్టమునకు పాల్పడినవారును మనస్త్రీలే. ఇట్టి సందర్భములలో నీవంటివారీ చట్టములవలన ప్రమాదములేమిని వివరించినచో వీరిలో కొంతమందినైన కాపాడినపుణ్యము నీకు ప్రాప్తించియుండునుగదా ?

సోదరీ ! ఇటులని యెన్నివిషయములని చెప్పవచ్చును. సర్వవిధములదుస్థితియందున్న మన స్త్రీసంఘమునకుచేయవలసిన యుపకృతులనుగూర్చి క్లుప్తముగావివరించినను చేటభారతమగును. కాన యీచిన్నలేఖ కిది స్థలముకాదు. ఈకొద్దివిషయములనైనను నేనువివరించుటకు కారణమేమనగా నీజీవితమును సార్థకమొనర్చుకొనుటకు మార్గములు పెక్కులున్నవనియు, నీవు హతాశవుగావలదనియు నెల్లడించుటకే. ఇటీవల్ల బొంబాయిలో భారతమహిళాశ్రమమనుపేర వితంతువులకు సుశిక్షనొసంగి సేవాపరాయణలుగాజేయుటకు నొకఆశ్రమమును జమన్‌లాల్ బజాజు మున్నగుమహనీయులు స్థాపించియున్నారు.

ఇష్టముండినవా రట్టి ఆశ్రమములలో శిక్షణము పడసివచ్చిరేని దేశమునందట్టి మహిళాశ్రమములెన్నిటినో స్థాపించి లోకమును సేవించి సార్థకజన్ములుగావచ్చును. ఏవితంతుసోదరీమణియైనను తనజీవితములో లోకోపకారమునకై వినియోగించుట కవలంబింపవలసినమార్గము లివిగాని వేదాంతులయుపదేశములను శుష్కముగా నాలించుటగాదు. మనస్త్రీలలో నిప్పుడువ్యాపించియున్న వేదాంతాభిలాష నిజమైనబ్రహ్మజ్ఞానమనియు దాన వారు పునీతులై లోకమును పునీతముగావించుచున్నారనియు, ఆచరణవిహీనమగు ఈశుష్కజిజ్ఞాసచేతనే మోక్ష మఱచేతి వైకుంఠమగుననియు నీవెప్పుడును భావింపకుము. సహజముగా అవిద్యాంధకారనిమగ్నలై నిజవృత్తమును ప్రపంచవృత్తమును దెలియక గొట్టుకాడెడి మనస్త్రీలయందు స్వల్పముగానుండెడి తెలిసికొనవలయునను నిచ్ఛ, వివేకము, పరిశీలనాసక్తి మున్నగులక్షణము లీవేదాంతబోధలచే మఱింత నశించిపోవుచున్నవి. సీతారామాంజనేయాది యుద్గ్రంథములను నిరంతరముపఠించెడి నారీమణులనెవరినైనను ఏవిషయమునుగూర్చియైనను, ముఖ్యముగా వర్తమానకాలమున స్త్రీలయభివృద్ధికై జరిగెడి సర్వారంభములనుగూర్చియైనను వారిని ప్రశ్నింపుము. మాకు వానితో బనిలేదని హృదయముచెదరునట్లు జబాబిచ్చెదరు. అయిన మీకు దేనితోపని అనుము. మరల మాకు పరతత్వవిచారణయే కర్తవ్యమందురు. మంచిది. వారితత్వజిజ్ఞాసకు చేమోడ్పు. కాని నిజముగా వీరట్టి పరతత్వవిచారణమునందే నిమగ్నలై యైహికవిషయములం దనురక్తిలేక యున్నారా?

అదియు వట్టిదే. ఒకకానీ వచ్చునన్న, ఆశయు, ఒకకానీ పోవు నన్న, దుఃఖమును వీరు విడిచిరా? వట్టిది! ఇక వీరి తత్వవిచార మెక్కడ? సోదరీ! విషయమదిగాదు. సర్వవిషయములందును అలిప్తబుద్ధితో వర్తించమని అభిప్రాయముగాని సర్వవిషయము లందును విముఖులై మూఢులుకమ్మని వేదాంతబోధయొక్క అర్థముగాదు. విషయపరిజ్ఞానము మానవునకెప్పుడును వెగటు గాదు. ఏవిషయమును తెలిసికొనక కేవలము వాచామాత్ర ముగా తన్నే స్మరించుచు ఉన్నచోటునుండి కదలక కూర్చుండు డని చెప్పుట భగవదుద్దేశముగాదు. భగవంతునిచే మనకు ప్రసా దింపబడిన కర్మేంద్రియజ్ఞానేంద్రియములుగాని మనోబుద్ధి చిత్తా హంకారములుగాని స్వాభావికముగా కర్మపరతంత్రములై యే యుండ, మనము, సర్వకర్మలను విడనాడవలయునని భగవంతుని యుద్దేశమనుట యెట్లుపొసగును? కాన సోదరీ! విషయసంగ్ర హణముగాని విషయపరిజ్ఞానముగాని యెప్పుడును పరిత్యాజింప దగినదిగాదు. దేన బట్టిన దాన నధికవ్యామోహము కలిగియుం డకపోవుటయే కర్మపరిత్యాగము. ఈవిషయమెఱుగకయే వేదాంతులనబడెడివారు కుమార్గమున బడిపోవుచున్నారు. లోకోత్తరపురుషుడగు మహాత్మాగాంధీని చూడుము. మానవ కల్యాణమునకై ఆయన చేయనిపనిలేదు. ఆవిధముగాజూచిన ఆయనయంతటివిషయలాలసుడు, కర్మపరతంత్రుడు లేడనవల యును. కాని ఆయనను అట్లెవ్వరైన అనుటకు సాహసింపగలరా? విషయమును గ్రహించుటయు, దానిబాగోగులు పరిశీలించు టయు, చెడునుతొలగించి మంచిని పరిగ్రహించుటయు మహా

త్మునిమతము. అట్టివాడాతడు వానికిలోబడినవాడుకాడు. మఱియు వానికి నియంతగూడనగును. మహాత్ముని అనాసక్తి యోగ సిద్ధానినే ప్రతిపాదించుచున్నది. సోదరీ! నీవుగూడ యిట్టిఅనాసక్తబుద్ధితో కర్మపరతంత్రురాలవుకమ్ము. జగము నీకు వశమగును. జగమునకు నీవు అజేయురాలవగుదువు. అయితే నీవు యిప్పట్టున నిక్కమైనవేదాంతినివే కావలయును. "సుఖదుఃఖే సమేకృత్వా లాభాలాభౌజయాజయౌ"అను భగవద్గీతాసూక్తిని సర్వదా స్మరించుచుండవలయును. ఏలనందువా? అవిచార్యబుద్ధితో ప్రల్లదములాడుట లోకులస్వభావము. కాన నీ వేస్త్రీసంఘమును సేవింపబూనుకొంటివో ఆస్త్రీసంఘమే నిన్నుపరిహసించును, ద్వేషించును, కోపించును, నిందించును. అయితే రోగనివృత్తికై మందుమ్రింగించెడి తల్లివ్రేలునుకొఱికిన బిడ్డను తల్లి యేవిధముగా ద్వేషింపదో ఆవిధముగా నిన్ను ఆక్షేపించెడి స్త్రీసంఘమునెడ నీవు అద్వేషబుద్ధిగలదానవు కావలయును.

"యస్సర్వత్రా నభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్
నాభి నందతి నద్వేష్టి తస్య ప్రజ్ఞాప్రతిష్ఠితా."

అన్నాడు భగవద్గీతలో. సర్వత్రరాగములేక శుభాశుభముల బడసినపుడు సంతోషవిషాదముల బొందకయుండు వారి బుద్ధిస్థిరమైనదని పైగీతాసూక్తితాత్పర్యము. ఇట్టి స్థిరబుద్ధితో సత్యపథమున విఘ్ననిహన్యమానవుకాక కార్యక్రమమును

సాగించినచో లోకమునకు సత్యమును ఋజువుచేయుట కెంత కాలమో పట్టదు. సర్వలోకశరణ్యుడగు భగవంతుడు నిన్నట్టి వేదాంతినివగున ట్లనుగ్రహించునుగాక!'

కల్పలతా! నేను రాజ్యలక్ష్మికి వ్రాసినలేఖయిది. బాగుగానున్నదా?

భావపురి,
1-1-32

ఇట్లు
శారద.

ప్రియమైన కల్పలతకు:—

నెచ్చెలీ!

నా జాగునకు నీవు క్షమింతువు. నీ ఆలస్యమునకు నేను హర్షింతును. మన కొండొరులపై గల ప్రగాఢప్రేమసౌహార్ద్రము లొకరిలోపము _ నొకరికి తెలియనీయకపోవచ్చును. ఒకరి మందమతితనము ఒకరికి హితకరముగానే యుండవచ్చును. కాని యితరుల కది యింపుగానుండునా? దొంగలుబడ్డ ఆఱునెలలకు కుక్కలుమొఱిగెనన్న సామ్యముగాఎప్పుడో కార్తికమాసములో జరిగిన మహిళాసభ సందర్భమున మేముగావించిన అమరావతీ యాత్రనుగూర్చి నీవిప్పుడు ప్రశ్నించుటయు నేను చెప్పుటయు నగుబాటుగాక మఱేమి? అయితే నీవలెనే నాఆలస్యమునకు మా గృహలక్ష్మి పాఠకులుగూడ బాగుగా నలవాటుపడినవారగుటచే నేను జవాబువ్రాయుటకు శంకింపకున్నాను. మఱియు ప్రాతదైన మాత్రమున బంగారమున కెట్లు విలువతగ్గదో అదేవిధమున మా అమరావతీప్రయాణసమాచారము కాలముగడచినను విన దగినదేయగుట_వివరింపదగినదేయగుట నీమాటత్రోసివేయక తెలియబఱచుచున్నాను; వినుము.

అయిద వాంధ్రరాష్ట్రీయ మహిళాసభ ఆ సాయంత్ర ముతోసరి. రాత్రికి అధ్యక్షురాలి యొక్కయు, ప్రతినిధినుల యొక్కయు గౌరవార్థము ఆహ్వానసంఘమువారి ప్రత్యేకపు బువ్వము బంతి. అంతవఱకు మహాసభకుదావలమై మహిళా

మణుల గంభీరోపన్యాసములచే ప్రతిధ్వనించిన ఆటౌనుహై స్కూలు మేడమీది పెద్దసావడి, అంతలో భోజనశాలయైపోయి నది. ఆంధ్రజననీకంఠసీమ నలంకరించుటకై ఆహ్వానసంఘము వారు కూర్చిన విదుషీమణిహారములుగాని అవి భోజనపుపంక్తు లుగావు. ఆపంక్తులలో వెల్లివిరిసిన ఉత్సాహము ఆనందము, ఆ మణిహారములోని తళతళలుగాని భక్ష్యభోజ్యముల గడబిడ లుగావు. వానిని కన్నులారగాంచుటచే నెట్టి సంతోషము గల్గెనో అది అనుభవవైకవేద్యముగాని వివరింపదగినదికాదు. తినుటకంటెకనుటకు, కనుటకంటెవినుటకు నేనుముందంటే నేనుముందని పోటీలుపడి తనిసినవి శ్రవణేంద్రియనేత్రేంద్రియ ములు. నీరసముల కక్కడతావులేదు. భోజ్యములా రసమయ ములు! పాటలా రసమయములు! భాషణంబులా రసమయములు! కలకంఠకంఠనినదమును తిరస్కరించు మనోజ్ఞమంజులమధుర స్వరంబున నొక్కెడ జాతీయగీతములు, వేఱొక్కెడ భరత మాతృగేయము, ఇంకొక్కెడ భావగీతములు! మఱియింకొ క్కెడ సంస్కృతశ్లోకములు! అహో! ఏ వివాహపువేడుక కందఱువిదుషీమణుల సమాగమము సంభవించును? ఏ విందు నందట్టి మనోజ్ఞమధురగేయములు వీనులవిందుచేయును? నిజ ముగా నేత్రపర్వము! కర్ణపేయము! హృదయాహ్లాదకర మాదృశ్యము. సరి. సరి. మీ అమరావతీయాత్రకును ఆహ్వాన సంఘమువారి. విందునకును నేమి సంబంధము? విందుజ్ఞప్తికి వచ్చుటచే విషయము మఱచిపోయినదా యేమి శారద యని నవ్వుచున్నావా? కల్పలతా! పొరపాటుపడకు. విందునకు

పూర్వాపరసంభాషణలలోను, విందుగుడుచుచున్నప్పుడును నిశ్చయమైనది మాఅమరావతీయాత్ర. కాననిది పీర్లపండుగకును గోకులాష్టమికినిముడిగాదు. సంబంధసమాచారమే. తెల్లవారితే ఆ గుంటూరిలో వోట్లపండగ. కాన ఆరాత్రి మేము మాబసకు వచ్చుటకు ఒక ఒంటెద్దుబండివాని నడుగగా ఆఱణాలు బాడుగీయుడనెను. నిన్నను, మొన్నను బేడకు అణాన్నరకు మేము మేమని అడ్డఅడ్డములువచ్చితిరే నేడేల యీ గిరాకీ అని అడుగగా ఱేపు యీ ఊరిలో మ్యునిసిపల్ యెలెక్షునండీ అనెను. వోట్ల ఆరాటపోరాటములు ప్రసాదించిన శ్వేతసీమవారు మోటారుబండ్లనుగూడ అనుగ్రహించియే యున్నారుగదా. ఆవడిదుడుకుల కవియే తగునుగాని మీ బక్కెద్దుబండ్లెందుకని మేమంటిమి. అవునండీ అవన్నీ ఆ పనిమీద తిరుగుతుంటే మాకీనాడే పావలాడబ్బులు పెచ్చొచ్చేది అన్నాడు. అవును నిజమే. ఈ సీమమోటారుబండ్లు నాటుబండ్లవానికూటిలో నెట్లు దుమ్ముపోసినదీ మనము చూచుచున్న విషయమగుటచేత ఆ బండివాడడిగిన బాడుగయిచ్చి బసకువెళ్ళితిమి. కాని ఊరిలోనిబస్సులు, కారులు, జట్కాలు అన్నిటిని అభ్యర్థులు కంట్రాక్టు తీసికొనినచో అమరావతీప్రయాణ మెట్లుసాగునా యని మనసులో ఆందోళనగానేయుండెను.

రేయిగడచినది. వేగుబోకలేచి ప్రాతఃకృత్యములు నిర్వర్తించుకొని సత్వరమే సభాప్రదేశమున కరుదెంచితిమి. అప్పటికప్పుడే ఆహ్వానసంఘమువారు తయారుచేయించియుంచిన కాఫీ,

ఉప్మా, యిడ్లీ మున్నగు ఉదయకాలపు అల్పాహారములు ప్రతినిధినులకొఱకు యెదురుజూచుచుండెను. ఇష్టమైనవారు వానిని స్వీకరించినవెనుక యెల్లరము ఆ మేడవసారాలోజేరి దొరకునో దొరకదో అనుకొనుచు బస్సుకొఱకు నిరీక్షించుచుంటిమి. కాని సభారంభమునుండి తుదివఱకును రక్షకభటులను నిజమైనరక్షకభటులనుగా జేసికొని వారి పరిపూర్ణసహాయమును బడసిన ఆహ్వానసంఘమువారికి ప్రతినిధినుల కొరక బస్సును సమకూర్చుటకు యెక్కువశ్రమ కలుగలేదు. ఆపోలీసు భటులు యెక్కడికివెళ్లిరో యెట్లుతెచ్చిరో తెలియలేదు. దాదాపు 7 గంటల కొకబస్సును తెచ్చిరి. బస్సులోయెక్కినది యిరునదియిద్దరమని జ్ఞాపకము. గుంటూరునగర సరిహద్దులను దాటినవెనుక చిన్నపెద్దరాతిబండలు తప్ప బాటకిరుదెసల చూడదగినవేమియు కన్పింపమిచే మాదృష్టులు బాటనుండి మాసహయాత్రికులతో భాషించుదెసకుమరలెను. మేమెట్లు వివిధప్రాంతములకు జెందినవారమో అట్లులనే మాప్రసంగములు గూడ వివిధములుగానుండెను. నేను మధ్యచెక్కపై గూర్చుంటిని. నాకు వెనుకనున్న చెక్కపై వచ్చేసభను బళ్ళారి కాహ్వానించిన డాక్టరు లక్ష్మీదేవిగారు కూర్చుండిరి. కాన అచ్చటివారి మాటలన్నియు రాబోవుసభకు సంబంధించినవిగనేయుండెను. ఏమండోయి ఈమాఱు మీ బళ్ళారివచ్చి మీ పులుసు వంగదీస్తాము సిద్ధంగాఉండండని ఒకరు, వస్తాము గాని వస్తే మా కేమివిశేషాలు చూపిస్తారని మఱొకరు, ఆ, యేమివెళ్ళుతామోయేమో, అంతదూరమని ఇంకొకరు, దూర

మైతేనేమి నేను నెలరోజులు సభకలదనగానే వచ్చి మీకు సర్వవిధముల సహాయముజేస్తామని వేఱొకరు ఈ విధముగా తలయొకవిధముగా పలుకుచుండ 'మీరు యెంతఅధికముగా వచ్చిన మాకంతసంతోష'మనీ, 'దూరమంటారేమిటి నేను రావడము లేదా?' అనీ, 'మా బళ్ళారిసభకు వచ్చినవారికి మంచిగలతో భోజనముపెట్టి హంపీ శిథిలము చూపిస్తా'మనీ, 'మాప్రాంతపుస్త్రీలలో బొత్తిగా చలనములేదుకాబట్టి మీరు ముందుగా వచ్చి తోడ్పడితే మఱీసంతోష' మనీ, లక్ష్మీదేవిగారు వారికి వేఱ్వేరుగా ప్రత్యుత్తరము లొసగుచుండిరి.

ఇక మా బల్లమీద రాజమండ్రివారగు భాస్కరమ్మగారు మున్నగువారు గూర్చుండుటచే మా సంభాషణలు వారి కత్యంతప్రీతికరములగు సాంఘికములుగానుండెను. వితంతు వివాహము, శారదాచట్టము, వైధవ్యబాధలు మున్నగువిషయములెన్నియో ప్రస్తావనలోనికి వచ్చెను. "భర్త మరణానంతరము పదియవనాడు మనసంఘములో స్త్రీకిజరిగేశిక్ష మహాదారుణమైనదండీ!! భర్తపోయిన నాటికంటె ఆనాడు ఆస్త్రీయు ఆమె బంధువర్గముగూడ మహాఘోరముగా విలపింతురు. వినుటకు కనుటకు దుస్సహమైనస్థితి అది!!" యని భాస్కరమ్మగారు మిక్కిలి విచారకరముగా బల్కిరి. అప్పుడప్పుడు దీనిలో ఏ కొంచెముశిక్షతగ్గినను మన స్త్రీలే వారి నాక్షేపింతురు. ఉదాసీనపఱతురు. శిరోముండనమువఱకు జరిగినగాని వారిఆక్షేపణలకు గురికాకుండనుండరు అనుచు కొలదిదినములక్రిందట మా గ్రామములో శీలవతియగు నొక యున్నతోద్యోగిభార్య శిరోజములు

తీయించుకొనని మాత్రమున ఆమెకుకలిగిన అవమానమును ఆమెపడినమాటలను నేను వివరించితిని. అవును భర్తచనిపోయిన తరువాత ఆ స్త్రీ ఎంత పూజ్యయైనను యెందుకు కొరగాకుండపోవుచున్నదని అన్నపూర్ణమ్మగారనిరి. ఈవిధముగా ప్రారంభమైన మాసంభాషణలు క్రమముగా కడచినదినము సాంఘికసభలో జరిగిన చర్చలు తీర్మానములు మున్నగు వానిలోనికి దిగిపోయెను. మాప్రసంగములిట్లుండ మాకు ముందు ప్రక్క బల్లమీదగూర్చుండిన శ్యామలాంబగారు నిరంతర ప్రచారకార్యక్రమమునందు వారి జిహ్వాగ్రంబుపై తాండవించెడి జాతీయగీతములు సన్నసన్నగాపాడుచుండిరి. మఱికొంద ఱిట్టిప్రసంగపు గొడవలలోబడక బాటకిరుప్రక్కల కలయచూచుచు 'అన్నీకొండరాళ్ళే! ఎక్కడనూ పచ్చనిపొలమే కన్పడదేమి?' అనుకొనుచుండిరి. మేమిట్లు వివిధప్రసంగములలో మునిగియుండ ఆయిదాఱుమైళ్ళుగడచి నిడుముక్కల యనుగ్రామము సమీపించునప్పటికి తపతప బడబడ టూప్‌టీప్ బుఱ్ఱుబుఱ్ఱు, మని నానాధ్వనులుచేసి మాబస్ ‌బుస్సునఆగిపోయినది. నడపుటకు మరలుత్రిప్పిన మొఱ్ఱోమని కూతలుపెట్టును గాని ముందుకుసాగదు. ఇక చేయవలసినదేమి? అందరము బిలబిలమని బండిదిగి రోడ్డుకుప్రక్కగా నున్న చింతచెట్టుక్రిందికిచేరితిమి. బండికిముందున్న రెండుచక్రములూడబెరికి సారథి బండిమరమ్మతు కుపక్రమించెను. మధ్యేమార్గమున బండిచెడినచో ప్రయాణికులు పడేపాట్లు ఇప్పుడు మోటారుబండ్లలో ప్రయాణముచేయువారి కెల్లరకువేద్యమే. అది గ్రామసమీపముగాని

నిర్జనప్రదేశమైనచో మేమును అట్టిపాట్లకు లోనుగావలసివచ్చెడి దేమో, కాని యెత్తునుంచి పడినను పూలపాన్పుపై బడినట్లు మోటారుచెడినను అది గ్రామపరిసరమగుట పనుగుదల లేకుండ మేము మఱియొక యుత్సాహకరమగు కార్యక్రమమును నడపుటకు వీలయ్యెను. గ్రామములోనికి యేక్రొత్తవారువచ్చినను చుట్టు తండోపతండములుగ మూగుటకలవాటుపడిన గ్రామజనులు నాగరికవేషభాషలలోనున్న యీవింతవారిని జూచుటకప్పుడే చాలమంది పోగైరి. ప్రచారకార్యక్రమమునందు నారితేరి జనపదములలో సంచరించి జానపదుల కష్టసుఖముల నారయువిధము చక్కగనెరిగియున్న ద్రోణంరాజు లక్ష్మిబాయమ్మగారు మాకంటెముందుగా వారిచెంతజేరి 'మీరేకులస్థులు? మీవృత్తియేమి? మీఊళ్ళో ముఖ్యమగు పంటయేమి? మీకు రాట్నములున్నవా? మీఊరిలో పండెడిప్రత్తి నేమిచేసెదరు? మీగుడ్డలనూలు సీమనూలేనా? వ్యవసాయపుపనులులేనప్పుడు మీరేమిచేసెదరు? మీకు కూలి ధాన్యరూపకమా? ధనరూపకమా?' అని ప్రశ్నలువేయదొడంగిరి. ఇంతలో మేముగూడ ఆమెనుకలిసికొని ఆమెవేయుప్రశ్నలను వారిచ్చెడి జబాబులను వినుచు మాకుదోచినవి మేముగూడ అడుగుచు, 'మీరు యెవరు? ఏవూరుమీది? ఎందుకొచ్చారు? ఎక్కడికి వెళ్ళుచున్నారు?' అని యెడతెగక గ్రామీణులువేయు ప్రశ్నాపరంపరలకు ప్రత్యుత్తరములొసంగుచు నిలువబడితిమి. ఇంతలో డాక్టరు లక్ష్మిదేవిగారువచ్చి 'ఆబండి యిప్పుడు బాగుపడునట్లు లేదు. అది బాగగులోపల నొక్కమాఱు గ్రామముచుట్టివత్తు

మురం'డని యెల్లర ప్రోత్సహించిరి. సరేయనసరేయని అందఱము బయలుదేరితిమి. రాజాలనివారును, రానిష్టములేనివారును యేమువ్వురు నలుగురో దిగబడిరి. మాటలలో ఆరితేరిననోళ్ళు, పాటలలో ఆరితేరినకంఠములుగల విదుషీమండలి మూగనో ముతో గ్రామసంచారముచేసిన నేమిసాబగు ? రాటము, మద్య నిషేధము, అస్పృశ్యతానివారణము మున్నగు విషయములను గూర్చి ప్రబోధగీతము లారంభమైనవి. గ్రామసందర్శనము నగరసంకీర్తనగా మాఱిపోయినది. కొలదినిముసములలో గ్రామము చుట్టివచ్చితిమి. మాకోలాహలముచూచి దాదాపు నూరుమంది జానపదులు పిన్నలు పెద్దలుగూడ వెంటవచ్చిరి. మరల చెట్టుక్రిందచేరితిమి. ఆ చెట్టుక్రిందదించియున్న రెండెడ్ల బండి ఉపన్యాసవేదికైనది. పాటలలో సత్తిరాజు శ్యామలాంబ గారు కట్టతెగినయేఱు. చెట్టునీడకువచ్చినను ఆమెయింకను పాడుచునేయుండెను. 'అంతపాటలెందుకు ? నాల్గుమాటలు చెప్పం'డన్నా రాగ్రామస్థులు. కల్లుసారాయిలు విసర్జించి సుఖం చుడని హితముగఱపినారు లక్ష్మీనరసమ్మగారు. పరిశుభ్రతనేర్చు కొనుడని హెచ్చరించినారు భాస్కరమ్మగారు. ఈ ఉపన్యా సము లిట్లుసాగుచుండగా ఒకవృద్ధురాలు నావద్దకువచ్చి 'అమ్మా! మీ రిట్లావస్తే మీ మగోరికి అన్న మెట్లా'గని మెల్లగాఅడిగింది. నాకు పక్కున నవ్వువచ్చినది. అంతనేను నవ్వుచునే-నామిత్రు రాండ్రనుచూచి 'ఇదిగో అమ్మాయిలూ, మీ ఉపన్యాస ములకేమిగాని యీ అవ్వప్రశ్న కుత్తరమీయు'డంటిని.

వారును నాతోటిపాటునవ్వి 'అవ్వా! ఇంట్లోమగవారికి అన్నము యేర్పాటులేకుండనే వచ్చెదమా? కొందఱిండ్లలో అత్తయో, ఆడుబిడ్డయో, తల్లియో, యెవరో పెద్దవారుందురు, కొందఱికి వంటవారుందురు' అని సమాధానమిచ్చిరి. 'నాకు తెలవక అడిగా అమ్మా! తప్పుబట్టుకోకండి' అని ఆఅమ్మిఅనెను. 'తప్పేమిలేదు, ఇది అందఱికీతోచేసందేహమే' అని నేనంటిని. 'అయితే మీరు మీటింగుకొచ్చామంటిరే, ఏమిచెప్పుకున్నా'రని మఱియొక స్త్రీ అడిగెను. 'స్త్రీలకుచదువు, ఆస్తి, హక్కులుకావాలెనని తీర్మా నించా'రని నేనంటిని. 'అయితే అవి వస్తవీ? ఎప్పుడూ?'___

ఇంతలో మాబండికి జవముజీవము వచ్చినట్లుగా మోటారు హారను మ్రోగించినాడు డ్రైవరు. మేమిట్లు సంభాషణలు, సంకీర్తనలు, ఉపన్యాసములు చేయుచు, కాలక్షేపము చేయు చుండ తానుమాత్రము వీనితో పాల్గొనక మోటారుబండి వద్దనే ఉండి బండివానిని తొందరించుచున్న పద్మాసనమ్మగారు బండిబాగైనది రండిరండని చేయూచి పిలిచిరి. సభకు మంగ ళము చెప్పకుండనేవచ్చి అందఱము బండిలోపడితిమి. ఇంతట నుండి అమరావతిచేరువఱకు మాసంభాషణలు చాలవఱకు మేము నిడుముక్కలలో జరిపిన కార్యక్రమమునుగూర్చియు, జానపదులనుగూర్చియు నై యుండెను. మేమిట్లు పరస్పరసల్లాప సౌఖ్యానందరసనిమగ్నులమైయుండ అదిగో అమరావతియని రెవరో. దానితో సుషుప్తి జాగ్రతకు వచ్చినట్లులైనది మాకు.

అమరావతీనగరప్రాచీనవైభవము చాటుటకు ఆరాజ వీధియొక్కటిచాలును. పదిబండ్లయిన నొక్కమాఱుగా నొక్క

పంక్తిగా నొకదానినొకటి యొరసికొనకయె పోవజాలినంత విశాలముగానున్న దా రాచబాట. ఆవీధిగుండ మాబస్సు వేగముగా దేవాలయమువద్దకేగి ఆగినది. అచ్చట మేమంద అముదిగి మావస్తువస్త్రాదులు తీసికొని దేవాలయమునంటి పాఱుచున్న కృష్ణవేణీమహానదిలో స్నానము చేయుటకు వెళ్ళితిమి. నాడు కార్తికసోమవారము, కాన ఆమహాపర్వదిన మున మహానదిలో స్నానము, అమరేశ్వరుని సందర్శనములభిం చుటచే సనాతనధర్మవాసన హృదయములనుండి తొలగనివారికి అమరావతీయాత్ర సార్థకమైనదనిపించెను. అప్పటికి ఉదయము సేవించిన కాఫీ, ఇడ్లీ, ఉప్మాదులు నిశ్శేషముగా నఱిగి యుండుటచే పఱిగడుపుతో నుంటిమని భావించినచో కార్తిక సోమవారమహాపుణ్యదినంబున మేమచ్చటగావించిన స్నాన, దాన, స్వామిసందర్శనాదులకు లభింపవలసినపుణ్యము పూర్తిగనే లభించెనని చెప్పనగును. కృష్ణలో నీ రేలనో బురదగానుండెను. కాన స్నానముచేయుటకు కొందఱు వెనుదీసిరి. కాని కార్తిక సోమవారపుణ్యదినమున అప్రయత్నముగా లభ్యమైన కృష్ణవేణీ సలిలావగాహనమును వ్యర్థముగా బోగొట్టుకొననేలనని కొంద అముమాత్రము ఒకబ్రాహ్మణుని పిలిచి సంకల్పము చెప్పించు కొని స్నానముచేసివచ్చితిమి. స్నానముచేయకుండినవా రప్పటి కప్పుడే అమరేశ్వరాలయమునకు దారితీసిరి. కొందినిముస ములలో మేమును వారినిగలిసికొంటిమి. అమరేశ్వరాలయ మొకయున్నతప్రదేశమున గట్టబడియున్నది. స్వామిని దర్శింప నెంచువారు బెజవాడస్టేషనువద్దనున్న బ్రిడ్జికున్నట్లు ఇరుప్రక్కల

నున్న మెట్లనెక్కి పోవలయును. దేవాలయమునకు విశాలావరణయు, ఉన్నతప్రాకారమునుగలదు. దేవాలయముగూడ పెద్దదే. కాని సాధారణముగా ప్రాచీనదేవాలయములయం దుండెడి శిల్పనైపుణి దీనియం దంతగా కానరాదు. దేవాలయ నిర్మాణవైఖరియు ప్రత్యేకముగనేయున్నట్టు దోచినది. బహుశా ప్రప్రథమమున నిదియొక బౌద్ధకట్టడముగానుండి వేదమతప్రాబల్యమున శివాలయముగా మార్చబడినదేమో తెలియదు. చారిత్రకపరిశోధకులే యీవిషయమును నిరూపింప వలసినవారు. మనకెందు కీప్రసక్తి.

అమరేశ్వరునిలింగము, దాదాపు ఆఱడుగులపొడవున నున్నది. అర్చకులు క్రిందనిలువబడి స్వామికి అభిషేకాదులు చేయుటకు సాధ్యముకాదు. కావున స్వామికి ప్రక్కగానున్న మెట్లపైనుండి పైకివెళ్ళి అర్చకులు స్వామినర్చింతురు. స్వామి కభిషేకముచేయుటకది సుసమయమే. అయినను అవకాశము లేనందున కొబ్బరికాయ, పండ్లు, తాంబూలములుమాత్రము సమర్పించి కర్పూరహారతి చేయించి రుద్రపాదములు శిరసున నిడికొని స్వామికి భక్తిపురస్సరముగా ప్రణమిల్లి వీడ్కొని దేవాలయబహిరంతరములనెల్ల పరిశీలించిచూచి మెట్లుదిగి క్రిందికివచ్చితిమి. అమరేశ్వరునిప్రాకారమున కీవల చుట్టును చిన్నచిన్నగుళ్ళు చిల్లరదేవుళ్ళు చాలయుండెను. వానినిగూడ చూడవలయునను కుతూహలముతో కొన్నిటితలుపులను తీసి చూడ కిచకిచమని క్రిందినుండి యెలుకలును పైనుండి గబ్బిల ములును నొక్కమాఱుగా నెదుర్కొనెను. ఓహో! ఇచ్చటి

అర్చకులువీరా? మానవపూజాపురస్కారములు మీకునిషే ధమా? దేవతలారా! అని వారికి దూరమునుండియే ఒక్క నమస్కారముచేసి చల్లగా ఈవలకు వచ్చితిమి. ఆచిన్న దేవాలయములకు సమీపమునసే పడవలరేవు, కాన కొన్ని పడవలు తీరమునసిలిచి సరుకులు యెగుమతి దిగుమతులు చేసికొనుచుండెను. వాని నించుక పరిశీలించి ఇది వర్తకస్థానముగాబోలు, పొగబండ్లధికముగానున్న ఇక్కాలమునగూడ ఇచట యింత వర్తకము సాగుచున్న దే, పూర్వకాలమున దీనివైభవమెంతగా నుండెనో అనుకొనుచు మాఅమరావతీయాత్రకు ప్రధానకారణమైన ప్రాచీనబౌద్ధశిల్పముల దర్శించుటకు ఉత్సాహముతో బయలుదేరితిమి. అప్పటికి దాదాపు పదిరెండుగంటలయ్యెను. క్రింద కాళ్లుకాలుచుండెను. అయినను మామనంబుల ప్రగాఢమైయున్న ఆప్రాచీనశిల్పములజూచువేడుక ఆ సహస్రకిరణుడు పెట్టెడిశ్రమను గమనింపనీయకుండెను. ఆబౌద్ధచిహ్నములుగల ప్రదేశము నచ్చటివారు దీపాలదిన్నెయందురు.

ఉత్సాహముతో నురుకులుపెట్టుటేగాని యేమున్నదక్కడ? నిన్నటివా మొన్నటివా? రెండువేలసంవత్సరములకు పూర్వపుకట్టడములవి! వానిలో, వచ్చిన విదేశీయాత్రికులెల్లరు, జ్ఞాపకచిహ్నములుగా తీసికొనిపోయినవి పోగా, ఇంపైనవస్తువులెల్ల ఇంగ్లండుచేర్చుటకు దీక్షపూనిన ఇంగ్లీషువారు, లండను మ్యూజియమునకు చేర్చినవిచేర్చగా, హతశేషము చెన్నపురి వస్తుప్రదర్శనశాల నలంకరింపగా, మనప్రాచీనులశిల్పనైపుణి తలచి చింతించి కన్నుతుడుచుకొనుటకు పడియున్నవి కొన్ని

చెక్కులు, ముక్కలు! అయినను బంగారువన్నె తెలిసికొనుట కొకనలుసంతబంగారమైనను చాలినటులనే ఆకాలపు పనితనము తెలిసికొనుట కే చిన్న శిల్పశకలమైనను చాలునుగదా.

స్థూపముగల ప్రదేశమంతయు వలయాకారమగు అతి విశాలప్రదేశముగనుండి యెన్నివేల జనమైనను కూర్చుండుట కనుకూలముగనున్నది. అతిప్రాచీనకాలముననే భారతీయులు గొప్ప సభారంగముల నిర్మింపగల నైపుణిగలవారని యా ప్రదేశము తిలకించినవారి కెల్లరకు స్ఫురించును. దీపాలదిన్నెలో అడుగుపెట్టగనే మొట్టమొదట నెట్టయెదుట గాన్పించునది ఒక గజముయెత్తును సుమారు మూడుగజముల వెడల్పునుగల యొక గుండ్రనిఅరుగు. అచటి శిల్పనైపుణి నరయుట కా తిన్నెచుట్టును గారతో బిగింపబడియున్న మంచిపనితనముగల పాషాణశకలములే ఆధారము. ఆకాలపు స్త్రీ పురుషాదులయు, ఖగమృగాదులయు, వృక్షలతాదులయు చిత్రములు పెక్కు లా శకలములయందు గాన్పించును. అవియైన నోటుగా పెద్దవిగాలేవు. అతిసున్నితముగా రెండుమూడంగుళముల చతురములలోనే ఆచిత్రము లిమిడియున్నవి. అవి యన్నియు నర్థములేని బొమ్మలుగావు. ప్రతిబొమ్మయు బుద్ధునిచరిత్రమునకు సంబంధించినదే. చారిత్రకపరిశోధకులు వాని కథలు వివరింపగలరు. బౌద్ధులచరిత్రము నెఱుగని నేను వానిని వివరించుట సాహసము. ఒక డొకపెట్టెను తలపై నిడుకొని తెచ్చుచుండుటయు, వాని కిరుప్రక్కల కొందఱు జేరి భక్తితో నాపేటికకు వింజామరలువేయుటయు పెక్కు

-చోట్ల కంటిమి. బుద్ధనిర్వాణానంతరము ఆయన నఖాస్థికేశములను ఆయన శిష్యులు పలుతావులకు గొనివచ్చి వానిపై గొప్ప గొప్ప స్థూపములను నిర్మించినట్లు మన మప్పుడప్పుడు చరిత్రలలో చదువుచున్నాముగదా. బహుశా ఆపేటికయందున్న వట్టి పవిత్రచిహ్నములై యుండునేమో తెలియదు. బుద్ధభగవానుడు, బోధివృక్షము, రాజులు, రాణులు, సింహాసనములు, పరివారజనములు ఇట్టి వెన్నియో కనుపించినవి. కల్పలతా! ఆ శిల్పుల హస్తనైపుణి యెట్టిదో! ఆ కఠిన పాషాణములు యెట్లు వారి సిద్ధహస్తములలో మృదులపదార్థము చందముననై యట్టి సున్నితములగు చిత్రముల నిర్మించుటకు సాధ్యమాయెనో అత్యంతాశ్చర్యకరము. అయ్యారే! వానిని చూచినవా రెవరైన నాగరికత భారతీయులకు పాశ్చాత్యులు పెట్టిన భిక్ష మనజాలుదురా? అచ్చట పూర్వము గొప్పచైత్యములు, స్థూపములు, రాజమందిరములు నుండి యుండవచ్చును. ఇప్పు డక్కడ యొక్క కట్టడమైన లేదు. వర్తులాకారముననున్న ఆ ప్రదేశముచుట్టును ఉన్నతములగు మట్టిదిబ్బలుమాత్రము కనుపించును.

ఆరడుగుల పొడవుగల బౌద్ధసన్యాసుల రాతివిగ్రహములు కొన్ని మొగములు సాఫుగా చెక్కివేయబడియు, కాళ్లు నఱికివేయబడియు అచ్చటచ్చట పడియున్నవి. భూమిలో పాతి నిలువబెట్టబడిన విగ్రహములకుగూడ యీవిధముగనే మొగములు ముక్కులు విఱుగగొట్టబడియున్నవి. ఒకరాతితో మల్చిన స్తంభములను ఆ స్తంభములక్రిందవేసెడి మంచి పనితనము

గల చక్రములవంటి రాతిదిమ్మలను పెక్కులు గాంచితిమి. ఆప్రదేశమునకు మధ్యనున్న చెట్టుక్రిందనిలువబడి ఆ పనితనముగల చక్రములను పలుకలుతీర్చిన స్తంభములను మేము పరికించుచుండగా శ్రీమతి దామెర్ల కమలరత్నమ్మగారు మావెంట వచ్చిన నలుగురైదుగురు పిల్లల నాచెట్టుక్రింద నొకరాతిపై గూర్చుండబెట్టి చేతికెమేరాతో నొకఫోటో తీసికొనిరి. మేమట ఛాయాగ్రహణమును విలోకించుచుండ మాలో కొందఱు చుఱుకైనవారు వడివడిగా నొకదిబ్బ కెగబ్రాకుచుండిరి. ఆదిబ్బమీద గారుపూసిన బద్దలతో నలుచదరపుదొడ్డి యొకటి కనుపించుటచే ఆదొడ్డియందింతకంటె మేలిచెక్కడము లేమిగలవోయని మేమును ఆ మెట్టనెక్కితిమి. ఆ దొడ్డి చుట్టును ప్రదక్షిణించితిమి. కాని కాళ్లుత్రిప్పటమేదప్ప దానిలో మే మిదివఱకు చూచినవానికంటె భిన్నమైనవిలేవు. అక్కడగూడ బౌద్ధపరివ్రాజక విగ్రహములు, స్తంభములు, పట్టెలు మున్నగునవియే కాన్పించెను. అంతటితో మా సందర్శనము ముగిసెను. తిరుగుముఖము పెట్టితిమి. అచ్చట నున్న శిల్పచిహ్నములలోనెల్ల నా తిన్నెయందమర్చినవే చూడదగినవి. ఆ శిల్పములు నిర్మింపబడి యెన్నిశతాబ్దము లాయెనో, ఎన్ని నిర్భరనిదాఘ తీవ్రాతపములు! ఎన్ని ప్రావృట్కాల 'చండదిగ్వేదండతుండనిభాఖండవారిధారలు' ఆ శిల్పముల రాపాడెనో! అయినను నలుపెక్కక, వన్నెచెడక నిన్న మొన్న మలిచినట్లున్న ఆశిల్పముల నైపుణిమాత్రము అక్కజముగొల్పును. కల్పలతా! ఎన్నిమాఱు లమరావతికి

వెళ్ళవలయునని యత్నించినను నెప్పటికప్పుడు యేవియో యసందర్భములవలన ఆటంకము కలుగుచుండెను. కాని నా డట్టి విఘ్నములే కలుగకున్నచో నిప్పు డిట్టి సోదరీమణులతో అమరావతి కేగెడుభాగ్య మెదవకుండెడిదిగదా? కావున ఒక ప్పుడు విఘ్నములుగూడ మనమంచికే యనువాక్యము సత్యమే యనిపించును.

ముఖ్యముగా నీయాత్రను మొట్టమొదట తలపెట్టి సోదరీమణులనెల్లర ప్రోత్సహించి తీసికొనివెళ్ళినవారు శ్రీమతి దామెర్ల కమలరత్నమ్మగారు, భాస్కరమ్మగారు మున్నగు రాజమండ్రి సోదరీమణులు. వారు మాకృతజ్ఞత కెంతయు పాత్రులు.

భావపురి

1-6-32

ఇట్లు,

శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

ఏ దివ్యతరంగిణీసలిలసేచనముచే భూపురంధ్రి సస్య పులకితగాత్రయై రాజిల్లునో, ఏ పావననదీజలావగాహనము సమస్త దురితాపహరమో, ఏ మహనీయసరిత్తటమున వన వాసక్లేశులగు సీతారాములు పర్ణశాలను నిర్మించుకొని వసించిరో, కవులు యేదేవిని వర్ణింతురో, గాయకులు యేదేవిని కీర్తింతురో, చిత్రకారులేదేవిని చిత్రింతురో, కర్షకులేదేవి యాగమనమునకై హర్షసముత్సుకులై యెదురుజూతురో అట్టి ఆంధ్రదేశభాగ్యలక్ష్మి తన నిరంతరజీవనదానముచే నిఖిల ప్రాణిచయమునకు జీవనదానముచేయుచున్న మహానదీమతల్లి శ్రీ గౌతమీదేవి పుష్కరోత్సవమనిన యెవరి హృదయము ఆనందతరంగితముగాదు? ఎవరామహోత్సవమునకేగ వేడుక పడరు? నిత్యోత్సవముచేయదగిన యీ మహావాహినికి పది రెండేండ్లకొకమాఱు పుష్కరోత్సవము జరుపుటొక గొప్పయా? మేలు, మేలు. ఆదివ్యోత్సవమునకు వెళ్లవలసినదే. ఆ దక్షిణగంగకు నమస్కరిడవలసినదే. అదివ్యాపగలో క్రుంకవలసినదే. ఆమహానది తీరమున దేవపితృపూజలు జరుపవలసినదే. లేకున్న భారతీయులు కృతఘ్నులనిపించుకొనరా!

కల్పలతా! జ్ఞాపకమున్నదా కడచిన పుష్కరముల వృత్తాంతము? మనమప్పుడు రాజమహేంద్రవరములో మన

బంధుగృహమున విడిసితిమి. గోదావరిలో స్నానములుచేయు చుంటిమి. ఊరిలో విశేషముల నరయుచుంటిమి. క్రొత్తవారి నెందఱనో కలసికొని పరిచయము గల్గించుకొంటిమి. ప్రాత వారినెందరనో చూచి భాషించితిమి. అంతయు ఆనందమయముగ నుండెను. అవేదినములలో నొకనాడు మఱచితివో ఏమో కాని లోకమాన్య బాలగంగాధరతిలక్ మహాశయుడు 'యదా యదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్. కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన' అను గీతామంత్రము జపించుచు దివంగతుడైనట్లును, ఆ మహామహుని చందనకాష్ఠములతో దహించినట్లును ఆర్ద్ర హృదయములతో అశ్రుపూర్ణలోచనములతో గద్గదికకంఠ ములతో ఆంధ్రపత్రికలో చదువుకొంటిమి. నేను చదువలేక సంకటపడితిని, నీవు వినలేక విలపించితివి. ఆ ప్రచండమార్తాం డుని అస్తమయానంతరము భారతీయహృదయాకాశమున సాంద్రమై వ్యాపించిన కటికిచీకటుల వెల్లార్చుచు శాంతిసుధా కరు డుదయించి తన శీతలవాక్యచంద్రికలచే భారతీయదుఃఖ తమంబెడిపినదియు నప్పుడే కంటిమి. నాటికి నేను పదిరెండేండ్లు. చూడు మిప్పుడు భారతజగత్తు!

దైవజ్ఞు లప్పుడుగూడ నిప్పటివలెనే భిన్నాభిప్రాయులై ద్వాదశదినముల పుష్కరములను అష్టాదశదినముల కీడ్చిరి. ఇందువలన కశ్మలమధికమై వసతులు తక్కువై చాలమందిని ఆసుపత్రుల కీడ్వవలసివచ్చుటేగాక కొంతమందిని కాటికిగూడ

యీడ్వవలసివచ్చెను. ఎప్పుడైనను అధికజనసమూహముతో గూడిన యిట్టిఉత్సవము లెంత ముక్తసరుగా జరిగిన నంతహాయి. కాని మన సిద్ధాంతుల బహువిధసిద్ధాంతముల జూచినచో వారి నందఱను సమాధానపెట్టవలయునన్నచో ఈ పుష్కరములను దాదాపు రెండుమాసములు జరిపినను చాలవేమో అనిపించుచున్నది. ఈ మహాదైవజ్ఞశిఖామణులకు, జ్యోతిశ్శాస్త్రపారంగతులకు మనము విన్నపముసేయజాలిన సమర్థులముకాముగాని, గత పుష్కరములో జనులకు గల్గిన మహాకష్టములను గుర్తించియైన వీరు ఆంగీరసనామసంవత్సర పంచాంగము ప్రకటితముకాకముందు ఇప్పు డూరూరజరుపుచున్న యీ శాస్త్రసభలను అప్పుడే జరిపి ఒక నిర్ణయము నకువచ్చి ప్రకటించిన నెంతయు సమంజసముగా నుండెడిది గదా! చేయికాలినవెనుక ఆకులకు వెదకినట్లు రేపో మాపో మొలుదపెట్టబోవుచున్న గోదావరి పుష్కరమునుగూర్చి చర్చలుసేయుటకంటె రాగల కృష్ణాపుష్కరములనుగూర్చి విచారించుట మంచిది. భారతభూమి కర్మభూమి. భారతీయులు కర్మిష్ఠులు. తాము చేసెడి స్నాన దాన దేవపూజ పితృతర్పణాదులు సరియగు పర్వసమయములో చేసినగాని వారికి తృప్తిలేదు. అట్టిచో ఈ శాస్త్రవేత్తలు తల యొక దినము పుష్కరారంభదినముగా నిర్ణయించినచో వారి ననుసరించు యీప్రజలగతియేమి? సరే, ఎవరెన్ని తిథులు నిర్ణయించినను ఏ సిద్ధాంతుల రాద్ధాంతము లెట్లున్నను కేమ్మనక

పుష్కరములను ప్రారంభింపనున్నది యింగ్లీషునెల జూలై యొకటి.

భిన్నాభిప్రాయములచేత పుష్కరము లెన్నిదినములు సాగినను యాత్రికులైన యించుక మెలకువతో నడుచుకొనిన చో నెట్టికష్టములులేక సుఖముగా గృహోన్ముఖులు కాగలరు. యాత్రాస్థలములలో ముఖ్యముగా పాటింపదగిన నియమములు మూడు. మూడుదినములకంటె నధికముగా నుండకుండు టొకటి, పచ్చిపండ్లు నిలువపండ్లు తినకుండు టొకటి, పుణ్యమను భ్రాంతితో గోదావరిలోని పచ్చినీరు త్రాగకుండు టొకటి. ఈ మూడునియమములను నియతితో పాలించినచో పుష్కరము లెన్నిదినములు జరిగినను భయము లేదు. కాని యాత్రకు బయలుదేరినచో మనవారు ఉల్లంఘించినవే ఇవి. నైష్ఠికులైనవారు యాత్రాస్థలములో రాత్రులు భుజింపరాదను నియమమొకటి, ఏదియో తిరిగితిరిగి వచ్చిన పిదప చేసికొనజాలని విసుగొకటి, గౌతమీతీరము మహాపుణ్యమను భ్రాంతియొకటి. ఈ మూడుపిచ్చలలోబడి మనవారిచ్చవచ్చినట్లు వర్తించి కుత్తుకమీదికి తెచ్చుకొందురు.

ఈ పుష్కరములతోబాటు రాజమహేంద్రవరమున ప్రారంభమగుచున్న దొక దివ్యోత్సవము. అదియే స్వదేశీ ప్రదర్శనము: భారతీయులకు గౌతమీమహానదీస్నానము మోక్షప్రదమగుచో అనంతసౌఖ్యప్రద మీ స్వదేశీదీక్ష. ఆర్థిక విపత్తిచే గొట్టుకాడుచున్న తమ దేశము సౌభాగ్యవంతము

కావలయునని వాంఛించువారికి స్వదేశీదీక్షబూనుట కింతకంటె పర్వడిసమయము వేరొండులేదు. గౌతమీగంగలో స్నానమాడి పవిత్రులై స్వదేశీప్రదర్శనము తిలకించి పునీతులై స్వదేశీదీక్షబూని ధన్యులగుటయే కర్తవ్యము. ప్రపంచములో యెచ్చటచూచినను యేదేశమువా రాదేశపువస్తువులనే కొనవలయునని అఖండప్రబోధముసేయుచున్న దినము లివి. స్వతంత్రములును, మహాభాగ్యవంతములును, వివిధపరిశ్రమాకుశలములునగు దేశనులే స్వదేశీదీక్ష నింతగాబూనుచుండ పరాధీనతచే క్రుంగుచు, రాజకీయకల్లోలముచే స్రుక్కుచు, ఆర్థికవిపత్తిచే అల్లడ తల్లడ బడుచున్న మన భారతదేశీయుల కీ స్వదేశీదీక్ష యెంతఅవసరమో వేరుగ చెప్పవలయునా? నాణెము తగ్గుగాక, వెల హెచ్చుగాక, లేమియే వచ్చుగాక, ఈసమయములో భారతీయులెల్లరు స్వదేశీవ్రతము నవలంబింపరేని 'కలుగనేటికితల్లుల కడుపుచేటు?'.

యాత్రకేగినవారెల్ల, వస్తువో, వస్త్రమో, బొమ్మయో, ఏదియోయొకటి తెచ్చుట మనవారి కలవాటు. ఆ అభ్యాసము ఉత్కృష్టమైనదనుటకు సందియములేదు. అయితే యీమాఱు గౌతమీపుష్కరయాత్రకేగిన మహాజనులెల్లరు తాము యిండ్లకు కొనితెచ్చుకొనినవెల్ల స్వదేశమునందు తయారుచేయబడినవిగనే యుండునట్లు జాగ్రత్త వహింపవలయును. ఏలనందువా? గోదావరీపుష్కరములవలెనే తత్సందర్భమున జరిపెడి స్వదేశీప్రదర్శనోత్సవముగూడ సర్వకాలము జ్ఞాపకమున

నుంచుకొనదగినది సుమా! కల్పలతా! సెలవు. గౌతమీ పుష్కరములకేగు భాగ్య మొదవెనేని యచ్చట నేచూచిన విశేషములెల్ల సవిస్తరముగా నీకు జాబు వ్రాయుదును. లేదా లేదు.

భావపురి,
1-7-32.

ఇట్లు
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

నీ విద్యనుచూచియు, నీవివేకమునుచూచియు, నీదేశ భక్తినిచూచియు నీహృదయ మత్యంతవిశాలమైనదనియు, నీ భావము లత్యంతోదారములనియు, నీమనంబత్యంతకోమల మనియు భావించుచుంటిని గాని నీ హృదయ మింతసంకుచిత మనియు, నీభావము లింతయల్పములనియు, నీమానసంబింత కర్కశమనియు, పాఠశాలలో చదువుకొను నాటినుండియు నెయ్యురాలనుగానున్న నేనైన తెలిసికొనకపోతినిగదా! మానవ హృదయమెంత అగాధము!

ఆశ్చర్యము! ఆశ్చర్యము! అంటరానితనముండరాదని నందులకు మహాత్ముని నెంత నిందించితివి? ఏమి హిందూమత విధ్వంసియా! వర్ణాశ్రమాచారవినాశకుడా! శాస్త్రద్రోహియా! ధర్మహీనుడా! శ్రౌతస్మార్తకర్మానుష్ఠానపరులును, యజ్ఞ యాజనాదిషట్కర్మనిరతులునునైన సనాతనధర్మపరులను హిం సించుచున్న కసాయివాడా! అబ్బా ఆయెటువాడా యోగిని యెన్నికటుకులాడితివి? అస్పృశ్యతాసమస్య ఆసేతుశీతనగ పర్యంతము పరివ్యాప్తమై అగ్రజాతులలో మహాసంచలనము గలిగించువఱకు నీలో నింత జాత్యహంకారము ఘనీభవించి యున్నదని తెలిసికొనకపోతినే! ఇంతకును మహాత్ముడుచేసిన దోషమేమి? అంత్యజులను దేవాలయములోనికి రానీయుడనెను.

దానికా, నీవింతగా ఆయనను దూషించుట? మనదేవాలయములకేమిపేరున్నదో తెలియునా? హిందూదేవాలయములని పేరు. హిందూ దేవాలయములని వానికెప్పుడు పేరువచ్చెనో అవి హిందువు లందఱిసొత్తైయుండుట సామాన్య ధర్మమేగదా?

అగ్రజాతులు అంత్యజాతులు అనెడి భేదములేక హిందువులనబడువారందఱు, దేవాలయమున కేగినప్పుడేగదా అది హిందూ దేవాలయమనుట సార్థమగును? కొందఱు రావచ్చును. కొందఱు రాగూడదు అను యీవికృతపు విపరీతపు సిద్ధాంతము మన హిందూదేవాలయములకే కలదుగాని మఱి యేమతస్థులకైన కలదేమొ చూడుము. మహమ్మదీయులెల్లరు ప్రవేశింపరాని మసీదుగాని, క్రైస్తవులెల్లరు ప్రవేశింపరాని చర్చిగాని యెచ్చటనైననున్నవా? ఏమతస్థులదని యా యాలయము చెప్పబడునో ఆ మతస్థులెల్లరా దేవాలయములోనికేగి స్వామిని సేవించుటకు హక్కుగలిగియుండుట న్యాయమైన హక్కుగదా? జాత్యహంకారముచే వారిలో కొందఱిని నిరసించుట అక్రమనిరోధముగాదా? ఇంతియేగాక అస్పృశ్యులు దేవాలయప్రవేశముచేసినచో దేవునకు పాపము చుట్టుకొనుననియు, ఆయన మైలపడిపోవుననియు, ఆయనలోని కళ తగ్గిపోవుననియు, మఱికొన్ని విపరీతపుప్రశ్నలుకూడ వేసితివి. నీప్రశ్నలు తలచుకొనినంతనే నాకు పొట్ట చెక్కలగునట్లు నవ్వు వచ్చుచున్నది. దేవునకే పాపముచుట్టుకొనిన, మన పాపములను తొలగించువాడెవడు? దేవుడే మయిలపడిన

మన మైలల బాపువాడెవడు? దేవునియందే కళ తొలగిన, మన యందు కళ నిలుపువాడెవడు? దేవుడు దేవాలయములలో రాతిరూపముననుండుటచే ఆయనహృదయముగూడ రాయి యనుకొనుచుంటివా? కాదు కాదు !!

తలితండ్రుల కెప్పుడును దుర్బలసంతానముపై వాత్సల్య మధికముగానుండునటులనే యీ విశాలవిశ్వమునకంతయు తల్లియు, దండ్రియునైన భగవానుడుగూడ దీనులు దరిద్రులు నైన వారిపక్షముననే వాత్సల్యము జూపుచుండును. ప్రాచీన పురాణముల శోధించుము. మహాభక్తులగాథల పఠించుము. జాతిమతవివక్షతలేక భగవానుడెంతమంది దీనులను, దరిద్రులను, అవర్ణులను రక్షించిన గాథలు కానవచ్చునో!! కబీరుదాసును దేవాలయములోనికి రాకుండ నిరోధించినందుకు భద్రాచల దేవాలయములోని సీతారామలక్ష్మణవిగ్రహములు అదృశ్యమైనట్లును, మాలయోబని నిరోధించినందుకు ఒంటిమిట్ట దేవాలయములోనిస్వామి, వానివైపునకే యభిముఖమైనట్లును, ఇట్టి వెన్నియో దృష్టాంతగాథల చదువుచున్నాము గదా! వీనినిబట్టి యేమితేలుచున్నది? భగవంతుడు గుణశీలములనుబట్టియేగాని జాతిమతవివక్షతనుబట్టి నిగ్రహానుగ్రహములు చూపబోడనియేగదా! కావుననే శ్రీ మహాభాగవతములో 'జాతిమాత్రంబునఁ బురుషునికి వర్ణంబు నిర్దేశింప బనిలేదు. శమదమాది వర్ణ్యలక్షణవ్యవహారంబుల గనవలయు'నని చెప్పబడియున్నది. ఇంతకును దేవుడు ఎవరిపక్షమున నున్నాడని

యెక్కడెక్కడి యుదాహరణములనో వెదకనేల? నేడు భగవానుడు కడజాతివారి పక్షమున నుండుటబట్టియేగదా వారి నుద్ధరించుటకై యింత మహోద్యమము భారతదేశమున బయలువెడలుటయు, జగత్పూజ్యుడగు నొక మహావ్యక్తి వారికై యాత్మార్పణము సేయనుండుటయు కనుచున్నారము. ముంజేతికంకణమున కద్దమేల? శ్రోత్రియుల ఆందోళనముగాంచి నీవేల కలవరము జెందెదవు? మన సనాతనధర్మపరు లేసంస్కరణమును విశాలబుద్ధితో యోచించి స్వాగతమిచ్చిరి? సహగమన దురాచారము కేవలము నిష్కరుణమైనదిగదా? దానిని మాన్ప యత్నించిన మహనీయుని వీ రెంత దూషించిరి? ఎంత వ్యతిరేకాందోళనము చేసిరి? అనదలగు బాలవితంతువులు దయనీయలుగదా? వారిని గాపాడ కంకణము గట్టుకొనిన కారుణ్యమూర్తిని వీరెంత బాధించిరి? ఎంత ప్రతికూలయత్నము చేసిరి? సముద్రయానమనిన సామాన్య విషయమేగదా! దాని కెంత గడబిడచేసిరి! మొన్న మొన్నటి శారదాశాసన సందర్భమున వీరెంత తీవ్రాందోళనచేసి దేశీయుల భయపెట్టి పసిపిల్లల గొంతులుకోసినది మనము కన్నులార చూచినదేగదా. ఇంతకును యీ శ్రోత్రియంమన్యులు ప్రతిసంస్కారమునకు యెదురొడ్డి పోరాడి అలసి డస్సి విరమించుటయేగాని వీరి తిరుగుబాటునకు వెఱచి, వచ్చిన ఒక్క సంస్కరణమైన, తిరుగుమొగము పెట్టినట్టు కంటిమా? నేటి యస్పృశ్యతా ఆందోళనయు నట్టిదే.

ఒకానొకశాస్త్రిగారు చెప్పినట్లుగా శిశిరఋతువులో రాలుఆకులను రాలకుండను, వసంతఋతువులో చిగిర్చుపల్లవములు చిగిర్పకుండను యెట్లు నిరోధింపజాలమో అటులనే కాలప్రభావముచే సంఘములో జరుగు మార్పులును అవిలంఘనీయములు. సనాతనధర్మపరులు యెంతపండితులైనను వారియం దొకలోపముగలదు. ఎంతకాలమునకు ప్రాతవానిపట్టుకొని ప్రాకులాడుటయేగాని యొక్క క్రొత్తదానిని సమర్థింపలేరు. మన ప్రాచీనమహర్షులను స్మరింపుము. ఆహా! ఏమి వారిమేథ! తమపేర ఒక్కొక్క రొక్కొక్క స్మృతినో, సూత్రమునో రచియించి వేలసంవత్సరములు గడచినను మనపై నెట్లు రాజ్యముచేయుచున్నారో! దేశ కాల పాత్ర భేదములాకాలమునగూడ గలవనియు, భిన్నాభిప్రాయములు వారికిగూడ నున్నవనియు, వివిధరీతులుగా వారు వ్రాసిన స్మృతులే వివరించుచున్నవిగదా! అట్టిచో మన పండితులుగూడ ప్రస్తుత పరిస్థితుల కనుకూలముగ స్మృతులు రచియించి స్థిరకీర్తులుగాక 'పూర్వమేమున్నవో ఉన్నవి. వానిని మార్చుటకు వలనుగా'దని పట్టుబట్టి కూర్చుండుటవలన ప్రయోజనమేమి? ఒక మహాసంస్కరణము తలపైకి వచ్చినప్పుడు పండితులు చేయవలసిన పనియేమి? దేశస్థితియు, కాలముతీరును, ప్రజాభిప్రాయముసు గమనించవలయును. ప్రాచీనధర్మశాస్త్రములను పరిశోధింపవలయును. ప్రస్తుతపరిస్థితులకు ప్రాచీసధర్మశాస్త్రములు తోడ్పడువిధ మాలోచింపవలయును. అప్పుడు 'నాయనలారా! మీరీవిధముగా నడుచుకొనుడు. ఈవిధముగా

నడచిన మీఁదు శాస్త్రనిషేధముండదు' అని చెప్పవలయును గాని ప్రాచీనులపొగడి, నవీనుల తెగడి జాత్యహంకారము తోను, అసహనముతోను వర్తించిన 'పండితాస్సమదర్శినః' యను సూక్తికి దూరులగుదురు. పండితుల ధిక్కరించి ధర్మశాస్త్ర ముల నుల్లంఘించి ప్రజలు ముందుకు నడతురు. అప్పుడు స్వగౌరవమును శాస్త్రగౌరవమును నిలబెట్టజాలని యాప ఖ్యాతి, పండితులకు దక్కను.

కల్పలతా! నే నీమధ్య నొకశాస్త్రిలవారి యుపన్యాస మును వింటిని. ఆయన యుపన్యాససందర్భమున మొట్ట మొదట 'చండాలస్పర్శ గలిగిన గృహము నిప్పుపెట్టుమని శాస్త్రములలో వ్రాయబడియున్న'దనియు, 'తరువాతి వారు దానిని గృహశుద్ధి, దేహశుద్ధి, వస్త్రశుద్ధి చేసికొనిన చాలు నన్నట్లుగా సంకుచితమొనర్చి'రనియు చెప్పిరి. నిజముగా ఆ తొల్లిటిధర్మమే యిప్పటికిని ఉన్నచో ఆ పండితులగృహము లేమికావలయును? మఱుగుదొడ్లమూలమున నిప్పుడు నిత్యము చండాలస్పర్శలేని గృహము లేదుగదా. ఎంత శాస్త్రాభి మానముగల పరమశ్రోత్రియశిఖామణియైనను నిత్యము కొంప ను అగ్నిదాహముగావించుటకు సమ్మతించునా? అదిగాదు. ఆ పాకీపెరడునుమాత్రము శుద్ధిచేయుట కేమాత్రము ప్రయ త్నించుచున్నారు? 'ఏమిచేస్తాము, తప్పని సరి'యని సరిపుచ్చు కొనుటలేదా? ఆవిధముగనే నేడు దేశోపద్రవము వచ్చినప్పుడు ఆ ప్రాచీనాచారములు మఱికొంత సడలించుకొనిన ఎంత బాగుగానుండును? ఇంతకును మనలోగల గొప్పలోప మేమనగా

ఒక్కవిషయమందైన బుద్ధిపూర్వకముగా ఔదార్యము చూపజాలము. అదియే బలవంతముగావచ్చి తలపైబడిన చచ్చినట్టు లూరుకొందుము. పంచముల పిల్లలతోబాటు మన బాలబాలికలు పాఠశాలలలో చదువుకొనుటకు సమ్మతించు చున్నాము. మన మగవారు, కచ్చేరీలలో వారితో కలిసి మెలిసి వ్యవహారములు నడుపుచుండిన హర్షించుచున్నాము. రైళ్ళలో, పడవలలో, బస్సులలో వారితోబాటు ప్రయాణము చేయుచున్నాము. ఆసుపత్రులలో వారితోబాటు మందు తెచ్చుకొనుచున్నాము. ఒకానొకప్పుడు మందు యిచ్చు వారుగూడ వారేఅయినను మాట్లాడకుండ తెచ్చుకొను చున్నాము. నాటకములలో, సినీమాలలో వారితోబాటు గూర్చుండి ప్రదర్శనములు గాంచివచ్చుచున్నాము. కాని యివన్నియు తప్పనిసరి. వీనిలో వేనికైన వర్ణములబట్టి ప్రత్యేకవసతియున్నగాని లేక మనలను సలహాఅడిగిగాని యున్నచో మనము చండాలురవిషయమై ఔదార్యము చూపి యుందుమా? సాగితే నాయడు, సాగకపోతే బోయడు. !!

కల్పలతా! అస్పృశ్యతాసమస్య అత్యంతవిశాలహృదయముతో విచారింపదగినది. ఏమాత్రము సంకుచితత్వము మనయందున్నను మనమీవిషయమై ఔదార్యముతో వర్తింప జాలము. ఔదార్యమును శ్రోత్రియులు చూపజాలరు; పండితులు చూపజాలరు; జాత్యహంకారులు చూపజాలరు; ఆచార పరులు చూపజాలరు; శుష్కవేదాంతులు చూపజాలరు; భజన పరులు చూపజాలరు; భక్తవేషులు చూపజాలరు; నియమమాన

జ్ఞానప్రభావముచే ప్రత్యణువునందును పరమాత్మను దర్శింపగల బ్రహ్మవేత్తలుమాత్రమే యీ విషయమున నౌదార్యము చూపగలరు.

నాల్గుజాతులవారితో దేవాలయమున కేగుచునే యున్నాముగదా. ఇక అయిదవజాతివారితోగూడ నేగినచో నా ప్రమాదము? ఇది యేమంత గొప్పవిషయము. ఇంతకును దేవాలయములోని దేవుని పంచములు చూడకుండనున్నారా యనిన నదియులేదు. ఉత్సవాదులలో స్వామి పురవీధులలో నూరేగుటయు నప్పుడు చాతుర్వర్ణ్యులతోబాటు పంచములు గూడ చూచుటయు సంభవించుచునేయున్నది. ఇక నిషేధ మెవరికి? రాయిసున్నములతో గట్టిన ఆలయమునకా? డబ్బుతీసి కొని అర్చనాదులు చేయుచున్న పూజారికా? దేవస్థానము పెత్త నము నవహించియున్న ధర్మకర్తకా? చిరకాలమునుండి యనుభ వించుచున్న యధికారమును చేతులారవిడువలేక పొందుచున్న ఆరాటమేగాని నిజముగా ఇందు ప్రమాదమేలేదు.

ఇంతకును సంకుచితహృదయులగు మానవులు నిర్మించి నవగుట వీనికింత విధినిషేధములుగాని భగవన్నిర్మితములై నచో వీనికిట్టినిషేధమేయుండదు. భగవన్నిర్మితమైన ప్రకృతి నుపలక్షింపుము. ఏమైన జాతివిభేదముగాన్పించునేమో! సర్వ తాపోపశమనమగు చల్లని మలయమారుతమును వీక్షింపుము. చాతుర్వర్ణ్యులగృహములపై వీచి పురబాహ్యమునగల ఆచెప్ప రానివారి పర్ణకుటీరములపై వీచుట మానునేమో! ఆ సహస్ర

కిరణుని యెండవెలుగుచూతుము. అగ్రజాతులపై మాత్రమే ప్రసరించి అంత్యజుల బహిష్కరించునేమో! అమృతకిరణుని సాంద్రశీతలచంద్రికల కనుము. చండాలవాటికలపై ప్రసరించుట మానునేమో! భగవంతుని దయారసమా ఈ రూపమున వెలువడుచున్నది యనునట్లుండువర్షధారలగనుము. అస్పృశ్యులసస్యముల వెలిబెట్టునేమో! అవి యివి యననేల? దైవదత్తములగు కలిమిలేములేమి, కష్టసుఖములేమి, రోగనిరోగములేమి, చావుపుట్టువులేమి అన్నిట మనకును, వారికిని భేదమున్నదేమో కనుము. దైవము తరువాత దైవమంత వారు గనుకనే మహాత్ములైనవారికిగూడ నిట్టిభేదభావ ముండదు.

అసౌనిజః పరోవేతిగణనా లఘుచేతసామ్
ఉదారచరితానాంతు వసుధైవకుటుంబకమ్.

మహనీయులైనవారికి జగత్తే కుటుంబము. కావున వారు మానవులలో కొందరిని హీనులుగా భావింపజాలరు. భావించినవారు మహాత్ములేకారు. నేడు మహాత్ముడు అస్పృశ్యులవిషయమై దాక్షిణ్యము వహించుచున్నాడని యనుచున్నావుగదా! రాము డేమిచేసెను? శబరి యుచ్ఛిష్ట మారగించెను. కృష్ణు డేమిచేసెను? అమాయకులగు వెఱ్ఱిగొల్లలలో నొకడై తిరిగెను. దాసీపుత్రుని యింట ఆతిథ్యముగొనెను. అధికులవిడనాడి అనదలచేపట్టుట, బలవంతులవీడి బడుగుల రక్షించుట, ధనికుల ధిక్కరించి దరిద్రుల బ్రోచుట మహాత్ముల లక్షణము. కావుననే మహాత్ముడు నేడు అగ్రజాతుల వీడి అంత్యజులకు బాసటైనాడు. హిందూమతమును విధ్వంస

మొనర్చుటకుగాని, హిందూదేవాలయముల భ్రష్టమొనర్చు టకుగాని, హిందూశాస్త్రముల పాడొనర్చుటకుగాని హిందూ పండితుల నేడ్పించుటకుగాని కాదు. ఎక్కడున్నను, ఏమి చేయుచున్నను, ఎందు వర్తించుచున్నను తల్లియొక్క చిత్తము బిడ్డపై లగ్నమై యున్నట్లుగా, ఎందుకన్నను మహాత్ములహృద యము దీనులపై లగ్నమైయుండును. ఇందు కేశాస్త్రప్రమాణము లక్కరలేదు. విశాలమై, అనంతమై, దైవస్వరూపమై వెలయు కారుణ్యమే ఉత్కృష్ట ధర్మశాస్త్రము. గజేంద్రుడు పాహి, పాహి అని పలవించినప్పుడు, ద్రౌపది హే ద్వారకావాసా! కావుము కావుమన్నప్పుడు, పదునాఱువేల రాచకన్నెలు శ్రీహరీ! ఈ చెఱసాలబాధలు భరింపలేమన్నప్పుడు, శ్రీ మహావిష్ణువు ఉరుకులు వెట్టుకొనుచు పరువెత్తుటేగాని యే శ్రుతిస్మృతులు శోధించెను? ఏధర్మశాస్త్రములు తిరుగ వైచెను? ఏపండితులతో సంప్రదించెను?

కల్పలతా! నీచేగాదు! ఈ అస్పృశ్యతాసమస్య ఆరంభ మైనది మొదలు మొందఱో స్త్రీలు యెన్నియోవిధముల మహాత్ముని దూషించుట చెవులారవినుచున్నాను. హిందూ సంఘములో స్త్రీలకీయబడిన స్థానమును చూచినచో ఆ పంచ ములకంటె మన మెక్కువగా చూడబడలేదు. స్త్రీలు శ్రుతులు వినరాదు; స్మృతులు పఠింపరాదు; మంత్రములు నేర్చుకొన రాదు; ఒకరికి ఉపదేశముచేయరాదు; భగవద్గీత చదువ రాదు; భాష్యములు పఠింపరాదు. మొన్న నీమధ్య నొక బాలికకు వ్యాకరణము చెప్పమనగా 'ఆఁ. ఆడవాళ్ళకు

వ్యాకరణముచెప్పుదునా!' అని ఒక శాస్త్రిలుగారు నిరాకరించెను. దేవాలయములలో పూజాదికములొనర్చు సమయములో స్త్రీలు అస్పృశ్యులే. ఇదిగాక పెక్కుసందర్భములలో స్త్రీలకు అస్పృశ్యతవిధిగా నేర్పడియున్నది. పాకీపని తమకెంత పరిచయమైన పనియో బిడ్డలుగల తల్లులకెల్లరకు తెలిసియేయున్నది. స్త్రీలన్నకారణమున యెన్ని మతవిధులలో బహిష్కరింపబడియున్నారో మన స్త్రీలకు తెలియని విషయముగాదు. ఇన్నివిధముల మనము పంచములకు సన్నిహితులమైయుండ మనలో నేమియో ఆధిక్యతయున్నదని గర్వించుట వెఱ్ఱితనము.

భగవంతు డొకప్పుడు మానవుల దయాధర్మముల పరీక్షించుటకు కుంటివానివలెను, గ్రుడ్డివానివలెను, కుష్ఠరోగివలెను, ముసలివానివలెను, పేదవానివలెను వచ్చుననియు అట్టివాడని అసహ్యపడక యెవరు సమాదరింతురో వారిని అనుగ్రహించుననియు మనము అష్టాదశపురాణములవల్లను, అసంఖ్యాకశాస్త్రములవల్లను, వ్రతకథలవల్లను, మఱిపెక్కువిధములను వినియున్నాము. అటులనే నేడు భగవానుడు అస్పృశ్యతారూపమున మానవుల దయారసమును వీక్షించుటకు వచ్చియున్నాడు. పురుషులమాటమనకేల? కారుణ్యభావమునకు పేరొందిన మనస్త్రీలైనను ఇందలి సారస్యమును గ్రహించి పంచములకు ప్రేమభిక్షపెట్టిరేని భగవంతు డనుగ్రహించును. మహాత్ముడు సంతృప్తిజెందును. దీనులు సంతసింతురు. లోకము జయపెట్టును. కావుననే కడచిననెలలో రాజమహేంద్రపరములో

జరిగిన రాష్ట్రీయమహిళాసభ, స్త్రీలెల్ల రీయుద్యమమునకు సుముఖులుగానుండవలయునని హెచ్చరించినది.

కల్పలతా! నాజబాబు పూర్తియైనది. నీప్రశ్నలకు ప్రతిజబాబు లొసగిన నాపై యనుగ్రహించి కుసుమాక్షతలు జల్లుదువో, ఆగ్రహించి నిందాశిలల రువ్వుదువో రెండిటికిని నాపై టచెఱగునుపట్టియే యుంచితిని. నీచిత్తము.

భావపురి
1-1-33

ఇట్లు,
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ,

అవును. ఏప్రియలు నెల గృహలక్ష్మియందలి పుష్పచయమునందుగల 'స్త్రీల ప్రజ్ఞావిశేషములు' అను వ్యాసమును చదువునప్పటికి నీకువలెనే నాకును మనస్సు చివుక్కుమన్నది. మన యిరువుర కేగాదు; ఆ వ్యాసభాగమును తిలకించిన ప్రతియువిదకును, స్త్రీలయందు మాతృభావముగల ప్రతిపురుషునకును యిటులనే మనస్సు నొచ్చియుండుట వాస్తవము. ప్రకృతిని పరిశీలించిచూడ పురుషులకంటె స్త్రీలకు కొన్ని ప్రజ్ఞావిశేషములుగలవని యీ వ్యాసకర్త వ్రాసెను. కాని తరువాత వాక్యములను జూచినవారి కీయన పరిశీలించి వ్రాసిన వ్రాతగాదని స్పష్టమగుచున్నది. నిజము చెప్పవలయునన్నచో ఈ వ్యాసకర్తకు ఆర్ద్రమును, కోమలమునునగు స్త్రీల స్వభావమే తెలియలేదని చెప్పవలయును. ఆ 23 పంక్తుల చిన్న వ్యాసఖండము (బహుశః అది పూర్తివ్యాసముగాదని నా యూహ)లో యెందు చూచినను వ్యాసకర్తకు స్త్రీలయెడగల దురభిప్రాయము, అగౌరవము, అనాదరము, అసూయ, అసహనము, ద్వేతకము లగుచున్నవి. స్త్రీల ప్రజ్ఞావిశేషములను విశదీకరింపదలచి యీ వ్యాసకర్త స్త్రీలయందు లేని అవజ్ఞల నధికముగ నారోపించి విడిచెను. తన సోదరీసంఘముయెడ నీ సోదరున కింత క్రోధమేలనో? స్త్రీలు ధైర్యసాహసములుగలవారట. అందులకు

తార్కాణము యింటియందలి జగడమునకు స్త్రీలు నూతి యందో చెఱువునందో పడి చచ్చుటట. ప్రపంచములోని సమస్త ప్రాణిచయమునకును ప్రాణముపై గల తీపి యత్యధిక మనుట సుప్రసిద్ధము. ప్రాణభయములేని ప్రాణిని ఈ విశ్వ మునం దెచ్చటను గానము. కావుననే దేనినైనను ఎవరైన నధిక ముగా ప్రేమించుచున్నచో ప్రాణపదముగా ప్రేమించుచుండె నని చెప్పుదుము. అనగా ప్రాణముకంటె నధికముగ రక్షించు కొనదగిన వస్తువు ప్రేమింప దగినవస్తువు జీవికి వేరొండు లేదన్న మాట. అట్టి ప్రియతమమైన ప్రాణమును స్త్రీ, బలవంతముగా విడుచుచున్నదనినచో అది మెచ్చుకోదగిన ధైర్యసాహస మన వలయునా? సహింపగాని కష్టమనవలయునా? ఎంత భరింప రాని కష్టముగల్గిన, స్త్రీ, తనకుదానై యమూల్యప్రాణమును పరిత్యజించును ? ఆసమయములో మగవాడైన లేచిపోయి మఱొకవిధముగా జీవించునట. అవును నిజమే. లేచిపోయి మఱొకవిధముగా జీవించు సామర్థ్యము, స్వతంత్రము, పురు షునకుగలదు. కాన నత డట్లు చేయును. స్త్రీకట్టి యవకాశము గలదా? ఎక్కడికోగాదు. తన పుట్టినింటికైన వెళ్లుటకు స్త్రీ సమర్థురాలేనా? ఇంట భరింపరాని క్లేశములు, బయటికి పోరాని నిబంధనలు. ఈ పరిస్థితులలో ప్రాణత్యాగముచేసికొని కష్టభూ యిష్టమగు నీ ప్రపంచమును బాసిపోవుటకంటె స్త్రీకి తరణో పాయ మేమున్నది? ఎంతయో దుర్భర దుస్సహాపరిస్థితు లేర్పడినతప్ప యే స్త్రీయైనను ధైర్యసాహసములు ప్రకటించు

కొనుటకు నిండు ప్రాణము నే జలాగ్ని విషములకో నర్పింప దలంచునా ?

'స్త్రీలు కాఠిన్యమునకు పెంకెదనమునకు పెట్టినది పేరట. సాధారణముగా గుణవిశేషములన్నియు మానవజాతి కంతకు చెందినవిగాని ఏదియో యొకజాతికి ప్రత్యేకింపబడినవి కావు. ఎంత కాఠిన్యత తనయందు లేకున్న నీ సోదరుడు స్త్రీల యెడ యింత కఠినముగా వ్రాయగలిగియుండును? ఇట్టిచో స్త్రీలే కాఠిన్యముగలవారను నింద స్త్రీలకేల ఆరోపింపవల యును? కఠినత్వముగాని పెంకెదనముగాని మనుజులకు వారి వారి దురదృష్టవిశేషముచేత యేర్పడిన దుర్గుణముగాని వేఱు గాదు. స్త్రీజాతియొక్క బాహుళ్యముమీద విచారించినచో స్త్రీలు సహజముగా దయార్ద్రహృదయలు, మృదుస్వభావలు గాని కఠినస్వభావ లెంతమాత్రము గారు. ఇది స్త్రీలు తమకు దాము బొగడుకొనుచు చెప్పినమాటగాదు. ఎందఱో పురుష వరేణ్యులు నొక్కివక్కాణించుచున్న విషయము. నిజమిట్లు న్నను అథవా యే స్త్రీలయందైనను కఠినత్వము పెంకెదనము ఉన్నదన్నచో అందులకు బాధ్యులు, చిరకాలమునుండియు స్త్రీలకు విద్యావివేకములు గల్గింపక స్వతంత్రమునీయక సర్వ విధముల నిర్బంధించిన పురుషులే.

స్త్రీలు మూర్ఖులు, చెడుతిరుగుళ్లు తిరుగువారట. పాతి వ్రత్యమునకు పేరు మోసిన భారతదేశమున జనించిన యీ సోదరునకు భారతసాధ్వీమతల్లుల నిట్లు దూరుటకు మనసె ట్లొప్పెనో! కల మెటులాడెనో! పాపము శమించు గాక! తాను

స్త్రీలనుగూర్చి వ్రాసిన యీ వ్రాతల కాసోదరుడు మనంబున పరితాపబడుటకంటె వేఱు నిష్కృతిలేదు.

'లాలనవిషయ మాలోచించిన పురుషులు వారి తరువాతవారుగాని, పైవారుకానేకా'రట. లాలన అనగా బుజ్జగింపు. కాఠిన్యత ఉన్నచోట లాలన ఉండదు. లాలన ఉన్నచోట కాఠిన్యత ఉండదు. కాని యీ రెండుగుణములు స్త్రీలయందుగలవని యీ వ్యాసకర్త అభిప్రాయము. అది యట్లుండ స్త్రీలయందు లాలించునేర్పు గలదన్నచో అది మెచ్చుకోదగిన ఉత్తమగుణమేగాని నిరసింపదగినది యెంతమాత్రము కాదు. స్త్రీలు యుగయుగములనుండి - పురుషులకు అమ్ముడుపోయిరి. సొంతముగా సంపాదించుటకుగాని తమ అక్కఱలను తీర్చుకొనుటకుగాని స్త్రీలకు సామర్థ్యములేదు. స్వాతంత్ర్యము లేదు. కావున వారేవిధమునను తమ యీప్సితములను భర్తలవలననే నెఱవేర్చుకొనవలసినవారుగానున్నారు. తన సర్వస్వము భర్తకు సమర్పించిన స్త్రీ, తనకు గావలసినవాటిని, భర్తవలన గాక మఱి యెవరివలన బడయును? కాన భర్తను లాలించి తనకు వలసినవి పొందును. ఒకరిఅనుగ్రహమువలన బడయవలసినవానిని లాలించి యడుగక దండించి యడిగినపొందుదురా? అది పీడనమెట్లగును?

వీనితరువాత మఱొక విషయమున్నది. స్త్రీలలో బాలవితంతువులకు పైతము పునఃపరిణయాధికారమును సున్నజేసి వారిని పుట్టు బ్రహ్మచారిణులుగానుంచి బహుళనిర్బంధములచే బాధించుచు తాము మాత్రము పునఃపునః పరిణయాధి

కారము ననుభవించుచున్న పురుషులు స్త్రీల నీవిషయమున నెటుల నాక్షేపింపగలరు? స్త్రీలే అధిక విషయేచ్ఛగలవారగుచో ఈ దేశమిట్లుండునో? అగాధసాగరము బడబాగ్నిని భరించినట్లు సమస్త ఐహికేచ్ఛలను తనయందిముడ్చుకొనగల వోర్పు స్త్రీకిమాత్రమేగలదు. సదా స్త్రీచిత్తము చెఱుప యత్నించునదే పురుషజాతి. స్త్రీలు మిక్కిలి నిగ్రహాబుద్ధిగల వారగుటచేతనే యీ ప్రేరణమునకు వశలుగాక నిలిచి యశో విరాజితలు కాగలుగుచున్నారు. స్త్రీలు మనోబలమునందు గూడ ఆధిక్యముగలవారట. సూక్ష్మబుద్ధిగూడ వీరి కధికమట. మగవానికి రెండు మూడు పర్యాయములు చెప్పవలసిన విషయము స్త్రీ కొక్కమాఱు చెప్పిన గ్రహించునట. పైగా అందముగూడ స్త్రీలదేనట. పురుషునకు లేని చక్కదనము, మృదుత్వము, ఆకర్షణశక్తి స్త్రీకిగలదట. పాపము! ఎన్నిటిని సహింపగల డీ వ్యాసకర్త! ఆకారణముచేతనే స్త్రీలు సర్వవిధముల మేధావినులమని క్రిందు మీదు గానక విఱ్ఱవీగుచున్నారట. పురుషులకంటె తమయం దధిక ప్రజ్ఞలుకలవని స్త్రీ లెవ్వరును ఇంతవఱకు భావించుటలేదు. జీవితమంతయు పురుషుల దాస్యమున గడపుచున్న స్త్రీలు పురుషులకంటె తామధికులమని యెట్లు విఱ్ఱవీగగలరు? వారధికులైనచో అధికముగానుండక అధమముగానుండనేల? ఒకవేళ యీ సోదరుని పరిశీలనా సామర్థ్యముచేత స్త్రీలు అధికులని తేటబడినచో అందులకు సృష్టికర్తయే బాధ్యుడు. కల్పలతా, ఆడుదై పుట్టుటకంటె అడవిలో మ్రానై పుట్టుట మేలని స్త్రీజన్మమందలి విసుగుతో

మనము సామెతగా జెప్పుకొనుచుందుము. ఇప్పుడు అన్ని ప్రజ్ఞలు స్త్రీలకే అధికముగా దేవుడు కూర్చినాడని యీవ్యాసము ప్రతిపాదించుచున్నది. కాని అన్నియు పరస్పరవిరుద్ధములుగానున్నవి. చూడుము. స్త్రీలకు ధైర్యసాహసములున్నవిగాని, పిఱికిదనముగూడ గలదట. కాఠిన్యముగలదుగాని మృదుత్వముగూడ గలదట. లాలనగలదుగాని పీడనగూడగలదట. ఏమి పరిశీలన! ఏమి రచన! ఈ స్త్రీల ప్రజ్ఞావిశేషముల నుగ్గడించుటలో యీ వ్యాసకర్త పలుతావుల పురుషులను స్త్రీలకంటె తక్కువవారుగా నిరూపించెను. ఇందులకు తానొప్పుకొనునేమోగాని యే పురుషులును సమ్మతింపరనుట నిశ్చయము. కాన యీ వ్యాసము స్త్రీలకుగాని పురుషులకుగాని తృప్తిగొలుపలేదని చెప్పవచ్చును. కాన మనమీ వ్యాసము విషయమై యెంతమాత్రము కినియరాదు. పాటేయేటియందు యెన్నో నీటిబుడగలు పుట్టుచుండును. వాని లెక్కయేమి? అయినను మనగృహలక్ష్మి పుట్టినది మొదలు స్త్రీలను సంభావించుచు పెక్కుమంది సోదరులు వ్రాసిన వ్యాసకుసుమములను తీసికొనివచ్చి మనకు సమర్పింప మనము గైకొనుచున్నాము. నేడు దారితప్పివచ్చిన యీ చిన్ని కంటకసుమమును స్వీకరింపజాలమా? ఈమాత్రపు సహనము మనకులేదేని మనము సాధ్వీనామమున కెట్లర్హులమగుదుము. మంచి చెడ్డలను రెంటిని మానముతో స్వీకరించినవారే మానవతులు !!

భావపురి,
1-5-33

ఇట్లు
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు—

నెచ్చెలీ !

కల్పలతా! నీ యజ్ఞాన మింతమేరలు మీరుచున్న దేమి! నీకంటెయు కాసులపేరును అమ్మివేయుదువా? అవి రెండును విక్రయించినచో యిప్పుడు బంగారము మిక్కిలి ప్రియముగా ఉన్నది కావున వేయిరూపాయలకు తక్కువ లేకుండా వచ్చునా? అవి యేఅయ్యకైన వడ్డీకిచ్చి నాలుగేండ్లూరుకొనిన అవి అసలును మించునా? అప్పుడు బంగారము నకుగూడ వెల తగ్గుటచే యింతకంటె అధికముగా నగలైన చేయించుకొందువా లేకున్న సుక్షేత్రమువంటి నాలుగైదు యెకరముల పల్లపుభూమినైన కొందువా? కొని దానిపై ప్రతి వత్సరము వచ్చు అయివేజుతో యేడాది కొక్కనగను చేయించుకుందువా? మంచిది, నీ ఊహాలన్నియు చక్కగా ఫలించినచో నిది లాభసాటిబేరమే సందేహాములేదు. కాని నీ ఊహా పంచాంగము చదువగ నాకు పక్కున నవ్వువచ్చినది. నీవంటి చదువుకొనినవారిలోనే యింతటి అజ్ఞానలు, ఆశాపూరితలు, ఆకాశహర్మ్యములు నిర్మించువారు ఉన్నప్పుడు ఇక నితరులను గూర్చి అనుకొననేల? నీ ఊహాలన్నియు చదువ పంచతంత్రము లోని పేలపిండిబాపనికథ జ్ఞాపకమువచ్చి నాలో నేను నవ్వుకొంటిని. కల్పలతా, మన ఊహాలన్నియు సవ్యముగా జరిగిన చక్కగనేయుండును కాని తానొకటి తలచిన దైవమొకటి

తలచుట మన అనుభవములోనున్న విషయము. వడ్డీకిచ్చువా రొకటి తలచి యిచ్చుచుండ తీసికొనువా రొకటి తలచి తీసికొనుచుందురు. పుర్రె కొకబుద్ధి జిహ్వ కొకరుచి యని లోక సామెతగాని ఈకాలములో ఒక్కొక్క పుర్రెకు వేలకొలది బుద్ధులు. 'వ్యవసాయాత్మికాబుద్ధి రేకేహకురునందన బహుశాఖాహ్యనంతాశ్చ బుద్ధయో వ్యవసాయినామ్' అని చెప్పినట్లుగా మన అవ్యవసాయపు బుద్ధులిట్టివి. ఇట్టి బుద్ధులు నమ్మి ఒడలిమీది నగలను విక్రయించి వడ్డీకిచ్చుట చేతివానిని విడిచి కాలివానినిపట్టిన చందముకాదా. కొంచెము నిదానముగా యోచించుము. నీ యొడలిపైనున్న పచ్చనిపసిడి నమ్మి నీవు తీసుకొనునదేమి? కాగితములు (కరెన్సీనోట్లు). ఆ కాగితములిచ్చి నీవు వ్రాయించుకొనునదేమిటి? కాగితము (ప్రామిసరీనోటు). ఆ కాగితమువలన నీకు వృద్ధిపొందునదేమి? కాగితములు. ఆ కాగితములు అధికమైనచో వారు నీకిచ్చునదేమిటి? కాగితము (ఐ. పి.). ఇంతతో ఆటకట్టు. పైగా ఈ వ్యవహారమంతయు అగుటకు నీ యొంటిమీద మిగిలియున్న పుస్తెయు పూసయుగూడ తెగనమ్మవలయును. వడ్డీఆశ మొదలు చెఱుచునని సామెత. స్త్రీకి యిరుపార్శ్వముల ఆస్తికి హక్కు లేదు. సొంతసంపాదనాశక్తి లేదు. ఇక యేనాటి నుండియో వచ్చుచున్నది వివాహకాలమందు ఏదియో కొంత సొమ్ముపెట్టు సదాచారము. ఇదిగూడ మనస్త్రీలకు మోటు, మొగవారికి వెగటుఅగుచో చెప్పెడిదేమి? ఇటీవల మన గృహలక్ష్ములలో 'బంగారమా? బ్యాంకా?' అను విషయముపై

జరిగిన తర్కవితర్కములు నీవును చూచియుందువు. దీనికింత చర్చ యేమని నే నానాడు వానినిగూర్చి ప్రస్తావింప మాని తిని. కాని నీవు ఈవిషయమై ప్రస్తావించుటచే నేను చెప్ప వలసివచ్చినది. ఆ వివాదములో కొందఱు స్త్రీలుగూడ బ్యాంకులోవేసికొనుట మంచిదనిరి. మఱికొందఱు నగలు చేయించుకొనుటయే యుత్తమమనిరి. ఈవిషయమై వివాద ములుచేసినవా రిరువురును, సహేతుకములగు కారణములనే చూపి తమ వాదములను సమర్థించుకొనిరి. ఏయుద్దేశముతో యోచించువారి కాయుద్దేశమును సమర్థించుకొను కారణ ములు దొరకకపోవు. కాని నేనుమాత్రము 'స్త్రీలకు నగలు అవసరములేదు, బ్యాంకియే మంచి'దనువాదనను సమర్థింప జాలను. స్త్రీ, ఆభరణములను నిమిత్తమాత్రముగా మోయు చున్నదేగాని యివి నిజముగా పురుషులవే. ఇవి, కేవలము స్త్రీల యలంకారములుగా నిలిచియుండక అనేకసమయము లలో అనేక సాంసారికకష్టములకు అక్కఱకు వచ్చుచున్నవి. నీకు కొంచెము ఓపికయున్నచో మన యిరుగుపొరుగుస్త్రీలనే మనకు పరిచయలగు మిత్రురాండ్రనే అడిగిచూడుము. 'మా వారికి కొండంతరోగమురాగా మెడలో నాను అమ్మి వైద్యుడి కిచ్చి మందునిప్పించినా'నని ఒక యిల్లాలనును. తన పెనిమిటి కేదో వ్యవహారపుచిక్కురాగా కంటెతాకట్టుపెట్టి సొమ్ము తెచ్చియిచ్చి పరిష్కారము చేసుకున్నామని మఱియొక యిల్లాలు చెప్పును. 'నా ఒంటిమీద నగలమ్మగా మావాడికి బియ్యే చెప్పించిన'దనును, మఱియొక గృహిణి. 'ఈ నగలు

నాల్గు ఉండబట్టేగా సంపాదించే మగవాడు పోయినా బిడ్డలూ నేనూ యింత మానుషముగా బ్రదుకుచున్నా'మని మఱియొక మానవతి జవాబుచెప్పును. మఱియొకసాధ్వి 'నానగలు నాల్గు తీసి కోడలికిపెట్టి పిల్లవానికి పెండ్లిచేసినా'మనును. వేఱొక భాగ్యశాలిని 'శిస్తువసూలువాళ్ళువచ్చి గొడ్డూగోదా జప్తు చేసి పరువుతీయుచుండగా మెడలో నాల్గుకాసులుండగా తాకట్టుపెట్టి ఆ శిస్తుచెల్లించి మర్యాద దక్కించుకొన్నా' మనును. ఎన్నియని చెప్పవచ్చును. ఈ గృహస్థజీవితములో డబ్బు యిబ్బంది బహువిధములుగానుండును. అది యెప్పుడు ఏతీరునవచ్చి యెదుర్కొనునో చెప్పజాలము. అట్టిసమయము లందెల్ల స్త్రీ యొడలిమీది నగలే శరణ్యములై యిట్టి గండ కత్తెరలనెల్ల దప్పించుచుండును. ఒకమాఱు నేను మా బంధు వులయింటికి వెళ్ళితిని. ఆ యింటియజమానుని కెవరో షావు కారు కార్పణ్యముమీదనో, కావలసియో కాని నూటయేబది రూపాయలకు వారంటు తెచ్చెను. వారు పేదవారుకారు. కాని ఆనాడు పెట్టెలో చిల్లిగవ్వలేదు. జవాను ఆగృహస్థును అటునిటు కదలనివ్వలేదు. ఇంట ఆలగోడు బాలగోడు. 'ఏమే' అన్నాడు పెనిమిటి. గృహిణి గ్రహించినది—చటు క్కున పెట్టెతీసినది. ఏదియో పమిటకొంగుచాటునపెట్టు కొని పొరుగింటికి పెత్తనమునకుపోయినట్లే పోయినది—నిమిస ములో వచ్చినది. పెనిమిటిచేతిలో గలగల కుమ్మరించినది. అతడు విముక్తుడైనాడు. నాకు ఆశ్చర్యమయ్యెను. నగలలో గల విలువ ఆనాడు విదితమయ్యెను. ఉవిదల యొడలిమీది

నగలవలె ఆపత్సమయమున నక్కఱకువచ్చున దేదియు గాదనుకొంటిని. మఱియు నివి స్త్రీలకంటె పురుషులకే యెక్కువ ఉపయోగపడునట్లున్న దే అనుకొంటిని. బ్యాంకిలో నిల్వచేసిన రొక్కముగాని, వడ్డీకిచ్చిన డబ్బుగాని, పొలములో పండిన గింజలుగాని యీవిధముగా సాయపడగలవా? ఈవిధముగా స్త్రీలయొడలిమీఁద నగలు భద్రపఱచుకొనుట స్త్రీలకంటె పురుషులకే అవసరమేమో అనిపించినది. ఇట్టి పెరటికల్పకము, కొంగుపసిడియగు నీ సొమ్ములుపెట్టుకొను నాచారమును రూపుమాపి మేనిసొమ్ములు ఊడలిచి దీపపుసెమ్మలవలె నుండి వానితో వడ్డీవ్యాపారము చేయనెంచుటయు, బ్యాంకిలో నిల్వచేయఁదలఁచుటయు వెఱ్ఱియోచనయని నాకు తోఁచుచున్నది.

స్త్రీలు నగలను ధరించు ఆచారము నిన్న నేటిది గాదు. యుగయుగములనుండియు స్త్రీలు నగలు ధరించుచున్నట్లు ఎన్నియో దృష్టాంతములు గలవు. సమస్త రాజభోగములు పరిత్యజించి సీతాదేవి పతివెంట సాంద్రారణ్యములలో సంచరింపవచ్చినప్పుడుగూడ నగలను ధరించియేయుండెననియు, రావణుఁడామెను అపహరించి వినువీధిని గొనిపోవునప్పుడు తనజాడ తెలియుటకై సీత, తన నగలను తీసి ఋశ్యమూకాద్రిపై చరించు వానరులముందు పడవేసెననియు, సీత పోకడను గుర్తించుటకవియే ఆధారమయ్యెననియు మనము రామాయణమున చదివియుంటిమి గదా. ఒక సీత యేమి! మన ప్రాచీనగాథలలో స్త్రీలను వర్ణించునప్పుడెల్ల వారితోబాటు

వారి యలంకారముల వర్ణననుగూడ మనము చదువుచుంటిమి గదా. ప్రాచీనచిత్రములను తిలకించినను ప్రతి స్త్రీబొమ్మయు నగలతో నిండియేయుండును గదా. కాన అతి ప్రాచీనమును, స్త్రీల సౌందర్యమును ఇనుమడింప జేయునదియు, ఆపదలయం దండయై ప్రోచునదియునగు నీ యాచారము సులభముగా నిరసింపదగినది కాదు.

మఱియు పాశ్చాత్యస్త్రీలను మదినిడుకొని ఆధునికులు దీనిని నిరసించుచున్నారు. ఆపాశ్చాత్యస్త్రీలుగూడ ఇప్పు డిప్పుడు ఆభరణములను ధరించుచున్నారు. అట్టిచో మన వారికీ బ్యాంకీపిచ్చి యేల?

ఇది యిట్లుండ గడచిన వత్సరము మన భరతదేశము నుండి 120 కోట్ల రూప్యముల విలువగల బంగారు విదేశములకు ఎగుమతి చేయబడినది. ప్రపంచమునందలి సమస్తవస్తు సముదాయములో విలువగలది బంగారు. దీనికంటె విలువైనవి రత్నాదులున్నను అవి నాణెములుగా వినియోగింపదగినవి కావు. కాన సర్వదేశములందును బంగారము గరిష్ఠప్రమాణముగా నెన్నబడుచున్నది. మనదేశమునందు చలామణియగు కరెన్సీనోటు నిచ్చినను, ఏ యితర నాణెమును ఇచ్చినను మనము మఱియొక దేశమునుండి ఒక్క చిన్న సూదినైనను కొనజాలము. అదే బంగారమగుచో అది నాణెరూపమున నుండకపోయినను ఒక వస్తువును కొనగలుగుచున్నది. కావుననే యేదేశము విశేషముగా బంగారమును కూడబెట్టుచున్నదో

ఆదేశము భాగ్యవంతమైనదిగా భావింపబడుచున్నది. ఇట్టి యమూల్యమై లక్ష్మీప్రదమైన బంగారము కడచిన కొలది మాసములలో మన భారతదేశమునుండి విశేషముగా నెగుమతి చేయబడుచున్నది. ఈ బంగార మెచ్చటిది? మనదేశపు శ్రీమంతుల గృహములలోనున్న పాతరలనుండి త్రవ్వబడినదా? లేక దొరతనమువారు విరివిగా చలామణి చేయుచున్న సువర్ణ నాణెములా? కాదు. ప్రతి స్త్రీయొక్క యొడలిమీదను ఆచారము ననుసరించియున్న కొద్దిపాటి బంగారమే, షాహు కారులు యెక్కువ ఖరీదు ఆశజూపి పరిగయేరినట్టు లేరగా లభించినదే. చేత కాసు లేదు. వస్తువులకు ధర లేదు. ఎక్కడ చూచినను పెద్దమ్మ తాండవమాడుచున్నది. ఈ స్థితిలో తమ యొడలిపై నున్న కాసంత పసిడినిగూడ కాజేసికొనినచో మన హిందూస్త్రీలవంటి తెలివితక్కువపెద్దమ్మ లెవ్వరు లేరని నలువురు నవ్వుదురు. బంగారము చాల ప్రియమైనది గాన ఇప్పుడు నగలను అమ్ముకొని బంగారము చౌకమైనతరువాత కొని లాభము తీయువచ్చునను వెఱ్ఱితో బొందున పసుపు కొమ్మును కట్టుకొని మెడలోని పుస్తెను గూడ మనవాళ్ళు అమ్ముచున్నారే గాని యీ నిలువుదోపు స్త్రీలకు దేశమునకు గూడ అమంగళకరము. కావున నీవు నీ నగలను విక్రయించుట నా కెంతమాత్రము సమ్మతముగాదు. సుడిగాడ్పులు విసరి నప్పుడు వాని తీవ్రత తగ్గువఱకు పథికుడు ఏ యింటివాకిటనో నిల్చి తలదాచుకొనునట్లు ఈ డబ్బుకక్కుర్తిదినములలో నీవు

నీకున్న నగలను విక్రయింపక, విపరీతపు ధరకు బంగారు కొని, క్రొత్త నగలను చేయించుకొనక యోపికపట్టియుండుము.

బ్యాంకులు మునుగుచున్నవి. శ్రీమంతులు దివాలా తీయుచున్నారు. పంటలు శిస్తులనే చెల్లింపజాలకున్నవి. ఈ విషమస్థితిలో స్త్రీలు తమవద్దనున్న బంగారము నిట్లు అమ్ముకున్నచో ఇంతకంటె మతిమాలిన పని యేమున్నది? దేశ నాయకు లిదే ఘోషించుచున్నారు. వినపడుటలేదా?

భావపురి
6-1-33

ఇట్లు,
శార ద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

కడచిన జూలై నెలలో నగలవిషయమై నేను వ్రాసిన జాబువలన నగలను విక్రయించు యత్నము విరమించితినని వ్రాసితివి. మఱియు నా లేఖనుగూడ మిక్కిలి ప్రశంసించితివి. మిత్రురాలియందు నీకుగల గౌరవమునకు ప్రేమకు మిగుల సంతసించుచున్నాను. కాని నీవలె యెల్లరును నానగలసమర్థనము విషయమై సదభిప్రాయము గలిగిలేరు. గృహలక్ష్మి పత్రికా రత్నముద్వారా నేను నీకంపిన జాబుచూచి యనేకులు మెచ్చి ప్రశంసాలేఖలనుగూడ పంపిరి. కాని కొందఱు తీవ్రముగా విమర్శించిరి. ప్రశంసల కేమిగాని విమర్శనముగల లేఖలలో నొకటి రెండు కనుము.

'శ్రీమతి శారదాదేవిగారికి దే.........రా.......
.......మ్మ, వ్రాయునది ఏమనగా జులై నెల గృహలక్ష్మి పత్రిక ద్వారా మీరు మీ మిత్రురాలగు కల్పలతకు వ్రాసిన జాబును పట్టి చూడగా వర్తమానయుగ పరిస్థితులను దెలిసికొనెడి వివేకము మీకు బొత్తిగాలేనట్లు తోచుచున్నది. ఏవిధముగానైన ప్రాతకాలపు పద్ధతులను సమర్థించుటే మీ ముఖ్యాశయముగా నున్నటులున్నది. లేకున్న తరుగుదల, యరుగుదల, యపహరణము, హత్యలు మున్నగు అనర్థములతోగూడిన నగలను మీరంతగా సమర్థింతురా? ధనము దాచుకొనుటకు

దగిన బ్యాంకులు, జీవితభీమాకంపెనీలు లేనినాటి మాటలు మీవి. వడ్డీలతో లాభములతోసహా ధనమును దాచిపెట్టి భద్రముగా నొసంగగలసంస్థ లెన్నియో, దేశమునందు నేడు విరివిగా వ్యాప్తియందుండ అసలుకే మోసముదెచ్చెడి యాభరణములు ధరించు పద్ధతి మీకెట్లు మంచిదిగా దోచుచున్నదో తెలియదు. ఇకనైన మీ రిట్టి యనుచితపు సలహాల నీయకుందురని నమ్ముచున్నాను.'

కల్పలతా! ఈమెగారి జాబునం దాతపారుష్యమైన నుండనిమ్ము. దానికి నేను కోపింపను కాని అనుభవజ్ఞానము లేమికి విచారమగుచున్నది. నగలనగా వివాహపు కక్కురితికి పెట్టుదురు. అది తప్పని సరి. మఱియు నెంత పిసినిగొట్టు పెనిమిటైనను నగయైనచో ఒకప్పుడు గాకున్న నొకప్పుడైన నొప్పుకొనునేమోగాని, 'నాపేర ప్రతి నెల యింతసొమ్ము బ్యాంకిలో వేయండి, నాజీవితము భీమాచేయించి వాయిదా వాయిదాకు రొక్కము కట్టండి' యనిన యెందఱిమగవా రిందుకు సమ్మతింతురో! ఎంతమంది స్త్రీలముద్దు చెల్లునో ఈమెగారికి తెలియదు. ధనసంపాదనా స్వాతంత్ర్యముగాని వారసత్వాధికారములుకాని లేని స్త్రీలు బ్యాంకులలో భీమాకంపెనీలలో ధనము దాచుకొనుట యెట్లు సంభవించునో నే నూహింపలేకున్నాను. ఇంతకును నీమెమాటలకు విలువలేదు. యేమందువా? ఈమెగారు తాను నగలుపెట్టుకొనకుండనుండి మనకు చెప్పుట లేదు. ఈమెగారి చెవికమ్మలు రెండువేల ఖరీదుగలవి. ముక్కున బెట్టుకొను బేసరి యైదువందలు. మెడలో నెక్లెస్ అయిదువేలు.

ఇక బంగారుసొమ్ములవిలువ, యేనాలుగైదువేలకో యుండును. శ్రీమంతురాలు గనుక బ్యాంకిలోగూడ కొంతరొక్కము నిలువచేసికొని యుండవచ్చును. కనుకనే 'కోడిగ్రుడ్డంత బంగారము లేనివారున్నారా?' అనుచున్నది. తిన్నమ్మ, మగని యాకలెఱుగదని సామ్యముగదా! దీని నిట్లుంచుము. మఱియొక సోదరుడుగూడ ఈవిషయమై దీర్ఘమైన లేఖ వ్రాసినాడు. దానినిగూడ చదువు.

'శ్రీమతి శారదాదేవిగారికి నమస్కరించి తమ ప్రియ సోదరుడు వ్రాయుమనవి. అక్కగారు! తాము తమ నెచ్చెలి కల్పలతమ్మగారికి నగలవిషయమై వ్రాసినలేఖ తిలకించితిని. మీలేఖ స్త్రీలకు నగలవలన గలుగు ప్రయోజనములను సమస్త విధముల నిరూపించుచున్నదనుటకు సందియములేదు. మఱియు బంగారమంతయు భారతదేశమునుండి కొనిపోబడుచుండుట వలని యనర్థకమును దెలియబఱచుటచే మీలేఖ మఱెంత ప్రశస్తమై కనుపట్టుచున్నది. భారతాంగనలు తమ యొడలి బంగారమంతయు వెఱ్ఱెత్తిన ట్లమ్ముకొనుచున్న యీ యెడను నందు మీలేఖ కొంతమందివెఱ్ఱికైన ఔషధమై పనిచేసినచో మేలే యనుకొందును, కాని నాకుమాత్రము కొన్ని సందియములు బాధించుచున్నవి. వానిని తమకు తెలియబఱచి సందేహ నివారణ గావించుకొనవలయునను తలంపుతో తమకు విజ్ఞప్తి పూర్వకమగు జాబు వ్రాయుచున్నాను. ఇట్లు వ్రాయుట తమరిని విమర్శించు నుద్దేశముతో గాదనియు విషయమును దెలిసికొన వలయుననెడి యభిలాషతో మాత్రమేననియు నాతోలిమనవి.

లోకమునందలి సమస్త వ్యవహారములు గుణదోషయుక్తములై యున్నవి. అటులనే నగలయందును గుణదోషములు గలవు. కాని మీరు కేవలము గుణములనుమాత్రమే పేర్కొని దోషములను ప్రస్తావింపక విడిచితిరి. ఇది న్యాయముగా నాకు దోచుటలేదు. నగలవలన సార్థక మెంతగలదో, అనర్థకము గూడ అంతగలదు. మన దేశమునందు సొమ్ములవలన గలుగు చున్నంత డబ్బుదండుగ మఱి దేనివలనను గలుగుటలేదు. ఆలోచించి చూడుడు. బంగారమునుకొని కంసాలి కిచ్చినదే మొదలు దానినాశనమునకు-కరగుటలోఁ గొంత, కాల్చుటలోఁ గొంత, చేతలోఁ గొంత, కోతలోఁ గొంత, మెఱుగుపెట్టుటలోఁ గొంత, ఈవిధముగా నెంతయో నష్టము. ఆపైన కంసాలికి సేత కూలి. సరి, నగయేదోవిధముగా తయారై యింటికి వచ్చునే యనుకొందము. అంతతో నైనదా? వానిలో విరిగిపోవునవెన్ని! అఱిగిపోవునవెన్ని! అసలుపోవునవెన్ని! వీనికి మరమ్మతులు మరల చేయించుట, ఇంతలో కంసాలి మరల యేదైనా క్రొత్త నమూనా చూపించెనా, మరల దానిని చేయించుకోవలయునని బులుపు. అందుకొఱకు మంచిదిగానున్న దానినిగూడ మరల చెడగొట్టుట. ఇక శ్రీమంతులమాట చెప్పనే యక్కఱలేదు. వారి కెప్పుడు నగలు చేయించుకొనుటే పని. కాని యందువలన నెవరికిని బాధలేదు. పేదతనముచే నల్లాడు స్వర్ణకారుల కుటుంబములు కొన్ని వీరివలన సతము పోషింపబడుచుండును. ఇదియు నొకమేలే. కాని సామాన్యులనుగూర్చి తాము యోచింపవలయును. సామాన్యకుటుంబములనగా అన్నవస్త్ర

ములకుమాత్రము పూటాపూటికిగా సరిపోవు నాదాయముగల కుటుంబములన్నమాట. ఇట్టి కుటుంబములకు జెందిన స్త్రీలు నగలు కావలయునన్నచో నెక్కడినుండివచ్చును? హిందూ స్త్రీలకు తాహతెఱుగనిసొమ్ముల పిచ్చి. యెంతయెక్కువగా నగలుపెట్టుకొనిన నంత గొప్పవారుగా భావింపబడుదుమని వారిభ్రాంతి. ఇందువలన నగలకొఱకు వారు విశేషముగా శ్రమపడుదురు. భర్తల పీడింతురు. అలుగుదురు. జగడము లాడుదురు. ఏడ్తురు. పస్తులుందురు. అపహరింతురు. అక్రమంబులు చేతురు. కాన నాడువారి కీసొమ్ములభ్రాంతియే లేకున్నచో నెంతయో మేలుగదా. స్త్రీలు నగలుపెట్టుకొనుట నాకు యిష్టములేకపోలేదు. కలిగినవారు పెట్టుకొనవచ్చును. లేనివారు మానవచ్చును. కాని నగలలోనే గొప్పతనమంతయు గలదనియు నవిగలవారే గొప్పవారు, గౌరవార్హులు అను భ్రాంతి స్త్రీలకు తొలగవలయునని నా యభిప్రాయము.

రెండవది-చోరభయము. సొమ్ము పాపిష్ఠిది. పచ్చని బంగారము స్త్రీల యొడలిపై చూడగనే దొంగల కన్నులు గుట్టును. మనదేశములో నూటికి తొంబదితొమ్మిదిమంది దొంగలను స్త్రీల యాభరణములే పోషించుచున్నవి. ప్రతి దేశమునందలి స్త్రీలును స్వేచ్ఛగా దిరిగి తమతమ కార్యములను చక్కబెట్టుకొనుచుండగా నలంకారములనెడు సువర్ణశృంఖలలచే నిబద్ధలై భారతమహిళలు ఒంటరిగా వాకిలిలోనికి బోవుటకు గూడ నశక్తలై యల్లాడుచున్నారు.

ఇక మూడవవిషయము స్త్రీలు తాము ఆభరణములను ధరించి యుపాయముల పాలవుటయేగాక, తమ బిడ్డలకుగూడ నగలుపెట్టుట. ఆలోచించి చూచినచో నియ్యది స్త్రీలు తాము నగలు ధరించుటకంటెగూడ ప్రమాదకరమైనది. స్త్రీలు పెద్దవారు గనుక స్వసంరక్షణ సామర్థ్యమును కొంతగాకున్న కొంతయైన గలిగియున్నారు. వారియొద్దనున్న నగల నపహరించుటకు దొంగలకుగూడ భయమే. కాని బిడ్డలవిషయములో వారికి నిర్భయము. నోరులేని పసిబిడ్డలు గాన వారిని కడు సులభముగా వంచించి యెటకో గొనిపోయి వారిని బాధించి నగలను కాజేయుదురు. మఱియు నందుకొఱకై యాబిడ్డలను హత్యజేయుదురు. ఇంత అపాయకరమగు పరిస్థితిని తమ కన్న బిడ్డలకు తెచ్చిపెట్టు తల్లులు వారికి శత్రులా మిత్రులా?! బిడ్డలు నగలు కోరరు. పెట్టుకొనిన సంతోషములేదు. పెట్టుకొనకున్న విచారములేదు. కేవలము తల్లులు తమ నేత్రానందముకొఱకు తమ ముద్దుబిడ్డల నిట్టియాపత్సముద్రమున ద్రోయుట యుక్తమేనా? ఆపత్కరమైన యీ యానందము స్త్రీలకు నగలపైగల వ్యామోహమువలన నేర్పడినదేగదా. సోదరీ! తాము దీనినెట్లు సమర్థింతురు? బిడ్డల నగల నపహరించుటకై తస్కరులుచేయుచున్న భయంకరాత్యాచారము లెన్నియో ప్రతిదినము మీస్త్రీల చెవుల కెక్కుచునేయుండును. అయితే వానిని వినియు విననట్లులుండి బిడ్డలకు నగలను పెట్టుటకు మురువు జెందుచునే యుందురు. ఇదియెంత పైశాచికానందము!

గమనింపుడు. నగలవలన యిన్ని యనర్థకములు గలవు కాన నగలవలని యనర్థకము, ప్రయోజనముకంటె కొలదిగాదు.

సోదరీ! నాకు గల సందియములను తమకు వ్రాసితిని. నా పేరుతోగాని నావిలాసముతోగాని నిమిత్తములేదు. నేను వ్రాసిన విషయమునందలి మంచిచెడ్డలను తాము, సారద బుద్ధితో గ్రహించి తమ సోదరీ రత్నములకు వెల్లడించిన చాలును.

ఇట్లు
తమ యనుంగు తమ్ముడు.'

కల్పలతా! ఈ సోదరు డెవడోగాని నిజముగా స్త్రీ జనమునకు సోదరుడే. ఈ సోదరుని విమర్శన మెంత నిశితముగా నున్నదో యతనిరచన మంతసరసముగను మర్యాదకరముగను నున్నది. భగినీహితైషియగు నీసోదరున కనంతశుభము లొదవుగాక! మనము మంచిని తెలిసికొనినంత సులభముగా చెడుగును తెలిసికొన జాలమనుట కీసోదరుని లేఖయే సాక్షి. నాచేతిలోని పుడకను దీసికొని నాకన్నునే పొడిచినట్టులున్నదీ లేఖ. ఈలేఖయందాసోదరునిచే చూపబడిన మూడులోపములు మనస్త్రీలయందున్నమాట వాస్తవము. వీని నేవిధముగను కప్పి పుచ్చుటగాని సమర్థించుటగాని పనికిమాలినపని. ఈసోదరుడు, నావాదమ్ము నేమాత్రము ఖండింపలేదు. అనుచిత మనలేదు. వానితోబాటు యీలోపములుగూడ గలవు, పరిశీలించుకొను డనెను. మంచిది. ప్రతిదీ గుణదోషయుక్తమని యీ సోదరుడు తొలుతనే వ్రాసెనుగదా. గుణదోషములు లేనివస్తువు

జగముననే లేదనినపుడు, దేనిని గూడ వాడుకొనకుండ నెట్లుండ గలము? నిప్పున్నది. అది చాల అపాయకరమైన వస్తువే. అజాగ్రత్తగానుండిన చేయికాలును, గుడ్డకాలును, కొంపయే యంటుకొనును; అదిలేక యొక్కపూటయైనను గడవదు. మఱి దానిని విసర్జించుటెట్లు? అధికగుణయుతమైన దానిని స్వల్ప దుర్గుణము లున్నను వినియోగింపక తప్పదు. కాన సోదరుడు చెప్పిన యాక్షేపణలకు గుఱి కాకుండా స్త్రీలు నగలను వినియోగింపదగును. నగలుండుట మంచిదనగా నగలు లేనివారి నగౌరవింపమనిగాని, నగలకొఱకు భర్తలను పీడింపమనిగాని, నగలనుబెట్టి తమ బిడ్డలను నపాయమున ద్రోయమనిగాని యర్థమా? ఎన్నిటికినిగాదు. అన్నిటిమాటల కేమిగాని తమ పసిబిడ్డలకు నగలనుబెట్టి యానందించు తల్లుల యానందము నిజముగా పైశాచికానందమే. మొన్ననేగదా బెడవాడయందొక బాల నగలకొఱకై హత్యచేయబడినట్లు వింటిమి. సోదరీ! ఇట్టి యత్యాచారములు జరుగుచున్నను స్త్రీలవివేకముగా వర్తించుచో పరులయాక్షేపణలకు గురియగు టాశ్చర్యమా!

భావపురి,
1-1-34

ఇట్లు
శారద.

సౌభాగ్యవతియగు కల్పలతకు:—

నెచ్చెలీ!

కడచిన డిసెంబరునెల 23-వ తేదీని మహాత్ముడు గుంటూరు వచ్చినప్పుడు నేను గుంటూరు వెళ్లుదుననియు మహాత్ముని దర్శింతుననియు కలలోనైన ననుకొనలేదు. అనుకొనకుండ నప్రయత్నముగ నత్యవసరముగ నొకానొక పని మీద మహాత్ముడు ఱేపు గుంటూరు విచ్చేయుననగ నాటి సాయంత్రము గుంటూరు వెళ్లుట తటస్థించినది. తమయందు భక్తి గౌరవములు గలవారి నేదియో వ్యాజమున తమకడకు రావించి దర్శనమొసంగు శక్తి మహాత్ములకు గలదేమో!

ఆనాటిరాత్రి గర్తపురలక్ష్మి ప్రశాంతముగ నిద్రింప లేదు. తన గృహప్రవేశము సేయనున్న వ్యక్తి, యొక లోకైకపూజ్యుడు! తల్లి నెట్లు లలంకరింతమనియు, మహాత్ము నెట్లు సత్కరింతమనియు, నాతురతతో కార్యవ్యగ్రులై తిరుగుచున్నవారు తనయనుంగుబిడ్డలు! ఇంక పురలక్ష్మి కెట్లు నెమ్మదిగ నిద్రబట్టును?

మేమొక్కరమే గాదు ఆ గుంటూరునందుగల అరువదివేల జనులానాడు తెల్లవారుజామున మూడు గంటలకే నిద్రనుండిలేచిరి. కాల్యము లేమి తీర్చుకొనిరో గృహకృత్యము లేమి చేసిరో, గృహంబు లెవరికొప్పగించిరో, ఏమో! శ్రీకృష్ణుని మురళీగానంబునకు మోహితలై యిల్లు వాకిండ్లు

వీడి పతిసుతాదులను వదిలి పరుగెత్తుకొనిపోయిన గోపాంగనల వలె పురవాసులెల్లరు మహాత్ముని దర్శనమున కొక్కటే పరుగు. ఆనాడు కృష్ణుని చూడనేగినవారు స్త్రీలును, అందు ముఖ్యముగా గొల్లపడంతులును మాత్రమే కాని నేడు మహాత్ముని గన నేగినవారిలో స్త్రీలు, పురుషులు, బాలురు, బాలికలు, ధనికులు, దరిద్రులు, నాగరికులు, అనాగరికులు, శ్రోత్రియులు, సంస్కారప్రియులు, అవర్ణులు, సవర్ణులు, ఎల్లరు నుండిరి.

అయశ్శకటములు, అశ్వశకటములు, ద్విచక్రశకటములు, వృషభశకటములు, ఓహో ఒక వాహనమా! ఆనాడు బేడబాడుగ బండి పావలా పలికినది. పావలాబండి యర్ధ పలికినది. అయిననేమి? డబ్బెవరికి లెక్క? మహాత్ముని దర్శనమబ్బిన చాలును! ఇక కాలినడకను వచ్చువారి సంఖ్యకు గణనమే లేదు. ఆ పెద్దరోడ్డు కిరుప్రక్కలనున్న కాలిబాటలకు తెంపులేదు. ఏరాత్రినుండియో జనవాహిని యా కాలిబాటల హూదుగా వర్షాకాలపు వెల్లువవలె స్వరాజ్యమైదానమునకు జొచ్చుచునేయున్నది.

ఒకవంక వడవడ వడకించు చలి, యొకవంక జల్లుమను మంచు, నొకవంక హోరుమను నీదరగాలి, యావేకువ మనుజులుల్లాసముగా దిరుగుసమయ మెంతమాత్రముకాదు. దుప్పటిపై దుప్పటి ముసుగుపెట్టుకొని గృహాంతర్భాగంబున బరుండి జాము ప్రొద్దెక్కినను జనులు లేవ బద్ధకించెడిసమయ మది.

అట్టి యీసమయమున ప్రజ లావిధముగా పరువులుదీయుచు విచ్చేయుట కా మహాత్మునియందు ప్రజల కెంతటి భక్తివిశ్వాసములుగలవో ప్రేమగౌరవములుగలవో ప్రజాహృదయము నావిధముగా కొల్లగొనుట కా మహాత్మునియం దెట్టి మహచ్ఛక్తిగలదో!

అప్పు డైదుగంటలైనది. అప్పటికే జను లత్యధికముగా సభాప్రదేశము చేరుకొనియుండిరి. స్త్రీలకు ప్రత్యేకింపబడిన ప్రదేశముమాత్ర మింకను నిండుకొనలేదు. కాన మాకు మంచిస్థలమే లభించెను. తెల్లవా ఱుచున్నకొలది జనులు వెల్లువవచ్చినట్లు వచ్చి యెల్లప్రదేశము నింపివేసిరి. నియమవ్రతుఁడగు మహాత్ముడు నిర్ణీతసమయమునకు వచ్చుననియే జను లావిధముగా వచ్చి, చిత్తము మహాత్ముని మీఁదను, నేత్రము లాయన వచ్చెడి బాటమీఁదను, వీను లాయన యెక్కివచ్చెడి మోటారుబండిధ్వనిమీఁదను బెట్టుకొని తదేకనిష్ఠతో నిరీక్షించుచు గూర్చుండిరి. నిర్ణీతసమయమునకు సభోపక్రమణము సేయజాలని యాంధ్రుల యలసభావ మాంధ్రదేశపు గాలి సోకుటచే మహాత్మునకుఁగూడ కొద్దిగా నబ్బెనో యేమోగాని మహాత్ముఁడు నిర్ణీతసమయమునకు రాలేదు. ఏదో కారు ధ్వని వినిపించుటయు సముద్రమునుండి వెలువడెడి తరంగధ్వనివోలె జనసమూహమునుండి యొక గొప్ప యుత్సాహధ్వని యుద్భవించుటయు, నందఱు మోరలెత్తి చూచుటయు, మహాత్ముని కారు కాదనగనే చప్పున నుపశమిల్లుటయు, రెండు మూడు మారు లాయెను.

ఇంతలో మహాత్ముని సత్కారసభలో తానుగూడ పాల్గొన దలచియా యన్నటుల సూర్యభగవాను డుదయించి చలిచే, మంచుచే బాధబడుచున్న జనులకు తన లేయెండ ప్రసారముచే చలినిబాపి, మంచు విరియింపజేసి సుఖ మొదవజేసెను.

ఆహ్వానసంఘమువారి యేర్పాటులు ప్రశస్తముగనుండెను. స్త్రీ పురుషులకు ప్రత్యేకప్రదేశము లేర్పాటుచేసిరి. ఆ జనులమధ్యనుండి మోటారుబండ్లు నిరాటంకముగా వచ్చిపోవుటకు బాటలువేసిరి. మహాత్ముని దర్శన మెల్లరకు లెస్సగా లభించుటకై నట్టనడుమ నున్నతమైన వేదిక నిర్మించిరి. అది పాలముకాపరి, యొడిసెలతో పిట్టలతోలుటకై నిర్మించుకొనిన మంచెవలెనుండెను. దానిపై నెక్కుటకు చెక్కలతో సోపానములు నిర్మించిరి. ఆ మంచెపై మహాత్ముడు కూర్చుండుటకు పరుపులు బాలీసులు అమర్చిరి. మరల జనసమూహములో నొక యుత్సాహికధ్వని వెలువడెను. 'వచ్చె, వచ్చె, అదిగో, అదేకా'రను కేకలు మిన్నుముట్టెను. అనుకొనుచుండగనే మహాత్ము డధిరోహించిన కారు మందగమనముతో నేతెంచి వేదికకడ నిలిచెను. ఏ మహాత్ముని దివ్యసందర్శనమునకై యా యనంతజనసముదాయము శీతవాతాతపంబుల లెక్కసేయక కాలహరణంబును గమనింపక తదేకదృష్టితో నిరీక్షించుచున్నదో, ఏ మహాత్ముడు సర్వప్రపంచైకగురుడని కీర్తింగాంచెనో, ఏ మహాత్ముని మహత్తరకృషిపై త్రింశత్కోటిభారతీయు లాశలుపెట్టుకొనియున్నారో, ఏ మహాత్ముడు దరిద్రనారాయణసేవకుడని విఖ్యాతబిరుదు

గొనెనో, ఏ మహాత్ముడు దీనహరిజనావనదీక్షావ్రతుడై యావ ద్భారతదేశమును గ్రుమ్మరుచున్నాడో, ఆ మోహనదాస్ కరమ్‌చంద్‌గాంధీ మహాత్ముడు కారుదిగి వేదికపై నధిరోహించి యెల్లరి కొక్కమారు నేత్రపర్వముగ దర్శనమొసగెను.

మహాత్ముని దర్శనమున కాయత్తులై వచ్చుటకును, వేచియుండుటకును నెంతయో కాలము పట్టెనుగాని యాయన వచ్చిన తరువాత జరిగిన కార్యక్రమము, కొలది నిముసములలో నయ్యెను. వెంటనే మహాత్మునకు ఖద్దరుహారములు వేయబడెను. స్వాగతపత్రములు సమర్పింపబడెను. బహుమానము లొసంగబడెను. తదుపరి మహాత్ముడు హిందీలో నుపన్యాసమొసంగ నారంభించెను. శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగా రనువదించిరి. ఒడిసెలవిసరుటకై కూర్చుండిన పొలముకాపరివలె మంచెమీద కూర్చుండిన మహాత్ముడు, తొలుదొల్త విసరిన ఒడిసెలవ్రేటు న్యాయవాదుల యెదపై తకిమని తగిలెను. వారు, మితముగా పొదుపుగా 145 రూపాయలు మాత్రమే మహాత్మునకు సమర్పించిరట. పురమునందలి గురునాథదేవాలయమును కాశీవిశ్వేశ్వరాలయముగా మార్చిన కారణము చెప్పెను. సవర్ణులు సమ్మతించినచో మూడునెలల కది హరిజనులకు తెఱువబడుననెను. సవర్ణులు అవర్ణులయెడ దాక్షిణ్యముగా వర్తింపవలయుననెను. తదుపరి తనకు సమర్పింపబడిన కానుకలు, అభినందనపత్రములు వేలమువేయ దొరకొనెను. చట్టములోనమర్చిన అభినందన పత్రము, ఆశ్రమము, రాట్నము మున్నగు వినోదశిల్పములు,

బంగారు తక్కీ వగైరాలు వేలమువేయబడెను. తరువాత సభలో కానుకలు వసూలుచేయబడెను. బంగారునగ లీయుడని స్త్రీలను పలుమారు ఎచ్చరించిరి. గాని వారి యెచ్చరికను గమనించినవారు లెక్క కొకరిద్దఱు మాత్రమే యుండిరి. అంతట సభ సమాప్తమయ్యెను. మహాత్ముఁడు వెడలుచుండగా చూడవలయునను నాతురతతో స్త్రీలు ముందుకు త్రోసికొనిరి. ముందువరుసలోనున్న మేమా త్రోపిడికి మిక్కిలి నలిగిపోతిమి. నేనెత్తుకొనియుండిన పదినెలల బిడ్డడగు మా మేనల్లుఁడా యొత్తిడి కాగజాలక కీరుమని అర్చి యేడువసాగెను. ఇంతలో మహాత్ము డెక్కిన అయశ్శకటము వెడలిపోయెను. గుంపు, త్రోసికొనుట మాని నిలబడెను. స్త్రీల త్రోపిడిచే యుక్కిరిబిక్కిరియగుచున్న మేము, తెప్పరిల్లి యింటికిబోవుటకుద్యుక్తుల మైతిమి.

కన్నులార మహాత్ముని దర్శించితిని. చెవులార నాయన వాక్కువింటిని. సంతోషమే కాని యొక్క కొఱతమాత్రము తీరలేదుగదా యని మనస్సులో కొంచెము కించగానున్నది. ఏమన ఆంగ్లవనితయయ్యు మహాత్ముని తల్లివలె పోషించుచు, బిడ్డవలె ప్రేమజూపుచు, అనవరతము మహాత్ముని సేవించుచున్న మీరాబాయియను నామాంతరముగల స్లేదుకన్యను చూడవలయునని నాకు మహాభిలాషయుండెను. కాని ఆమె కనుపించలేదు. ఆమె కీ మహాసభలతో సంబంధమే లేదట. మహాత్ముఁడు విడియుచోటునకు ముందుగా బోవుటయు, ఆయనకు వలయు సౌకర్యములన్నియు జాగరూకతతో నమర్చుటయు, నిదియే

యామె పనియట, ఆహా! మీరాబాయిభాగ్యము! దేశీయులగు బంధుమిత్రాదులలో నేరికిని బడయరాని మహాత్మునిసేవా భాగ్యము, మీరాబాయి లభింప జేసికొనెనుగదా! నిజముగా మీరధన్య! మఱియామె దర్శనభాగ్యమొదవని నేను ?......

ఆంగ్లదొరతనమువా రధికారరీత్యా మహాత్మునకు గల్గించుచున్న కారాగృహ శిక్షాది నిరంతర క్లేశములకు పరిహారముగా నాంగ్లదేశ మర్పించుకొనిన వెలలేని కానుకేమో స్లేడుకన్య !

నేనుగూడ గుంటూరు వచ్చి మహాత్ముని జూడవలయు ననుకొంటి ననియు, మాచిన్నపిల్లవాని కాకస్మికముగా జ్వరము తగిలినందున వచ్చుటకు వీలుకాలేదనియు, వ్రాసితివే ! హరిజనోద్ధరణోద్యమ మారంభించినప్పటినుండియు మహాత్ముడనిన నీకు కోపముగా !

భావపురి
1-2-34

ఇట్లు,
శా ర ద.

PRINTED AT
THE LODHRA PRESS,
EGMORE, MADRAS.